
'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 251


శనివారం 2-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రపంచానికి పెను చీకట్లే

మానవాళి భవిష్యత్ భూగోళాన్ని చీకట్లోకి నెట్టేస్తుందన్న ప్రధాని మోదీ -6లో



మార్కుల డివిజన్ ప్రకటించం

10, 12 తరగతుల ఫలితాలపై సీబీఎస్‌ఈ పరీక్షల విభాగం కీలక ప్రకటన -6లో

రాష్ట్రానికి వర్షసూచన



రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. - వివరాలు 14లో

కేఆర్ఎంబీకి సాగర్ నిర్వహణ బాధ్యత

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించాలని.. కేంద్ర హోం శాఖ చేసిన ప్రతిపాదనలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అంగీకరించాయి. ప్రాజెక్టు పర్యవేక్షణను సీఆర్‌పీఎఫ్ బలగాలకు అప్పగించేందుకు కూడా ఆమోదం తెలిపాయి. -5లో

ఆగమెందుకు.. మళ్లీ మనమే!



ప్రగతిభవన్‌లో తనను కలిసిన నేతలతో సీఎం కేసీఆర్

- శుక్రవారమంతా ప్రగతిభవన్‌లో కేటీఆర్, హరీశ్‌రావులతో సమీక్ష... సెగ్మెంట్ల వారీగా అందిన నివేదికలపై పోస్టుమార్టం
- ఓట్ల లెక్కింపుపై సూచనలు.. పార్టీ అభ్యర్థులతో టచ్‌లో ఉండాలని ఆదేశం... కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, ఇతర అంశాలపై దిశానిర్దేశం

ఈ నెల 4న మధ్యాహ్నం సచివాలయంలో మంత్రివర్గ సమావేశానికి నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ''ఆగమాగం, పరేశాన్ ఎందుకు అయితున్నరు. మళ్లా మనమే గెలుస్తున్నం. ఈ రాష్ట్రానికి సుపరిపాలన అందించబోతున్నాం. రెండు రోజులు నిమ్మళంగా ఉండండి. 3వ తేదీన అందరం కలసి సంబురాలు చేసుకుందాం..'' అని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పార్టీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం పొద్దంతా ఓటింగ్ సరళి, ఇతర అంశాలపై సమీక్షించిన సందర్భంగా నేతలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. మరోవైపు ఈ నెల 4న (సోమవారం) మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగుతుందని సీఎంవో నుంచి ప్రకటన వెలువడింది. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుండటంతో.. మిగతా 2వ పేజీలో ▶

మ్యాజిక్ ఫిగర్.. ఎంతెంత దూరం?

- అధికారంలోకి వస్తున్నామా, లేదా అంటూ కాంగ్రెస్ శ్రేణుల్లో విస్తృత చర్చ
- గ్రామాలు, మండలాల వారీగా పోలింగ్ లెక్కలతో పార్టీ అభ్యర్థులు బిజీ...
- హైదరాబాద్ చేరుకున్న రేవంత్, భట్టి
- హంగ్ వస్తే గెలిచిన వారంతా కర్ణాటకకే!

5లో

18-22 సీట్లు గెలుస్తాం

బీజేపీ నేతల ఆశాభావం

- ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 10 నుంచి 12 సీట్లు
- గ్రేటర్ హైదరాబాద్‌లో 4, రంగారెడ్డి, వరంగల్, మెదక్ జిల్లాల్లో ఒకట్రెండు సీట్ల గెలుపుపై ముఖ్యనేతల ధీమా
- పోలింగ్ శాతం పెరగడంపై సంతృప్తి

- వివరాలు 5లో

రిగ్గింగ్ ఆరోపణలు అవాస్తవం

కొన్ని కేంద్రాల్లో రాత్రి 9.30 వరకు ఓటింగ్ కొనసాగింది

అందుకే సాయంత్రం 5 గంటలతో పోల్చితే పోలింగ్ శాతం పెరిగింది: వికాస్‌రాజ్



- ఆర్వోలు, పరిశీలకులు స్క్రూటినీ నిర్వహిస్తున్నారు
- రిగ్గింగ్ ఆరోపణల అంశంపైనా పరిశీలన జరుపుతారు
- ఆ తర్వాతే తుది పోలింగ్ శాతం, ఆరోపణలపై స్పష్టత వస్తుంది
- అసెంబ్లీ ఎన్నికలకు 'సాగర్' ఘటనతో సంబంధం లేదు
- 3న ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడి

3లో

ఓటర్ల సంఖ్య పెరిగినా పోలింగ్ తగ్గింది

- ఈసారి 26.78 లక్షల మంది అధికంగా ఓటు
- కానీ పెరిగిన ఓట్ల సంఖ్య మేరకు జరగని పోలింగ్
- 2018లో 73.2% పోలింగ్.. ఈసారి 71.34 శాతమే

కాంగ్రెస్‌కే పూర్తి మెజారిటీ!

ఇండియా టుడే- యాక్సిస్ మైఇండియా ఎగ్జిట్‌పోల్స్ అంచనా

కాంగ్రెస్‌కు 42 శాతం ఓట్లతో 63-73 స్థానాలు

బీఆర్‌ఎస్‌కు 32 శాతం ఓట్లతో 34-44 స్థానాలు

బీజేపీకి 4-8 సీట్లు.. ఎంఐఎం సహా ఇతరులకు 5-8 సీట్లు

ప్రభుత్వ వ్యతిరేకత, సిట్టింగ్‌లపై ప్రజాగ్రహం ప్రభావం చూపినట్టు వెల్లడి

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లను సాధిస్తుందని ఇండియా టుడే- యాక్సిస్ మైఇండియా ఎగ్జిట్‌పోల్ సర్వే పేర్కొంది. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను.. అధికార బీఆర్‌ఎస్‌కు 36 శాతం ఓట్లతో 34-44 సీట్లు వస్తాయని, కాంగ్రెస్ పార్టీ 42 శాతం ఓట్లతో 63-73 సీట్లు సాధించి అధికారంలోకి మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్‌కే పూర్తి మెజారిటీ!

▶ మొదటి పేజీ తరువాయి

వస్తుందని అంచనా వేసింది. బీజేపీకి 14 శాతం ఓట్లతో 4 నుంచి 8 సీట్లు రావొచ్చని.. ఎంఐఎం 8 శాతం ఓట్లతో 5–7 సీట్లు సాధించవచ్చని తెలిపింది. రాష్ట్రంలో గురువారం పోలింగ్ ముగియగానే.. జాతీయ, ప్రాంతీయ మీడియా సంస్థలు, సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ సర్వేలను విడుదల చేశాయి. చాలావరకు కాంగ్రెస్ వైపు మొగ్గు ఉన్నట్టు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఇండియా టుడే- యాక్సిస్ మైఇండియా శుక్రవారం తెలంగాణ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ప్రకటించింది. బీఆర్ఎస్ సర్కారుపై వివిధ వర్గాల ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత ఎగ్జిట్‌పోల్ సర్వేలో కనిపించిందని పేర్కొంది. ముఖ్యంగా సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో చాలా మందికి మళ్లీ టికెట్ ఇవ్వడం, వారిపై స్థానికంగా నెలకొన్న తీవ్ర వ్యతిరేకత ప్రభావం చూపిందని విశ్లేషించింది.

ప్రాంతాల వారీగా పరిశీలన జరిపి

రాష్ట్రంలో ఉత్తర, మధ్య (సెంట్రల్), దక్షిణ తెలంగాణ, హైదరాబాద్ ప్రాంతాల వారీగా ఇండియాటుడే–యాక్సిస్ ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేసింది. ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగిందని.. హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌దే పైచేయిగా ఉందని వివరించింది. దక్షిణ, మధ్య తెలంగాణలలో కాంగ్రెస్ పూర్తి ఆధిపత్యాన్ని కనబరిచిందని, ఈ ప్రాంతాల నుంచే ఎక్కువ సీట్లు గెలిచే అవకాశం ఉందని పేర్కొంది.

- ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌కు 13, కాంగ్రెస్‌కు 15, బీజేపీకి 5 సీట్లు రావొచ్చని పేర్కొంది.
- దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్‌కు 6, కాంగ్రెస్‌కు 27, బీజేపీకి ఒక స్థానం వస్తాయని అంచనా వేసింది.
- మధ్య తెలంగాణలో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 22 సీట్లు సాధించవచ్చని తెలిపింది.
- హైదరాబాద్‌లో బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 3, బీజేపీ 1, ఎంఐఎం 6 చోట్ల గెలిచే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసింది.
- తెలంగాణ తదుపరి సీఎంగా కేసీఆర్ ఉంటే బాగుంటుందని 32 శాతం మంది, రేవంత్‌రెడ్డి కావాలని 21 శాతం మంది, ఇతర కాంగ్రెస్ నాయకుడు సీఎం కావాలని 22 శాతం మంది, బీజేపీ నాయకుడు ఉంటే బాగుంటుందని 12% మంది తమ సర్వేలో పేర్కొన్నట్టు వెల్లడించింది.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్

	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	మజ్లిస్/ఇతరులు
ఇండియా టుడే - యాక్సిస్ మై ఇండియా	34-44	63-73	4-8	5-8
టైమ్స్ నౌ-ఈటీజీ	37-45	60-70	6-8	5-7
రిపబ్లిక్ టీవీ	46-56	58-68	4-9	5-9
ఇండియా టీవీ - సీఎన్ఎక్స్	31-47	63-79	2-4	5-7
ఏబీపీ-సీఓటర్	38-54	49-65	5-13	5-9
జన్ కీ బాత్	40-55	48-64	7-13	4-7
టుడేస్ చాణక్య	33	71	7	8

గురువారంతో ముగిసిన 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పలు సంస్థలు వెలువరించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇలా ఉన్నాయి

మధ్యప్రదేశ్	బీజేపీ	కాంగ్రెస్	ఇతరులు
ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా	140-162	68-90	-
టైమ్స్ నౌ-ఈటీజీ	105-117	109-125	-
రిపబ్లిక్ టీవీ	118-130	97-107	-
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	140-159	70-89	-
ఏబీపీ-సీవోటర్	88-112	113-137	-
జన్ కీ బాత్	100-123	102-125	-
టుడేస్ చాణక్య	151	74	-

రాజస్తాన్	బీజేపీ	కాంగ్రెస్	ఇతరులు
ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా	80-100	86-106	-
టైమ్స్ నౌ-ఈటీజీ	108-128	56-72	-
రిపబ్లిక్ టీవీ	115-130	65-75	-
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	80-90	94-104	-
ఏబీపీ-సీవోటర్	94-114	71-91	-
జన్ కీ బాత్	100-122	62-85	-
టుడేస్ చాణక్య	101	89	-

ఛత్తీస్‌గఢ్	బీజేపీ	కాంగ్రెస్	ఇతరులు
ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా	36-46	40-50	-
టైమ్స్ నౌ-ఈటీజీ	32-40	48-56	-
రిపబ్లిక్ టీవీ	34-42	44-52	-
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	30-40	46-56	-
ఏబీపీ-సీవోటర్	36-48	41-53	-
టుడేస్ చాణక్య	33	57	-
జన్ కీ బాత్	34-45	42-53	-

మిజోరం	ఎంఎన్ఎఫ్	జెడ్‌పీఎం	కాంగ్రెస్	బీజేపీ
ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా	3-7	28-35	2-4	0-2
టైమ్స్ నౌ-ఈటీజీ	14-18	10-14	9-13	0-2
రిపబ్లిక్ టీవీ	17-22	7-12	7-10	1-2
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్	14-18	12-16	8-10	0-2
ఏబీపీ-సీవోటర్	15-21	12-18	2-8	
జన్ కీ బాత్	10-14	15-25	5-9	0-2

ఐదు రోజులు ఆన్‌లైన్ గేమ్స్ ఆడి..

అతిగా పనిచేసి ప్రాణాలు కోల్పోయిన ఇంటర్న్‌షిప్ ఉద్యోగి

బీజింగ్: తాను పనిచేసే మీడియా కంపెనీ కోసం లైవ్-స్ట్రీమింగ్‌లో ఏకధాటిగా గేమ్ ఆడుతూ ఒక ఉద్యోగి ప్రాణాలు కోల్పోయిన ఘటన చైనాలో చోటుచేసుకుంది. నవంబర్ 10నాటి దుర్ఘటన వివరాలను 'ది పేపర్' వార్తాసంస్థ తన కథనం ప్రచురించింది. లీ హావో అనే విద్యార్థి హెనాన్ రాష్ట్రంలోని పింగ్‌డింగ్‌షాన్ వొకేషన్, ట్రైనింగ్ కళాశాలలో వచ్చే ఏడాది జూన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేయనున్నాడు. కోర్సు ముగిసేలోపు కాలేజీ నిబంధనల ప్రకారం ఏదైనా గేమ్స్ సంబంధ మీడియా సంస్థలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాలి. అందుకోసం క్విన్‌యీ కల్చర్ అండ్ మీడియా కంపెనీలో తాత్కాలిక ఉద్యోగిగా చేరి ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడే లైవ్-స్ట్రీమర్‌గా విధుల్లో చేరాడు. మొదట్లో ఉదయ సమయంలో పనిచేసిన ఇతను తర్వాత కంపెనీ ఆదేశాల మేరకు రాత్రిళ్లు గేమ్స్ ఆడేవాడు. 3,000 యువాన్ల జీతం రావాలంటే 26 రోజుల్లో 240 గంటలపాటు ఆన్‌లైన్ గేమ్స్ ఆడాలి. నెలకు 15 చొప్పున షార్ట్ వీడియోలను అప్‌లోడ్ చేయాలి. ప్రతి రోజూ రాత్రి తొమ్మిదింటి నుంచి ఉదయం ఆరింటిదాకా ఏకధాటిగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడాలి. దీంతో లీ హావో గత ఐదు రోజులుగా ఏకధాటిగా గేమ్స్ ఆడుతూ శ్వాస పీల్చుకోవడం ఇబ్బందై కుప్పకూలిపోయాడు. ఇతడిని ఆస్పత్రికి తరలించినా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడని వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై కంపెనీ మాత్రం తమకేం సంబంధం లేదని స్పష్టం చేసింది. ''బాధితుని కుటుంబానికి 5,000 యువాన్ల(దాదాపు రూ.58,750) నగదు సాయం అందిస్తాం''అని కంపెనీ చేతులు దులిపేసుకుంది.

ఆగమెందుకు.. మళ్లీ మనమే!

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు, కేబినెట్ భేటీ నిర్వహణకు నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ప్రగతిభవన్‌కు బారులు తీరిన నేతలు

సీఎం కేసీఆర్ గురువారం సాయంత్రమే ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి ప్రగతిభవన్‌కు చేరుకోగా.. శుక్రవారం ఉదయం నుంచే బీఆర్ఎస్ నేతలు ప్రగతిభవన్‌కు బారులు తీరారు. పార్టీ పార్లమెంటరీ నేత కె.కేశవరావు, మంత్రి నిరంజన్‌రెడ్డి, మధుసూదనాచారి, బాల్క సుమన్ తోపాటు నల్లగొండ, హైదరాబాద్ తదితర జిల్లాలకు చెందిన నేతలు వచ్చి సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆదివారం వెలువడే ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కే సానుకూలంగా ఉంటాయని కేసీఆర్ ధీమా వ్యక్తం చేసినట్టు తెలిసింది. కేసీఆర్‌తో భేటీ తర్వాత ప్రగతిభవన్ నుంచి బయటకు వచ్చిన నేతలంతా.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని పేర్కొనడం గమనార్హం. మరోవైపు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత నివాసంలో భేటీ అయ్యారు.

కేటీఆర్, హరీశ్‌రావులతో సమీక్ష

పార్టీ అధినేత కేసీఆర్‌తో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మంత్రి హరీశ్‌రావు ఇద్దరూ ప్రగతిభవన్‌లో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. జిల్లాలు, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా వార్ రూమ్‌ల నుంచి, వివిధ వర్గాల నుంచి అందిన గణాంకాలు, నివేదికలతోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జులు, అభ్యర్థుల నుంచి అందిన వివరాలను విశ్లేషించారు. కీలక నియోజకవర్గాలు గజ్వేల్, కామారెడ్డి, కొడంగల్‌లో ఓటింగ్ సరళిపైనా పోస్టుమార్టం చేశారు. పార్టీ సాంప్రదాయ ఓటు బ్యాంకుతో పాటు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు బీఆర్ఎస్‌కు అనుకూలంగానే ఓటింగ్‌లో పాల్గొన్నారని ఈ సందర్భంగా కేసీఆర్ అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. హంగ్ ఫలితాలకు అవకాశం లేదని, స్పష్టమైన మెజారిటీతోనే బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేసినట్టు సమాచారం.

ఎగ్జిట్ పోల్స్ కాదు.. ఎగ్జాక్ట్ పోల్స్ లెక్క!

అసెంబ్లీ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని సీఎం కేసీఆర్ తనను కలసిన నేతలతో పేర్కొన్నట్టు తెలిసింది. బీఆర్ఎస్ పకడ్బందీగా చేసిన పోల్ మేనేజ్‌మెంట్‌తోపాటు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో బీజేపీ చీల్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటే బీఆర్ఎస్‌కే సానుకూలత ఉందని చెప్పినట్టు సమాచారం. ఎగ్జిట్ పోల్స్ కాకుండా ఎగ్జాక్ట్ పోల్సే లెక్క అని పేర్కొన్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారని.. ఏజెంట్ల నియామకం మొదలు ప్రక్రియ పూర్తయ్యేదాకా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారని సమాచారం. ఎన్నికల ఫలితాలు వెలువడే క్రమంలో పార్టీ అభ్యర్థులతో టచ్‌లో ఉండాలని కేటీఆర్, హరీశ్‌రావులకు సూచించారని తెలిసింది.

4న సీఎం అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఈనెల 4న మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈనెల 3న వెల్లడి కానుండగా, మరుసటి రోజు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా రానున్నాయనే ధీమాను పార్టీ వర్గాల్లో కల్పించడానికే కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది.

2023 వర్డ్ ఆఫ్ ది ఇయర్ 'అథెంటిక్'

ప్రకటించిన మెరియం–వెబ్‌స్టర్ సంస్థ

లండన్: 2023లో ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు ఆన్‌లైన్‌లో అన్వేషించిన పదం 'అథెంటిక్'అని మెరియం వెబ్‌స్టర్ డిక్షనరీ నిర్వాహకులు ప్రకటించారు. అథెంటిక్ అంటే 'నిజమైన, విశ్వసనీయమైన, ప్రామాణికమైన' అని అర్థం. ప్రస్తుత కృత్రిమ మేధ ఆధారిత డీప్‌ఫేక్ ప్రపంచంలో విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. అందుకే జనం తమ ఆన్‌లైన్ నిఘంటువులో నిజమైన వంటలు, నిజమైన స్వరం, నిజస్వరూపం కోసం వెతుకులాటను ముమ్మరం చేశారని డిక్షనరీ సంపాదకుడు పీటర్ సోకొలోవ్‌స్కీ వివరించారు. ఈ సమాధాన పత్రాన్ని నిజంగా విద్యార్థే రాశాడా, రాజకీయ నాయకుడు నిజంగానే ఈ ప్రకటన చేశాడా అనే ప్రశ్నలు నేడు మార్మోగుతున్నాయన్నారు. కొన్నిసార్లు మన కళ్లను, మన చెవులను మనమే నమ్మలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన పేర్కొన్నారు. అత్యధికులు శోధించిన పదాల్లో డీప్‌ఫేక్ కూడా ఒకటని మెరియం వెబ్‌స్టర్ సంస్థ వెల్లడించింది. సాంకేతిక సాయంతో తన ఫొటోలను అసభ్యంగా మార్చి ప్రచారంలో పెట్టారని ఇటీవల ఒక నటి ఆవేదన వ్యక్తం చేయడంతో 'డీప్‌ఫేక్'అనే పదం బాగా ప్రాచుర్యం పొందింది. ఇలాంటి ఘటనలు ప్రపంచవ్యాప్తంగా తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ఒక వ్యక్తి ఫొటో, వీడియో, ఆడియోలను మార్చి, ఆ వ్యక్తి చేయని పనిని చేసినట్లుగా, పలకని మాటలను పలికినట్లుగా చూపడమే డీప్‌ఫేక్ అని నిఘంటు నిర్వాహకులు నిర్వచించారు. 2023లో అత్యధికులు అన్వేషించిన పదం మాత్రం లవ్. మెరియం వెబ్‌స్టర్ ఆన్‌లైన్ నిఘంటువులో 5 లక్షల పదాలుండగా, వాటిలో లవ్ అనే పదానికి అర్థం అన్వేషించేవారు ఎప్పుడూ అత్యధికంగా ఉంటారు. ఎప్పటి నుంచో ఇది కొనసాగుతోంది. ఈ ఏడాది అథెంటిక్ అనే పదం ప్రముఖంగా నిలిచిందని సోకొలోవ్‌స్కీ చెప్పారు. 2023లో ఎక్కువగా వెదికిన పదా ల్లో రిజ్ (మోహం పుట్టించే శక్తి), కబుట్స్ (ఇజ్రాయెలీ సాముదాయిక వ్యవసాయ క్షేత్రం, జనావాసం), ఇంప్లోడ్ (కూలిపోవడం), కొరొనేషన్(పట్టాభిషేకం) కూడా ఉన్నాయి.

ప్రశాంతంగా నిద్రపోయా: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: 'చాలా రోజుల తర్వాత ప్రశాంతంగా నిద్రపోయా. ఎగ్జిట్ పోల్స్‌లో ఏదో జరుగుతున్నట్లు చూపొచ్చు. కానీ ఎగ్జాక్ట్ పోల్స్ మాకు శుభవార్తను అందజేస్తాయి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. శుక్రవారం ప్రగతిభవన్‌లోనే ఉన్న కేటీఆర్.. సీఎం కేసీఆర్‌తో జరిగిన భేటీలో పాల్గొన్నారు. అనంతరం అక్కడే ఉన్న మంత్రి హరీశ్‌రావు కూడా మాట్లాడుతూ..శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం వంద రోజుల పాటు శ్రమించిన కార్యకర్తల సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు.

బాలికపై లైంగిక దాడి

నిందితునిపై ఫోక్సో కేసు నమోదు



నిందితుడు సాయికుమార్..

హైదరాబాద్: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి శ్రీకాకుళం జిల్లాకు చెందిన దంపతులు బతుకు దెరువుకోసం నగరానికి వచ్చి బోరబండ సైట్3 సాయిబాబానగర్‌లో నివాసముంటున్నారు. గత నెల 29న రాత్రి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో పక్కనే నివాసముండే సాయికుమార్(23) వారి కుమార్తెను (9)బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

- ప్రశ్నించిన వ్యక్తిపై కత్తితో దాడి
- నిందితుడి కోసం గాలింపు

హైదరాబాద్: బస్‌స్టాప్‌లో మహిళపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిని వారించినందుకు ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బహుదూర్‌పల్లికి చెందిన డి. వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం తెల్లవారుజామున బహదూర్‌పల్లి వెళ్లేందుకు నర్సాపూర్ చౌరస్తాలోని బస్‌స్టాప్‌లో వేచి ఉన్నాడు. అదే సమయంలో బాలానగర్‌కు చెందిన జోగీందర్ సింగ్ అనే వ్యక్తి ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో వెంకటేశ్వర్‌రెడ్డి పోలీసులతో చెబుతానని అక్కడినుంచి వెళ్లి పోవాలని సూచించాడు. దీంతో సింగ్ వెంకటేశ్వర రెడ్డిని నెట్టి వేయడంతో అతను కిందపడ్డాడు. మహిళలతో తప్పుగా ప్రవర్తించడమేగాక నన్నే నెట్టి వేస్తావా అని ప్రశ్నించడంతో జోగిందర్ సింగ్ కత్తితో వెంకటేశ్వర రెడ్డి కడుపులో పొడవడంతో అతను అక్కడే కుప్పకూలాడు. భార్య పూజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బాధితుడిని యశోద ఆస్పత్రికి తరలించారు. నిందితుడు జోగీందర్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

నగరంలో 40 శాతం గృహాల కొనుగోలు పెరిగింది

ఎస్‌బీఐకి 1150 బ్రాంచ్‌లు • మార్కెటింగ్ టీంలు • ఎస్ఎస్ఎల్, హెచ్ఎల్‌సీలకు 26 ప్రత్యేక ప్రాసెసింగ్ కేంద్రాలు

- సందర్శకులకు వడ్డీరేట్లపై 0.25శాతం, ప్రాసెసింగ్ ఫీజులో 50శాతం రాయితీ.
- రోజూ రూ.500 కోట్ల రుణాలు మంజూరు.
- హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్‌కుమార్
- హైటెక్స్‌లో మెగాప్రాపర్టీ షో ప్రారంభం



ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీషోను ప్రారంభించిన ఉన్నతాధికారులు

హైదరాబాద్: హైదరాబాద్‌లో గృహాల కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతాయని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్‌కుమార్ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు కొనసాగనున్న మెగా ప్రాపర్టీ షో 2023 ను శుక్రవారం ఆయన ఎస్‌బీఐ కార్పొరేట్ సెంటర్ ముంబై సీజీఎం ఉషాగౌతం, ఎస్‌డబ్ల్యూ జీఎం డెబాసిస్ మిశ్రా, హైదరాబాద్ డీజీఎం రవీంద్ర డి.హిట్నాల్లి , నారెడ్కో అధ్యక్షుడు సునీల్ చంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల కొనుగోళ్లు గత సంవత్సరం కంటే 40శాతం పెరిగాయన్నారు. ఐటీ, కమర్షియల్ స్పేస్ వృద్ధి చెందడం వల్ల అల్ట్రా, మిడ్ సెగ్మెంట్లలో కూడా వృద్ధి ఉందని తెలిపారు. బ్యాంక్ హౌసింగ్ పోర్ట్‌ఫోలియో రూ.7 ట్రిలియన్లకు చేరుకుందన్నారు. హైదరాబాద్ సర్కిల్ రూ.57,000 కోట్ల పోర్ట్‌ఫోలియోను అధిగమించిందన్నారు. గత మూడేళ్లలో సర్కిల్ రూ.23,000 కోట్లు పెరిగిందన్నారు. ఎస్‌బీఐ 1150 బ్రాంచ్‌లు, మార్కెటింగ్ టీంలు, ఎస్ఎస్ఎల్, హెచ్ఎల్‌సీ లకు 26 ప్రత్యేక ప్రాసెసింగ్ కేంద్రాలను కలిగి ఉన్నట్లు తెలిపారు. ప్రాపర్టీషోను సందర్శించే వినియోగదారులకు వడ్డీరేట్లపై 0.25శాతం ప్రత్యేక రాయితీ, ప్రాసెసింగ్ ఫీజులో 50శాతం రాయితీ, బిల్డర్లు ఇచ్చే డిస్కౌంట్‌లను ఉపయోగించుకోవాలని కోరారు. కార్పొరేట్ సెంటర్ ముంబై సీజీఎం ఉషా గౌతమ్ మాట్లాడుతూ మార్కెట్‌లో లీడర్‌గా ఉన్న ఎస్‌బీఐ 7 ట్రిలియన్ పోర్ట్‌ఫోలియోను తాకుతుందన్నారు. ప్రతి రోజు రూ. 500 కోట్లు మంజూరు చేస్తుందని, ఒక నెలలో రూ. 6000 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.అన్ని శాఖలను కవర్ చేసేందుకు కొత్త సీపీసీల పాన్ ఇండియాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటూ ఆధిపత్యాన్ని చాటుకుంటుందన్నారు. గత తొమ్మిదేళ్లుగా మార్కెట్ బాగా అభివృద్ధి చెందిందని మూడు నెలల్లో 14వేల యూనిట్ల కొనుగోలు జరిగిందన్నారు. హౌసింగ్‌కు మంచి డిమాండ్ ఉందని, మార్కెట్‌లో 63శాతం నూతన ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. కస్టమర్లను ఆకట్టుకునేందుకు బిల్డర్లు, డెవలపర్లు అందిస్తున్న ఆఫర్లతో గృహరుణాల కొనుగోలు అంతకంతకు పెరుగుతూ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నార్ల వెంకటేశ్వర రావును ఆదర్శంగా తీసుకోవాలి



హైదరాబాద్: సమాజాన్ని కులమతాల పేరుతో విభజించడం భావ్యం కాదని, పాత్రికేయులుగా గొప్ప విలువలతో నార్ల జీవించారని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. డా బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రఖ్యాత జర్నలిస్ట్, సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు స్మరకార్థం ఏటా నిర్వహించే నార్ల స్మారకోపన్యాసంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ×తెలుగు జర్నలిజం ప్రయాణం- ఎక్కడి నుంచి ఎక్కడిదాకా ×అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నార్ల తరం నాటి పాత్రికేయ విలువలు ప్రస్తుతం లేవని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. నార్ల తొలితరం తెలుగు జర్నలిజానికి ఆద్యుడని, జర్నలిస్టుగా బతికినంత కాలం పాత్రికేయ విలువలకు నిలువుటద్దంగా నిలిచారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆధునిక జర్నలిజం పేరుతో వృత్తిని వ్యాపారమయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య. కె సీతారామారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో నార్ల లాంటి పాత్రికేయులు సమాజానికి అవసరం అన్నారు. విలువలతో కూడిన పాత్రికేయం ఆదర్శంగా నిలుస్తుందని, నార్ల కుటుంబ సభ్యులు ఆయన రాసిన, సేకరించిన పుస్తకాలను అంబేడ్కర్ విశ్వవిద్యాలయం లైబ్రరీకి అందించడం అభినందనీయమన్నారు. నార్ల లైబ్రరీలో ఉన్న అన్ని పుస్తకాలను త్వరలోనే డిజిటలైజ్ చేయనున్నట్లు ప్రకటించారు. విశ్వవిద్యాలయం అకడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. నార్ల పట్టుదల, విలువలతో కూడిన పాత్రికేయులుగా జాతీయ స్థాయిలో ప్రఖ్యాతిగాంచారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.ఎ.వి.ఆర్.ఎన్ రెడ్డి, జిఆర్‌సీ ఆర్–డి డైరెక్టర్, ప్రొ.ఇ.సుధారాణి, ఈఎంఆర్–ఆర్‌సీ డైరెక్టర్, ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా. ఎల్వీకే రెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని నార్లగారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

బోగస్ ఓట్లు వేయించిన వ్యక్తుల అరెస్ట్




పోలీసుల అదుపులో నిందితులు

హైదరాబాద్: బోగస్ ఓట్లు వేయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్, స్థానిక హబీబ్‌నగర్ పోలీసు దాడిలో వారి నుంచి 67 డూప్లికేట్ ఓటరు గుర్తింపు కార్డులు, రెండు థిన్నర్ డబ్బాలు, ఓటరు జాబితా, మూడు సెల్‌ఫోన్లు, దూది(కాటన్), ఒక స్లిప్ ప్రింటింగ్ మిషన్, రెండు పేపర్ రోల్స్, వ్యాజిలిన్ డబ్బాలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ బి.బాలస్వామి, టాస్క్‌ఫోర్స్ డీసీపీ నితికాతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 30న జరిగిన ఎన్నికల్లో తమ పార్టీకి చెందిన అభ్యర్థి గెలిపించేందుకు నాంపల్లికి చెందిన మహ్మద్ జాకీర్, మహ్మద్ షాబుద్దీన్, విజయ్‌నగర్ కాలనీకి చెందిన రితేష్ గుప్తా నగరాన్ని వదిలిపెట్టిన వారు, చనిపోయిన వారు, ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఓటర్లను గుర్తించి వారి పేరిట ప్రత్యేక గుర్తింపు కార్డులను తయారు చేశారు. ఓటరు జాబితాను దగ్గర పెట్టుకుని స్లిప్పులు ఇస్తూ కొందరు వ్యక్తులను పోలింగ్ స్టేషన్ 123లో ఓట్లు వేయిస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను పట్టుకున్న సిబ్బందిని డీసీపీ అభినందించారు. నిందితులు ముగ్గురు సభ్యులు ఎంఐఎంకు చెందిన వ్యక్తులుగా గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్.. నయా సాల్!

గ్రేటర్ హైదరాబాద్‌లో కొలువుదీరిన కొత్త మద్యం దుకాణాలు

- గ్రేటర్‌లో 615 వైన్ షాపులకు అనుమతులు
- ఎన్నికల దృష్ట్యా ముందస్తుగానే లైసెన్సులు



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్‌లో కొత్త మద్యం దుకాణాలకు అబ్కారీ శాఖ అనుమతులు ఇచ్చింది. శుక్రవారం కొత్త దుకాణాలు ప్రారంభమయ్యాయి. గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో కొత్తగా 615 వైన్స్ షాపులకు ఎక్సైజ్ శాఖ గత ఆగస్టులో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల దృష్ట్యా ముందస్తుగానే నోటిఫికేషన్ వెలువడటంతో వ్యాపారుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. అనేక చోట్ల పెద్ద ఎత్తున పోటీకి దిగారు. ఒక్కో మద్యం దుకాణానికి ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున ఫీజు విధించింది. ఒక వ్యాపారి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండడంతో భారీ సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో కేవలం 100 దుకాణాలకు 9,080 మంది పోటీపడ్డారు. సరూర్‌నగర్‌లో 134 దుకాణాలకు 9012 దరఖాస్తులు వచ్చాయి.

రూ.650 కోట్ల ఆదాయం..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 615 దుకాణాలపై లైసెన్సు ఫీజుల రూపంలోనే ప్రభుత్వానికి ఏకంగా రూ.650 కోట్ల వరకు ఆదాయం లభించినట్లు అంచనా. నగరంలోని దుకాణాల కంటే శివారు ప్రాంతాల్లోని మద్యం షాపుల కోసమే వ్యాపారులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్, శంషాబాద్, శేరిలింగంపల్లి, ఉప్పల్, మేడిపల్లి, కీసర, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో భారీ డిమాండ్ కనిపించింది. ఆగస్టులో 16వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే నెల చివరిలో డ్రా తీశారు. నిబంధనల మేరకు కొత్త వైన్ షాపులకు లైసెన్సుల ప్రక్రియ చేపట్టారు.

మూడు నెలల ముందే అనుమతి..

సాధారణంగా ప్రతి రెండేళ్లకోసారి మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్సులను అందజేస్తోంది. ఒకసారి లైసెన్సు పొందిన వ్యాపారి రెండేళ్ల పాటు దుకాణం నిర్వహించవచ్చు. రెండేళ్లకోసారి అక్టోబర్ నెలాఖరులో నోటిఫికేషన్ విడుదల చేసి నవంబర్‌లో అనుమతులను ఇస్తారు. అదే నెలలో మొత్తం ఫీజులో నాలుగో వంతు చెల్లించిన వారికి డిసెంబర్ ఒకటో తేదీ నాటికి దుకాణాలకు లిక్కర్ చేరుతుంది. కాగా.. ఈ ఏడాది ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆగస్టులోనే ఈ ప్రక్రియను చేపట్టడంతో సెప్టెంబర్‌లో ఫీజులు చెల్లించిన వ్యాపారులు కొత్త దుకాణాలను ప్రారంభించేందుకు డిసెంబర్ వరకు ఆగాల్సి వచ్చింది. రూ.లక్షల్లో ఫీజులు చెల్లించడం వల్ల ఈ మూడు నెలల పాటు భారీ మొత్తంలో వడ్డీ చెల్లించాల్సివచ్చిందని పలువురు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు అన్ని కొత్త షాపులకు నవంబర్ 30 నాటికే మద్యం చేరాల్సి ఉండగా.. ఎన్నికల దృష్ట్యా డిసెంబర్ ఒకటో తేదీ శుక్రవారం ఉదయం నుంచే మద్యం సరఫరా కావడంతో కొన్ని చోట్ల సాయంత్రం వరకు కొత్త వైన్ షాపులు తెరుచుకున్నాయి.

గెలుపోటములపై చర్చోపచర్చలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడనున్న నేపథ్యంలో నగరంలో ఏ నియోజకవర్గంలో ఎవరు గెలవనున్నారనే అంశంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఎక్కడ ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ జరుగుతోంది. పోలింగ్ ముగియగానే వివిధ సంస్థలు వెలువరించిన ఎగ్జిట్ పోల్ ఫలితాలతో అవే రకమైన ఫలితాలు వెలువడవచ్చుననే వారితో పాటు ఎగ్జిట్ ఫలితాలన్నీ వాస్తవాలు కావని, తేడా ఉంటుందని వాదిస్తున్న వారూ ఉన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ అభిమానులు ఎగ్జిట్ పోల్ ఫలితాలు చూసి భ్రమ పడవద్దని అంటున్నారు. కాంగ్రెస్ శ్రేణులు మాత్రం ఫుల్ జోష్‌లో ఉన్నాయి. ఎగ్జిట్ పోల్ ఫలితాలే వస్తాయని వాదిస్తున్నారు. మరోవైపు ఎగ్జిట్ పోల్ ఫలితాల మేరకే గ్రేటర్‌లో ఏయే పార్టీలకు ఎన్ని సీట్లు రావచ్చు..వాటిల్లో గెలిచేదెవరు? ఓడేదెవరు? అన్న చర్చలు అంతులేకుండా కొనసాగుతున్నాయి.

ఇదంజగత్



రెండు ఎగ్జిట్‌పోల్స్ సర్వేల్లో గెలిచాడు!

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం.. ఎన్నికల సంఘం విడుదల చేసిన సమాచారం ప్రకారం..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా (14)

	2018	2023
నారాయణపేట	79.67	78.36
మహబూబ్‌నగర్	74.93	70.56
జడ్చర్ల	82.32	81.57
దేవరకద్ర	85.11	82.73
మక్తల్	77.77	77.13
వనపర్తి	81.40	77.72
గద్వాల	83.94	83.12
అలంపూర్	82.66	82.50
నాగర్‌కర్నూల్	83.21	78.66
అచ్చంపేట	81.85	80.03
కల్వకుర్తి	87.21	83.26
షాద్‌నగర్	88.07	82.09
కొల్లాపూర్	83.17	81.42
కొడంగల్	81.98	81.96

హైదరాబాద్ జిల్లా (15)

	2018	2023
ముషీరాబాద్	53	50.55
మలక్‌పేట	42	41.32
అంబర్‌పేట	56	52.50
ఖైరతాబాద్	54	52.07
జూబ్లీహిల్స్	46	47.49
సనత్‌నగర్	52	51.96
నాంపల్లి	45	45.56
కార్వాన్	53	48.72
గోషామహల్	59	55.38
చార్మినార్	50	43.27
చాంద్రాయణగుట్ట	48	45.26
యాకుత్‌పురా	43	39.64
బహదూర్‌పురా	50	45.50
సికింద్రాబాద్	55	53.75
కంటోన్మెంట్	49	49.36

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (14)

	2018	2023
ఇబ్రహీంపట్నం	76.38	74.93
ఎల్‌బీనగర్	49.58	49.07
మహేశ్వరం	55.34	55.39
రాజేంద్రనగర్	56.89	55.83
శేరిలింగంపల్లి	48.61	48.75
చేవెళ్ల	79.02	74.18
వికారాబాద్	74.18	75.57
తాండూరు	77.48	73.60
పరిగి	76.44	76.53
మేడ్చల్	60.56	62.24
మల్కాజిగిరి	53.08	54.02
కుత్బుల్లాపూర్	55.84	57.18
కూకట్‌పల్లి	57.73	53.87
ఉప్పల్	51.54	51.54

ఉమ్మడి మెదక్ (10)

	2018	2023
మెదక్	86.29	85.32
నర్సాపూర్	90.74	88.04
సంగారెడ్డి	82.83	75.42
నారాయణఖేడ్	89.27	83.23
జహీరాబాద్	81.35	76.72
పటాన్‌చెరు	75.97	69.61
ఆందోల్	89.27	84.80
సిద్దిపేట	79.77	86.33
దుబ్బాక	86.23	87.51
గజ్వేల్	88.97	84.14

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా (10)

	2018	2023
సిర్పూర్	85.96	81.66
ఆసిఫాబాద్	86.27	80.97
చెన్నూర్	82.57	80.07
బెల్లంపల్లి	83.33	81.19
మంచిర్యాల	73.37	69.16
ఆదిలాబాద్	82.36	77.34
ఖానాపూర్	80.87	78.18
బోథ్	85.52	82.86
నిర్మల్	79.79	77.28
ముథోల్	84.47	80.56

ఉమ్మడి కరీంనగర్ జిల్లా (13)

	2018	2023
కరీంనగర్	69.29	63.23
చొప్పదండి	79.73	77.77
మానకొండూరు	85.36	83.21
హుజూరాబాద్	84.40	83.19
హుస్నాబాద్	83.97	84.66
కోరుట్ల	75.84	75.62
జగిత్యాల	78.83	75.42
ధర్మపురి	80.19	79.54
రామగుండం	71.94	68.71
మంథని	85.41	82.74
పెద్దపల్లి	84.08	81.57
వేములవాడ	80.62	78.43
సిరిసిల్ల	80.88	77.00

ఉమ్మడి నల్లగొండ జిల్లా (12)

	2018	2023
నల్లగొండ	85.59	81.60
నకిరేకల్	88.9	86.67
మునుగోడు	91.3	91.86
దేవరకొండ	86.24	84.49
నాగార్జునసాగర్	86.8	85.79
మిర్యాలగూడ	85.30	83.49
సూర్యాపేట	87.08	84.21
తుంగతుర్తి	86.33	87.64
హుజూర్‌నగర్	86.94	86.44
కోదాడ	89.44	85.56
భువనగిరి	90.77	89.91
ఆలేరు	91.47	90.77

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా (9)

	2018	2023
నిజామాబాద్ అర్బన్	62.65	61.66
నిజామాబాద్ రూరల్	79.15	76.43
కామారెడ్డి	78.83	75.58
ఎల్లారెడ్డి	86.32	83.17
బాన్సువాడ	84.10	81.29
జుక్కల్	85.56	81.80
బోధన్	81.34	77.92
ఆర్మూర్	79.08	76.02
బాల్కొండ	79.70	79.72

ఉమ్మడి ఖమ్మం జిల్లా (10)

	2018	2023
ఖమ్మం	77.7	71.43
పాలేరు	99.9	90.89
మధిర	97.9	87.93
వైరా	94.2	86.70
సత్తుపల్లి	95.9	87.43
కొత్తగూడెం	90.5	76.42
పినపాక	90.5	80.13
ఇల్లెందు	89.6	80.54
అశ్వారావుపేట	97.8	86.88
భద్రాచలం	87.3	79.00

ఉమ్మడి వరంగల్ జిల్లా (12)

	2018	2023
వరంగల్ పశ్చిమ	59.21	56.61
వరంగల్ తూర్పు	73.45	66.74
జనగామ	86.19	85.70
స్టేషన్‌ఘన్‌పూర్	88.14	86.40
పాలకుర్తి	89.01	86.88
డోర్నకల్	88.96	87.71
మహబూబాబాద్	85.06	82.34
నర్సంపేట	90.35	87.87
పరకాల	89.51	84.61
వర్ధన్నపేట	83.92	80.23
భూపాలపల్లి	82.33	82.02
ములుగు	82.75	82.09

ఓటు పట్టని మెట్రో

- పోలింగ్‌కు దూరంగా నగర ప్రజ
- నిర్లిప్తం లేదా సెలవు సరదాగా గడిపేయడం
- దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో ఇదే తంతు
- ఎన్నికలేవైనా క్రమంగా తగ్గుతున్న పోలింగ్ శాతం
- దక్షిణాది నగరాలలో అత్యల్ప ఓటింగ్ హైదరాబాద్‌లోనే
- ఓటు వేస్తేనే వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలనే అభిప్రాయం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ, లోక్‌సభ, మున్సిపాలిటీ.. ఎన్నికలేవైనా అర్బన్ ప్రజలలో ఎక్కువ శాతం ఓటింగ్‌కు దూరంగానే ఉంటున్నారు. ఎన్నికల రోజున నిర్లిప్తంగా వ్యవహరిస్తూ ఇంట్లోనో, మరోచోటో సెలవును ఎంజాయ్ చేస్తున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లోనూ ఇదే పరిస్థితి. గత రెండు శాసనసభ ఎన్నికల నుంచి ముంబై మినహా అన్ని మెట్రో నగరాల్లోనూ పోలింగ్ శాతం తగ్గుతూ వస్తోంది. ఎన్నికల సంఘం, స్వచ్ఛంద సంస్థలు ఎన్నికల ప్రాముఖ్యత, ఓటు హక్కు గురించి ఎంతగా ప్రచారం చేస్తున్నా ఫలితం ఉండటం లేదు.

పెరిగిన అర్బన్ ఓటర్లు

1951–52లో దేశంలో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికలలో 17.3 కోట్ల మంది ఓటర్లు నమోదు కాగా.. ఇందులో 17 శాతం ఓటర్లు మాత్రమే పట్టణాలలో నివసించేవారు. కాలక్రమేణా ప్రజలు గ్రామాల నుంచి పట్టణాలకు వలస రావడం పెరిగింది. ఉద్యోగం, ఉపాధి, విద్య, వైద్యం, మెరుగైన జీవనశైలి వంటి రకరకాల కారణాలతో పట్టణాలకు వస్తూ స్థిరపడిపోతున్నారు. దేశంలో 543 లోక్‌సభ స్థానాలుండగా.. 100 స్థానాలలో పట్టణ జనాభా 50 శాతం కంటే ఎక్కువగా ఉన్నారు.

దక్షిణాదిలో హైదరాబాద్‌లోనే తక్కువ

దక్షిణాది నగరాలైన బెంగళూరు, చెన్నైలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే ఓటింగ్ శాతం అత్యల్పంగా నమోదవుతోంది. హైదరాబాద్‌లో గత రెండు దశాబ్దాల కాలంలో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, జీహెచ్‌ఎంసీ ఎన్నికలలో పోలింగ్ 50 శాతం కూడా మించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. 2009లో 58 శాతం, 2014లో 53, 2018లో 50.86 శాతం పోలింగ్ నమోదయింది. తాజా ఎన్నికలలో భాగ్యనగరంలోని 15 నియోజకవర్గాలలో నమోదైన పోలింగ్ కేవలం 46.65 శాతమే కావడం గమనార్హం. నగరంలోని యాకుత్‌పురాలో 39.6 శాతం పోలింగ్ నమోదు కావడం శోచనీయం. ఈ ఏడాది మేలో కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో బెంగళూరు అర్బన్‌లో 54.6 శాతం పోలింగ్ జరిగింది. 2018లో ఇది 56 శాతంగా ఉంది. 2021లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నైలో 59.06 శాతం పోలింగ్ జరిగింది.



ఎందుకిలా..?

నిర్లిప్తత, నిర్లక్ష్యం, సెలవు రోజును ఇతర పనులకు ఉపయోగించుకోవాలనే అభిప్రాయం, సరదాగా గడిపేందుకు ప్రాధాన్యత ఇవ్వడం లాంటి కారణాలతో పాటు.. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉండటం కూడా పోలింగ్ శాతం తగ్గడానికి ఒక కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సొంతూరు, పనిచేసే ప్రాంతం రెండు చోట్లా ఓటు ఉన్న అర్బన్ ఓటర్లు ఎన్నికల రోజున వివిధ కారణాలతో సొంతూళ్లకు తరలిపోవడంతో అర్బన్ ప్రాంతాలలో ఓటింగ్ శాతం తగ్గుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. చాలా పోలింగ్ స్టేషన్ల వద్ద గంటల కొద్దీ క్యూలో నిలబడాల్సి రావడం వల్ల కూడా అర్బన్ ఓటర్లు ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏం చేయాలి మరి?

- ఓటు వేసిన వారికి మాత్రమే వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి.
- అర్బన్ ప్రాంతాలలో ఒకరికి ఒకచోటే ఓటు హక్కు ఉండేలా చూడాలి.
- ఓటర్లకు సాధ్యమైనంత చేరువలోనే పోలింగ్ కేంద్రం ఉండాలి.
- పోలింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచాలి. పొడవాటి క్యూలు నివారించాలి.
- క్యూలైన్, పోలింగ్ సరళి సమాచారం ఓటర్లకు మెసేజ్ రూపంలో ఇవ్వాలి.
- పోలింగ్ బూత్‌కు వెళ్లే రూట్ మ్యాప్‌ను ఓటర్లకు పంపించాలి.

ఇచ్చిందెంత.. రావాల్సిందెంత?

- ఎన్నికల ఖర్చులపై ద్వితీయ శ్రేణి నాయకత్వం లెక్కలు
- అదనపు ఖర్చును అభ్యర్థుల నుంచి రాబట్టుకోవడంపై దృష్టి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ద్వితీయశ్రేణి నాయకత్వం జమాఖర్చులు లెక్కతేల్చడంలో మునిగిపోయారు. తమకు అప్పగించిన మండలాలు, పట్టణాల పరిధిలో చేసిన ఖర్చులు, ఇంకా ఎవరెవరికి ఎంతెంత చెల్లించాలి, అభ్యర్థి నుంచి తమకు వచ్చిందెంత? ఇంకా రాబట్టుకోవాల్సిన సొమ్ము ఎంత అనే వివరాలపై కసరత్తు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలోనే నేతలూ ఇదే తరహాలో లెక్కలు వేస్తూ.. తాము చేసిన అదనపు ఖర్చులను వెంటనే రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫలితాలు ప్రకటించాక అభ్యర్థి గెలిచినా, ఓడినా ఇప్పట్లో సొమ్ము తిరిగిరావడం కష్టమనే ఆలోచనలో ఉన్నారు. అభ్యర్థి గెలిస్తే అందుబాటులో ఉండే అవకాశం తక్కువని, పైగా గట్టిగా అడిగే పరిస్థితి ఉండదని భావిస్తున్నారు. అదే ఓడిపోతే ఖర్చులు, పంపకాలపై అభ్యర్థికి వచ్చే సవాలక్ష సందేహాలకు సమాధానాలు చెప్పాల్సి వస్తుందని.. సొమ్ము వసూలు చేసుకోవడం కష్టమవుతుందని ఆలోచిస్తున్నారు.

అభ్యర్థి మీద నమ్మకంతో ఖర్చుపెట్టి..

ప్రతీ పార్టీ అభ్యర్థులు తమ నియోజకవర్గం పరిధిలోని మండలాలు, గ్రామాలు, వార్డు స్థాయిలో నమ్మకస్తులను పెట్టుకుని.. ఓటింగ్ దాకా అయ్యే ఖర్చులను వారి చేతుల మీదుగానే నడిపించారు. ఈ క్రమంలో కొంత సొమ్ము ముందే అందజేశారు. ఇంకొంత సర్దుబాటు చేసుకోవాలని, తాము తిరిగి ఇస్తామని చెప్పారు. పోలింగ్ రోజు, దానికి ముందు రోజు విందులు, వినోదాలు, వాహనాలు, ఇతర అంశాల కోసం దిగువశ్రేణి నేతలు అదనంగా ఖర్చు చేశారు. అభ్యర్థి దగ్గర మెప్పుతోపాటు రాజకీయ భవితవ్యంపై ఆశతో ఇందుకు ముందుకొచ్చారు.

ఓడితే వసూలు కష్టమని..

అభ్యర్థి ఎమ్మెల్యే అయితే..వారి తోడ్పాటుతో గ్రామ, వార్డు స్థాయిలో పనులు చేయించవచ్చని, పథకాలకు లబ్ధిదారుల ఎంపిక వంటివి చేయవచ్చని ద్వితీయ, కిందిస్థాయి నేతలు ఆలోచనతో ఉంటారు. అందువల్ల గెలిచిన తర్వాత అభ్యర్థిని గట్టిగా డబ్బులు అడిగే పరిస్థితి ఉండదని.. గెలిచాక ప్రభుత్వ పెద్దలను కలిసే హడావుడిలో ఉంటారని వారు చెప్తున్నారు. ఓడితే అందుకు కారణాలేమిటి, ఏ పోలింగ్ బూత్ పరిధిలో, ఏ ఊరిలో ఎంతమేర ఓట్లు వచ్చాయన్నది రంధ్రాన్వేషణ చేస్తారని అంటున్నారు. ఇలా ఫలితాలు ఎలా వచ్చినా వసూలు కష్టమనే భావనతో..ఖర్చుపెట్టిన డబ్బులన్నీ రాబట్టే ఆలోచనలో ఉన్నట్టు పేర్కొంటున్నారు. అభ్యర్థులు వివిధ మార్గాల్లో డబ్బులు తేవడం, పంపడం చేశారు. ఒక మండలంలో అయ్యే ఖర్చు మొత్తం ఒక వ్యక్తి ద్వారా జమ చేయడం, ఖర్చు చేయడం.. వారు గ్రామాలు, వార్డుల వారీగా ఒక్కొక్కరికి సొమ్ము బాధ్యతలు అప్పగించడం జరిగింది. ఇప్పుడు మొత్తం నియోజకవర్గ లెక్కలను క్రోడీకరించే పని మొదలుపెట్టారు.

ఓటర్ల సంఖ్య పెరిగినా.. పోలింగ్ తగ్గింది

- 2018తో పోల్చుకుంటే 1.86 శాతం తగ్గుదల
- అప్పటి ఎన్నికల్లో 73.2 శాతం పోలింగ్
- ఈసారి 71.34 శాతమే..
- వాస్తవానికి ఈసారి 26.78 లక్షల మంది అధికంగా ఓటేశారు
- కానీ భారీగా పెరిగిన ఓట్ల సంఖ్య మేరకు జరగని పోలింగ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈసారి అర్హులైన ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగినా, ఆ మేరకు ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోకపోవడంతో పోలింగ్ శాతం తగ్గింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 3,26,02,793 మంది ఓటర్లకు గాను 2,32,59,256 మంది (71.34%) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,62,98,482 మంది పురుషులకు గాను 1,15,84,728 మంది, 1,63,01,634 మంది మహిళలకు గాను 1,16,73,722 మంది, 2,677 మంది థర్డ్ జెండర్ ఓటర్లకు గాను 806 మంది ఓటేశారు. గురువారం నాటి పోలింగ్‌కు సంబంధించిన తుది గణాంకాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) శుక్రవారం రాత్రి విడుదల చేశారు. అత్యధికంగా మునుగోడులో 91.89 శాతం పోలింగ్ నమోదు కాగా..పాలేరు (90.89 శాతం), ఆలేరు (90.77 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అత్యల్పంగా యాకుత్‌పురలో 39.64 శాతం నమోదైంది. మలక్‌పేట (41.32 శాతం), చార్మినార్ (43.27 శాతం) ఆపై స్థానాల్లో ఉన్నాయి. ఈసారి ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలు అధిక సంఖ్యలో ఓటేయడం గమనార్హం. కాగా 2018లో జరిగిన ఎన్నికల్లో 73.2 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికలతో పోల్చితే ప్రస్తుత ఎన్నికల్లో 1.86 శాతం పోలింగ్ తగ్గింది. 2018 ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో మొత్తం 2.8 కోట్ల మంది ఓటర్లుండగా, 2.05 కోట్ల మంది ఓటేశారు. అయితే ఈసారి ఓటర్ల సంఖ్య భారీగా పెరిగి 3.26 కోట్లకు చేరుకోగా, 2.32 కోట్ల మందే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కారణంగానే.. 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ప్రస్తుతం 26.78 లక్షల మంది ఎక్కువగా ఓటేసినా, పోలింగ్ శాతం మాత్రం తగ్గింది.

బోగస్ ఓట్లతో రిగ్గింగ్..

ఈసీకి ఫిర్యాదు చేశాం: నిరంజన్

సాక్షి, హైదరాబాద్: చాంద్రాయణగుట్ట, చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురాలో కాంగ్రెస్ నాయకులపై ఎంఐఎం నేతలు దాడి చేశారని, అక్కడ మధ్యాహ్నం తర్వాత బోగస్ ఓట్లతో రిగ్గింగ్ జరిగిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పాతబస్తీ పోలింగ్ స్టేషన్లలో కాంగ్రెస్ ఏజెంట్లు రాకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు పరిశీలించిన తర్వాత కౌంటింగ్‌కు అనుమతులివ్వాలన్నారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా గుంపులుగా వెళ్లి ఓటు వేస్తూ రిగ్గింగ్ చేశారని విమర్శించారు.

పర్యాటక శాఖ ఆఫీసులో అగ్నిప్రమాదం

- ఫైల్స్, ఫర్నిచర్, కంప్యూటర్లు అగ్నికి ఆహుతి
- ఘటనపై పలు అనుమానాలు



హిమాయత్‌నగర్‌లో అగ్నిప్రమాదం జరిగిన టూరిజం శాఖ ప్రధాన కార్యాలయం



మంటల్లో కాలిపోయిన ఫైళ్లు, కంప్యూటర్లు

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) ప్రధాన కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఉన్న అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే భద్రతా సిబ్బంది అందించిన సమాచారంతో హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాదంలో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ లోని ఫైల్స్, ఫర్నిచర్, కంప్యూటర్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు చెలరేగిన క్రమంలో కార్యాలయం కింద ఉన్న రెండు ఇన్నోవా కార్లపై అగ్ని కీలలు పడటంతో ఆ కార్లు సైతం మంటల్లో పాక్షికంగా దగ్ధమయ్యాయి. కాగా ఇటీవల ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఆరోపణలపై పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) బోయిన్‌పల్లి మనోహర్‌రావును నవంబర్ 17వ తేదీన ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. దీంతో ఈ ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లోనే ప్రమాదం

పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన పలు కీలక పత్రాలు ఉన్న అడ్మినిస్ట్రేషన్ ఉన్న మొదటి అంతస్తులో మాత్రమే ఈ ప్రమాదం సంభవించడంతో పలు అనుమానాలకు బలం చేకూరుతుంది. అందులో ఉన్న కీలక పత్రాలు, కంప్యూటర్లు మంటల్లో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉద్దేశపూర్వకంగా చేయించిన ప్రమాదంగా పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రమాదంపై కేసు నమోదు...

అగ్నిప్రమాద ఘటనపై నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. టూరిజం శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

కుట్రతోనే పర్యాటక శాఖ కార్యాలయం దగ్ధం: సీపీఐ నేత కె.నారాయణ

ప్రభుత్వం మారితే తమ అవినీతి బైటపడుతుందనే భయంతో తెలంగాణ పర్యాటక కార్పొరేషన్ కార్పొరేట్ కార్యాలయం దగ్ధం చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. మొదటి అంతస్తులోఉన్న అడ్మిన్ సెక్షన్ ముఖ్యమైన ఫైల్స్‌ను కుట్రతోనే దగ్ధం చేశారని, షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదం కాదని అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదం ప్రదేశాన్ని నారాయణ సందర్శించారు. మొదటి అంతస్తులో చెల్లాచెదురుగా దగ్ధమై పడిఉన్న ఫైల్స్‌ను ఆయన పరిశీలించారు. అగ్ని ప్రమాదంపై ఎలాంటి విచారణ జరగకుండా దగ్ధమైన వస్తువులు, ఫర్నిచర్, ఫైల్స్‌ను ఎలా చెత్తకుండీలో పడవేస్తారని, ఆగమేఘాలమీద కూలీలను పెట్టి శుభ్రం చేయించడంపై అనుమానం కలుగుతుందన్నారు. మంత్రికి తొత్తులుగా వ్యవహరించి ఎన్నికల నిబంధనలు బేఖాతర్ చేశాడని ఇటీవలే పర్యాటక కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిందని గుర్తు చేసారు. ఈ అగ్ని ప్రమాదం వెనుక భారీ కుట్ర దాగివుందని, ఉన్నత స్థాయి విచారణ జరిపించి నిగ్గు తేల్చాలని నారాయణ డిమాండ్ చేశారు.

రిగ్గింగ్ ఆరోపణలు అవాస్తవం

కొన్ని కేంద్రాల్లో రాత్రి 9.30 వరకు ఓటింగ్ కొనసాగింది..

అందుకే సాయంత్రం 5 గంటలతో పోల్చితే పోలింగ్ శాతం పెరిగింది: వికాస్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభకు గురువారం జరిగిన ఎన్నికల్లో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరగడంతోనే సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ శాతం భారీగా పెరిగిందన్న ఆరోపణలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తోసిపుచ్చారు. రాష్ట్రంలో దాదాపు అన్ని పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9.30 గంటల వరకు ఓటింగ్ కొనసాగడంతోనే పోలింగ్ శాతం పెరిగిందని చెప్పారు. శుక్రవారం వికాస్‌రాజ్ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 13 వామపక్ష తీవ్రవాద ప్రభావిత నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకు, మిగతా చోట్ల సాయంత్రం 5 గంటలకే పోలింగ్ సమయం ముగిసినా.. అప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలైన్లలో నిలబడిన వారందరికీ నిబంధనల ప్రకారం ఓటేసే అవకాశం కల్పించామని వికాస్‌రాజ్ వివరించారు. అందువల్ల ఆయాచోట్ల రాత్రి 9.30 గంటల వరకు పోలింగ్ జరిగిందని, అధికారులు ఈవీఎంలు, ఇతర సామగ్రిని సర్దుకుని రిసెప్షన్ కేంద్రాలకు చేరుకునే సరికి మరింత ఆలస్యమైందని చెప్పారు. రిసెప్షన్ కేంద్రాల్లో ఈవీఎంలకు ప్రాథమిక తనిఖీలు నిర్వహించి, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చినట్టు వెల్లడించారు. ప్రాథమిక స్క్రూటినీ తర్వాతే 70.6 శాతం పోలింగ్ జరిగినట్టు ప్రాథమి కంగా అంచనాకు వచ్చామని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు కూర్చుని అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తుది స్క్రూటినీ నిర్వహిస్తున్నారని వివరించారు. చాంద్రాయణగుట్ట సహా ఇతర స్థానాల్లో రిగ్గింగ్ జరిగినట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు పరిశీలిస్తున్నట్టు తెలిపారు. స్క్రూటినీ ముగిశాకే కచ్చితమైన పోలింగ్ శాతంతోపాటు రిగ్గింగ్ ఆరోపణల్లో నిజానిజాలపై స్పష్టత వస్తుందని.. ఆయా అంశాల ఆధారంగా తుది నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు.

ప్రశాంతంగా పోలింగ్

చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రంలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని వికాస్‌రాజ్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలన్నీ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్నట్టుగా ధ్రువీకరించుకున్నామని వివరించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 40 కంపెనీల కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని చెప్పారు.158పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఆయాచోట్ల కొత్త ఈవీఎంలను పెట్టి పోలింగ్ నిర్వహించామని.. దీనివల్ల కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 45 నిమిషాల వరకు ఆలస్యమైందని అదనపు సీఈఓ లోకేశ్‌కుమార్ వివరించారు.

నాగార్జున సాగర్ అంశానికి ఎన్నికలతో సంబంధం లేదు

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సగభాగాన్ని ఏపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఘటనకు రాష్ట్ర శాసనసభ ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదని వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. డీప్ ఫేక్, ఇతర తప్పుడు ప్రచారాల ఆరోపణలపై సోషల్ మీడియాలోని 120 లింక్‌లను తొలగించామన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడంపై విశ్లేషణ జరుపుతామన్నారు. డబ్బులు పంచుతూ కొందరు అభ్యర్థులు, వారి బంధువులు పట్టుబడిన ఘటనలపై స్పందిస్తూ.. రాష్ట్ర మంత్రులపై కేసులు నమోదయ్యాయని, రికార్డు స్థాయిలో 13వేలకుపైగా కేసులు పెట్టామని వికాస్‌రాజ్ వివరించారు.

భారీగా పెరిగిన పోస్టల్ బ్యాలెట్లు

ఈసారి పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ గణనీయంగా పెరిగిందని వికాస్‌రాజ్ తెలిపారు. 16,005 మంది 80 ఏళ్లకు పైబడిన ఓటర్లు, 9,459 మంది దివ్యాంగ ఓటర్లు, 1.80 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకున్నారని వివరించారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 33 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, కేంద్ర బలగాలు, రాష్ట్ర సాయుధ రిజర్వ్‌డ్ బలగాలు, రాష్ట్ర పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. 500కుపైగా పోలింగ్ కేంద్రాలున్న 6 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 14+14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని.. మిగతా స్థానాల ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఉంటాయని తెలిపారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉంటారని చెప్పారు. 119 స్థానాలకు సంబంధించి 1,766 కౌంటింగ్ టేబుల్స్ ఉంటాయని.. వీటిలో ఆర్వో, పోస్టల్ బ్యాలెట్ల కోసం 131 టేబుల్స్ ఉంటాయని వివరించారు.

ఉదయం 10.30 కల్లా లీడ్‌పై స్పష్టత

కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి తర్వాత ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తారని వికాస్‌రాజ్ తెలిపారు. ఒకవేళ పోస్టల్ ఓట్ల లెక్కింపునకు అధిక సమయం పడితే.. సమాంతరంగా ఈవీఎం ఓట్ల లెక్కింపూ మొదలవుతుందన్నారు. ఉదయం 10.30 గంటలకల్లా కౌంటింగ్‌లో ముందంజలో ఉన్న అభ్యర్థుల విషయంలో స్పష్టత వస్తుందని వికాస్‌రాజ్ అంచనా వేశారు. కొన్ని స్థానాల్లో అధిక పోలింగ్ జరగడం, చాలాచోట్లలో ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో ఓట్ల లెక్కింపునకు కొంత ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు.

మీ సేవలు అపురూపం

మీ పని తీరు అభినందనీయం.. పోలీసులకు బహుమతులు అందించిన కొత్వాల్



సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం, పక్షపాతం చూపించిన వారిపై వేటు వేసిన నగర కొత్వాల్ సందీప్ శాండిల్య.. ఉత్తమ పని తీరు కనబరిచిన వారిని గుర్తించి అభినందించారు. గురువారం పోలింగ్ నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు తమవంతుగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని శుక్రవారం ఆయన అభినందించారు. షాహినాయత్‌గంజ్ ఠాణా సరిహద్దు ప్రాంతంలో కొందరు రాజకీయ పార్టీలకు చెందిన పురుషులు, మహిళలు గొడవలు పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మంగళ్‌హాట్ ఠాణా ఎస్సై జి.అంబిక గుర్తించారు. తక్షణం అప్రమత్తమైన ఈమె షాహినాయత్‌గంజ్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు వచ్చిన సిబ్బందితో కలిసి ఆమె కూడా గుంపును చెదరగొట్టారు. హబీబ్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని పోలింగ్ బూత్‌లో బోగస్ ఓట్లు వేయడానికి వచ్చిన కొంత మందిని నిలువరించి, వారిని సంబంధిత ఠాణాకు అప్పగించి కేసు నమోదు చేయించడంలో సిటీ సెక్యూరిటీ వింగ్ కానిస్టేబుల్ వినయ్ కుమార్ కీలకపాత్ర పోషించారు. ఫలక్‌నుమా ఠాణా మహిళా కానిస్టేబుల్ కృష్ణకుమారి భోంస్లే కాలాపత్తర్ పరిధిలోని పోలింగ్ బూత్‌లో విధులు నిర్వర్తించారు. అక్కడ బోగస్ ఓట్లు వేయడానికి వచ్చిన కొందరు వ్యక్తుల్ని అడ్డుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ ముగ్గురినీ శుక్రవారం ఐసీసీసీలోని కమిషనరేట్‌కు పిలిపించిన కొత్వాల్ సందీప్ శాండిల్య అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అదనపు సీపీ (శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్, సంయుక్త సీపీ (ఎస్బీ) పి.విశ్వ ప్రసాద్ సైతం పాల్గొన్నారు.



> ఓంకార స్వరూపమైన అది (పరబ్రహ్మ) అన్ని విధాల పూర్ణమైనది.
> ఇది (జగత్తు) కూడా పూర్ణమైనది. ఆ పూర్ణం నుండే ఈ పూర్ణం ఉత్పన్నమైనది.
> పూర్ణం నుండి పూర్ణం తీసివేసినా పూర్ణం మిగిలేవుంటుంది.
> – ఈశావాస్యోపనిషత్తు

ఫోకస్

సాక్షి

శనివారం, 2 డిసెంబర్ 2023

కాప్ దిశ ఎటువైపు?

ఏటా తప్పనిసరి లాంఛనంగా జరిగే కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్)–28 సదస్సు శుక్రవారం మొదలైంది. ఈనెల 12 వరకూ జరగబోయే ఈ సదస్సుకు 130 మంది దేశాధినేతలు, దాదాపు 80,000 మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా. అలా చూస్తే ఈ సదస్సు గత సమావేశాలతో పోలిస్తే విస్తృతమైనదే. కానీ చివరాఖరికి ఇది ప్రభావవంతమైన నిర్ణయాలు తీసుకోగలదా లేక గత సదస్సుల మాదిరే ఉస్సూరనిపిస్తుందా అన్నదే పెద్ద ప్రశ్న. లక్ష సంవత్సరాల వ్యవధిలో జరగాల్సిన వాతావరణ మార్పులు కేవలం గత వందేళ్లలో సంభవించాయన్న చేదు వాస్తవాన్ని గుర్తించి చిత్త శుద్ధితో కాలుష్య నివారణ చర్యలకు ఉపక్రమించాల్సిన సంపన్న దేశాలు మాటలతో కాలక్షేపం చేసి లక్ష్యానికి తిలోదకాలిస్తున్నాయి. భూమాత తన భవిష్యత్తును పరిరక్షించమంటూ మనవైపు చూస్తున్నదని, ఈ విషయంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించి విజయం సాధించటం మనందరి కర్తవ్యమని సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు అర్థవంతమైనది. 2030 కల్లా కర్బన ఉద్గారాల తీవ్రతను 45 శాతానికి తగ్గించటంతో పాటు హరిత ఇంధనాల వాడకం వాటాను 50 శాతానికి పెంచాలని భారత్ నిర్ణయం తీసుకుందని ఆయన చెప్పటం కూడా మెచ్చదగ్గదే.

అయితే ప్రధాన కాలుష్య కారక దేశాలైన చైనా, అమెరికా, ఇతర సంపన్న దేశాలూ ఏం చేయబోతున్నాయన్నదే ప్రధానం. శిలాజ ఇంధనాల అవసరం లేని భవిష్యత్తును నిర్మించాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ దేశాధినేతలకు విన్నవించారు గానీ వినేదెవరు? వాతావరణ మార్పులు ఎలా వున్నాయో వివిధ నివేదికలు చెబుతున్నాయి. గత ఏడెనిమిది దశాబ్దాలుగా కనీవినీ ఎరుగని ఉష్ణోగ్రతలను ఈ ఏడాది చవిచూశామని వాతావరణ పరిశోధకులు అంటున్నారు. ఇది ఏ స్థాయిలో వున్నదంటే పనామాలో కరువుకాటకాలు విస్తరిల్లి పసిఫిక్, అట్లాంటిక్ మహా సముద్రాలను అనుసంధానించే 80 కిలోమీటర్ల పనామా కాలువకు నీటి పరిమాణం గణనీయంగా తగ్గింది. దాంతో ఆ కాల్వమీదుగా వెళ్లే నౌకల సంఖ్య 40 నుంచి 32కు తగ్గింది. అంతేకాదు... నౌకలు మోసుకెళ్లే సరుకుల బరువుపై కూడా పరిమితులు విధించారు. పర్యవసానంగా సరుకు రవాణా బాగా దెబ్బతింది. ఇక ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాదంతా చవిచూసిన కార్చిచ్చులు, వరదలు అన్నీ ఇన్నీ కావు. ఈసారి భారీవర్షాలతో మన దేశం 1,500 కోట్ల డాలర్ల మేర ఆస్తి నష్టాన్ని చవిచూసింది. లిబియానూ, మెక్సికోనూ కనీవినీ ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తాయి. ఇలాంటి పరిణామాలు ఆర్థిక వ్యవస్థలను తలకిందులు చేస్తాయి. నిజానికి ఈ పరిస్థితులను సమీక్షించి, సరైన నిర్ణయాలు తీసుకోవటానికి కాప్ వంటి వేదికలు తోడ్పడాలి. ఆచరణలో అది సాధ్యం కావటం లేదు. ఉష్ణోగ్రతల పెరుగుదలను పారిశ్రామికీకరణకు ముందునాటి ఉష్ణోగ్రతలతో పోలిస్తే కనీసం 1.5 డిగ్రీల సెల్సియస్ మేరకు పరిమితం చేయాలంటే అన్ని రకాల శిలాజ ఇంధనాల వాడకాన్నీ నిలిపేయటం తప్ప తగ్గించటంవల్ల ఒరిగేదేమీ లేదన్నది పర్యావరణవేత్తల మాట. కానీ సంపన్న దేశాలు నిలకడగా ఒక మాట మీద ఉండటం, ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చటం ఇంతవరకూ లేనేలేదు. ఉదాహరణకు శాస్త్రవేత్తలు ఎప్పటినుంచో చేస్తున్న హెచ్చరికలు చేదు వాస్తవమని పర్యావరణపరంగా జరుగుతున్న పెను మార్పులు రుజువు చేస్తున్నాయని, తక్షణం కర్బన ఉద్గారాలను ఆపటంలో విఫలమైతే మహా విపత్తు తప్పదని ఇదే సదస్సులో మాట్లాడిన బ్రిటన్ రాజు చార్లెస్–3 చెప్పారు. కానీ విషాదమేమంటే బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ గత ప్రభుత్వాల వాగ్దానాలను బుట్టదాఖలు చేస్తూ పెట్రోల్, డీజిల్ కార్ల విక్రయాలకున్న గడువును 2030 నుంచి 2035కు పొడిగించారు. 2035 నాటికి కొత్త గ్యాస్ బాయిలర్ల ఏర్పాటును ఆపేస్తామన్న వాగ్దానాన్ని కూడా పక్కనబెట్టారు. ఒకే దేశం భిన్న వైఖరులను ప్రదర్శించటం పర్యావరణ పరిరక్షణకు ఏమేరకు దోహదపడుతుందో చార్లెస్–3, సునాక్‌లు ఆలోచించాలి.

అసలు శిలాజ ఇంధనాల ఉత్పత్తిలో అగ్రస్థానంలో వున్న దేశాల్లో ఒకటైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో కాప్ సదస్సు నిర్వహించటం, సదస్సు అధ్యక్ష స్థానంలో వుండటం ఒక విచిత్రం. నిరుడు ఈజిప్టులో కాప్ సదస్సు జరిగింది. అప్పటినుంచీ శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజవాయు ఉత్పత్తులు రికార్డు స్థాయికి చేరాయని గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం ఉత్పత్తుల్లో చమురు వాటా 40 శాతం కాగా, బొగ్గు ఉత్పత్తి వాటా 31 శాతం. మిగిలిన 29 శాతం సహజవాయు ఉత్పత్తులది. వీటిని ఒకేసారి పూర్తిగా తగ్గించుకోవటం సాధ్యపడదు గానీ, ఒక క్రమ పద్ధతిలో హరిత ఇంధనాల వైపు మొగ్గటం ప్రారంభిస్తే లక్ష్యసాధన సులభం అవుతుంది. కానీ ఆ దిశగా ఏ దేశమూ చర్యలు తీసుకోవటం లేదు. నిరుడు ప్రపంచదేశాలు శిలాజ ఇంధనాల సబ్సిడీ కోసం ఏడు లక్షల కోట్ల డాలర్ల సొమ్మును వినియోగించాయని ఒక అంచనా. పునరుత్పాదక ఇంధన వనరులను పెంచటం విషయంలో ఈసారైనా కాప్ దృష్టి సారించాలి. లేనట్టయితే పర్యావరణ విధ్వంసం మరింత పెరగటం ఖాయం. ఇందుకు అవసరమైన సాంకేతికతలను వెనకబడిన దేశాలకు చవగ్గా అందించటంలో సంపన్న దేశాలు విఫలమవుతున్నాయి. ఇది సరికాదు. నిపుణుల మాట వినటం, పారిస్ ఒడంబడిక అమలుకు నిర్దిష్ట కార్యాచరణ రూపొందించి చిత్తశుద్ధితో దాన్ని అమలు చేయటం తక్షణావసరం. ఒడంబడిక లక్ష్యాలను విస్మరించిన దేశాలపై ఎలాంటి చర్యలుండాలో నిర్ణయించాలి. ప్రపంచంలో ఏమూల పర్యావరణానికి విఘాతం కలిగినా అది అన్ని దేశాలకూ ముప్పు కలిగిస్తుందని అందరూ గుర్తించాలి. కాప్ సదస్సు ఈ స్పృహను కలిగించగలిగితే దాని లక్ష్యం ఏదోమేరకు నెరవేరినట్టే.

కార్మికులను కాపాడాం... గుణపాఠాలో!

విశ్లేషణ



దినేష్ సి. శర్మ

ఉత్తరకాశీలోని సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల పరిరక్షణ చర్య విజయవంతంగా ముగిసింది. పాక్షికంగా కూలిపోయిన సొరంగంలో దాదాపు 17 రోజులపాటు చిక్కుకున్న కార్మికులందరినీ భారతీయ, విదేశీ నిపుణులు ఉమ్మడిగా సురక్షితంగా బయటికి తీయగలిగారు. హిమాలయ ప్రాంతంలో ఒక పెద్ద అభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించిన ప్రమాదం జరగడం ఇదే మొదటిసారి కాదు. సిల్‌క్యారా సొరంగంలో జరిగిన విపత్తు... పెళుసైన కొండ ప్రాంతాలలో చేపట్టే భారీ స్థాయి ప్రాజెక్టులకు సంబంధించి అనేక ప్రశ్నలను లేవనెత్తింది. కఠినతరమైన భూభాగంలో కార్యకలాపాల భద్రతపైనా, అలాంటి ప్రాజెక్టులకు అవసరమైన విపత్తు సంసిద్ధతపైనా కూడా ప్రశ్నలను లేవనెత్తింది. హిమాలయ పర్యావరణ వ్యవస్థను కోలుకోలేని నష్టం నుండి రక్షించడానికి ఈ సొరంగ ప్రమాద ఘటన మరో మేల్కొలుపు కావాలి.

బద్రీనాథ్, కేదార్‌నాథ్ వంటి ముఖ్యమైన మతపరమైన పుణ్యక్షేత్రాలను కలుపుతూ, అన్ని వాతావరణాల్లో పనిచేసే నాలుగు లేన్ల రహదారిని నిర్మించాలనే లక్ష్యంతో, ప్రతిష్ఠాత్మకమైన చార్ ధామ్ ప్రాజెక్టులో భాగంగా సిల్‌క్యారా సొరంగాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టును పర్యావరణ సంఘాలు విమర్శించాయి. దీనిపై సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా వేశాయి. అనేక ప్రభుత్వ కమిటీలు ప్రాజెక్టును వివిధ కోణాల్లో పరిశీలించి, దానికి అనుమతిని ఇచ్చాయి. అయితే ప్రస్తుత సొరంగ ప్రమాద ఘటన హిమాలయ ప్రాంతంలో ఇటువంటి ప్రాజెక్టులను చేపట్టడంపై అన్ని సందేహాలను, భయాలను పునరుద్ధరించింది.



సొరంగాలు ఉత్తమ మార్గమే అయినా...

అడవుల విధ్వంసాన్ని నివారించడానికి, పర్యావరణ హానిని తగ్గించడానికి సొరంగ నిర్మాణం ఒక మంచి ఎంపికగా కనిపిస్తున్నప్పటికీ, సొరంగం పరిమాణం చాలా ముఖ్యమైనది. పొడవాటి సొరంగాల వల్ల కలిగే నష్టాన్ని కొండలు తట్టుకోగలవా? చిన్న సొరంగాలను నిర్మించడంపై ప్రాజెక్ట్ బృందాలు ఆలోచించాలి. రహదారులు లేదా జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం పొడవైన నిర్మాణాలను నిర్మించే ముందు సొరంగ తవ్వకం కలిగించే పర్యావరణ ప్రభావాన్ని సరిగ్గా అంచనా వేయాలి. అనాలోచితంగా చేసే సొరంగ నిర్మాణం భూగర్భ జల వనరులను ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో కొండచరియలు విరిగిపడతాయి కూడా. విశాలమైన సొరంగాల తయారీ కోసం చేసే పేలుళ్లు ప్రమాదకరమైన పర్యావరణ పరిణామాలకు కారణమవుతాయి. విపత్తు సంసిద్ధతతోపాటు, నిర్మాణ సంస్థలు తీసుకునే భద్రతా జాగ్రత్తలు మరొక సమాధానం లేని ప్రశ్నగా ఉంటున్నాయి. సిల్‌క్యారా ప్రాజెక్ట్‌లో ప్రమేయం ఉన్న కంపెనీలు, ప్రభుత్వ సంస్థల వైపు నుండి లోపాలు ఉంటే వాటిని పూర్తి స్థాయి విచారణ మాత్రమే వెల్లడిస్తుంది.

కొండల్లో భారీ జలవిద్యుత్ ప్రాజెక్టులు, హైవేలు, పర్యాటక సంబంధిత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దాదాపు రెండు దశాబ్దాలుగా చర్చలు సాగుతున్నాయి. నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ హయాంలో పర్యావరణ సంఘాల సుదీర్ఘ ఆందోళన తర్వాత, రెండు భారీ ప్రాజెక్టులను నిలిపివేశారు. పైగా కొత్త, పెద్ద ప్రాజెక్టులు ఏవీ చేపట్టలేదు. అయితే గత దశాబ్దంలో, కొండలపై నిర్మాణ కార్యకలాపాలను పునరుద్ధరించారు. భద్రతా సమస్యలు, పర్యావరణ సమీక్షల కోసం పిలుపులను విస్మరించారు. తప్పనిసరి పర్యావరణ ప్రభావ అంచనా వంటి వివిధ చట్టాలు, నిబంధనలను సంబంధిత ఏజెన్సీలు, ప్రభుత్వాలు తీవ్రంగా పలుచన చేసిపడేశాయి లేదా దాటవేశాయి. ఈలోగా, వాతావరణ మార్పుల కారణంగా పర్యావరణ ప్రమాదాలు పెరిగాయి. దీని ఫలితంగా తీవ్రమైన వాతావరణ ఘటనలు, విపత్తులు సంభవిస్తాయి.

సంసిద్ధత ఉందా?

కొండల్లోని ప్రాజెక్టుల భద్రత, విపత్తులను ఎదుర్కొనే సంసిద్ధతను పూర్తిగా పరిష్కరించడం అనేది మరొక ప్రధాన సమస్య. సొరంగ ప్రమాదాలకు గల కారణాలపై శ్రద్ధ చూపడం, నిర్మాణ స్థలాల వద్ద భద్రతను నిర్ధారించడం చాలా కీలకం. గతంలో ఉత్తరాఖండ్‌లో జరిగిన సంఘటనలతో పాటు, ఇటీవల సిక్కింలో జరిగిన హిమనీనద సరస్సు ఉప్పెన వరద సంబంధిత విపత్తు ద్వారా కూడా ఇది బాగా నిరూపితమైంది. తక్కువ సాంకేతిక, భద్రతాపరమైన నిర్వహణ, అలాగే వర్ష మేఘాల విస్ఫోటనం, కొండ చరియలు విరిగి పడటం మొదలైన ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రమాదాలు తరచుగా సంభవిస్తాయి. అన్ని స్థాయిలలో శిక్షణ, భద్రతా నిర్వహణపై తగిన శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనేక సాంకేతిక, శాస్త్రీయ సమస్యలను ప్రణాళికా దశలోనే అధ్యయనం చేసి పరిష్కరించాలి. సిల్‌క్యారా–బడ్‌కోట్ సొరంగం కోసం నవయుగ ఇంజనీరింగ్ కంపెనీకి ప్లానింగ్, కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్న యూరప్‌కు చెందిన బెర్నార్డ్ గ్రుప్పే సంస్థ, ''సొరంగాన్ని తవ్వడం ప్రారంభమైనప్పటి నుండి, టెండర్ డాక్యుమెంట్‌లలో ఊహించిన దానికంటే భౌగోళిక పరిస్థితులు చాలా సవాలుగా ఉన్నాయని నిరూపితమయ్యాయి. ఆ విధంగా అమలు దశ ప్రారంభంలో చేపట్టిన తదుపరి అన్వేషణే దాని చర్యల ఫలితాలను నిర్ధారిస్తుంది'' అని వెల్లడించింది. అటువంటి ప్రాజెక్టులను ఆమోదించే ముందు సమగ్రమైన భౌగోళిక అధ్యయనాల అవసరాన్ని ఇది సూచిస్తుంది.

కేవలం ప్రమాదమా?

కార్మికుల రక్షణ కోసం సొరంగం లభ్యత వంటి భద్రతా నియమాలను, నిబంధనలను నిర్మాణ సంస్థలు అనుసరించి ఉంటే, సొరంగంలో చిక్కుకున్న కార్మికులను చాలా ముందుగానే రక్షించి ఉండవచ్చు. ఇప్పుడు ఇలాంటి ప్రమాదం సంభవించినందున, ఇటీవలి సంవత్సరాలలో రాష్ట్రం అనేక విపత్తులను ఎదుర్కొన్న వాస్తవాన్ని బట్టి త్వరితగతిన కార్మికుల పరిరక్షణ కార్యకలాపాలకు వ్యవస్థలు ఉండాలి. సంబంధిత అన్ని ఏజెన్సీలు పరిస్థితిని ఎలా నిర్వహించాలనే అంశంపై తమ అనుభవాన్ని, పరిజ్ఞానాన్ని పంచుకోవాలి.

సిల్‌క్యారా సొరంగ విపత్తును కేవలం ప్రమాదంగా పరిగణించి హిమాలయాల్లో యథావిధిగా వ్యవహారాలను కొనసాగించడం తప్పు. కోలుకోలేని నష్టం నుండి హిమాలయ పర్యావరణాన్ని కాపాడటానికి ఇది మరో మేల్కొలుపు. ఈ ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులు అని పేర్కొంటున్న వాటి గురించి మనం అసౌకర్యమైన ప్రశ్నలు అడగవలసి ఉంటుంది. 900 కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్ హైవే, ఈ ప్రాంతంలో రైల్వే ప్రాజెక్టులు (కనీసం ఒక డజను సొరంగాల నిర్మాణంతో కూడి ఉంటాయి), పర్యాటకాన్ని నిస్సంకోచంగా ప్రోత్సహించడం (ఇది కొండలను మోసుకెళ్లే సామర్థ్యాన్ని మించి ఉంటోంది), జల విద్యుత్ ప్రాజెక్టుల భారీ స్థాయి అభివృద్ధి... ఇలా అన్నింటిపై ఒక పునరాలోచన అవసరం. కొండల్లోని ప్రజలకు విద్యుత్తు, ఉపాధి లేదా పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఆనందించే లేదా అందుబాటులో ఉండే ఇతర సౌకర్యాలు లేకుండా చేయాలని దీని అర్థం కాదు. పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఇవన్నీ ఎలా సాధిస్తామన్నదే కీలక ప్రశ్న. వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాల్‌కు తగ్గట్టుగా దీన్ని ఎలా సాధిస్తాం? సిల్‌క్యారాలో జరిగినటువంటి విషాద సంఘటనల పట్ల మనకు ఒక సమగ్ర దృక్పథం లేకుండా ఎంతమాత్రమూ ముందడుగు వెయ్యలేం.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏ ప్రయోజనాలకు?



ఉత్తుత్తి ఖలిస్తానీ భయాన్ని సృష్టించడం అనేది నిప్పుతో చెలగాటం. ఎన్నికల్లో లబ్ధి కోసం బూచిని పుట్టించడం జాతీయ భద్రతతో ఆడుకోవడమే. ప్రస్తుతం పంజాబ్‌లో వేర్పాటు వాద భావాలు లేవు. అయినా ఎందుకీ కృత్రిమ కథనాలను వండుతున్నారు? కెనడా, యూఎస్‌ఏలో ఉన్నవాళ్ల మీద మోదీ ప్రభుత్వం ఎందుకు అతిగా శ్రద్ధ పెడుతోంది?

– స్వాతి చతుర్వేది, జర్నలిస్ట్

ఇప్పుడు వింతేనా?



నాకు 48 ఏళ్లు. మద్యం, పొగ తాగను. వారానికి 70 కిలో మీటర్లు పరుగెత్తుతాను. కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తాను. పార్టీలకు వెళ్లను. పదింటికల్లా నిద్రపోతాను. చిన్న కారుంది. కానీ ఎక్కువగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టులోనే ప్రయాణిస్తాను. నన్ను సమాజం అంగీకరిస్తుందా?

– షాజన్ శామ్యూల్, రన్నర్

ఎందుకీ వ్యతిరేకత?



నా వ్యాఖ్యల్ని సోషల్ మీడియాలో పంచుకున్నందుకు, కశ్మీర్‌లోని ఇస్లామిస్టులు ఒక హిందూ విద్యార్థిని చంపుతామని బెదిరిస్తున్నారు. విద్యార్థిని వదిలిపెట్టి, నన్ను పట్టుకోండి. భావ స్వేచ్ఛ మీద ముస్లింలు చూపే వ్యతిరేకతతో నేను విసిగి పోయాను. (శ్రీనగర్‌లోని ఎన్ఐటీ విద్యార్థి వివాదాస్పద పోస్టు నేపథ్యంలో.)

– మొసాబ్ హసాన్ యూసెఫ్, హమాస్ మాజీ నాయకుడి కొడుకు, ఇజ్రాయెల్‌కు ఒకప్పటి గూఢచారి

భలే ఐడియా



ఎగ్జిట్ పోల్ కంపెనీని ప్రారంభించడం సరదాగా ఉండేట్టుంది. మనం ఏదైనా చెప్పొచ్చు, కానీ ఎవరూ మనల్ని జవాబుదారీ చేయరు. ఇంకీ, పింకీ, పాంకీ ఆడుతూ కూడా గెలిచేది ఎవరో చెప్పినా మనల్ని ఎవరూ ఆపరు.

– కార్తీక్, వ్యాఖ్యాత

మనమెందుకు మరి?



దేవుళ్లు లేకపోతే మనం ఏమీ కామని పిల్లలకు బోధించడమంటే, వాళ్లు ఎందుకూ పనికిరారని బోధించడమే.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

షరతులు వర్తించాలి!



ఇజ్రాయెల్‌కు యూఎస్ ఇచ్చే సాయం మీద షరతులు విధించాలా అన్న ప్రశ్నే అర్థరహితం. కచ్చితంగా విధించాలి. అది ఇజ్రాయెల్ అయినందువల్ల కాదు ; ఏ దేశానికైనా పంపే 'పూర్తి' సైనిక సాయం షరతులతోనే వెళ్లాలి.

– ఏమీ దార్, ఇజ్రాయెల్ పీస్ యాక్టివిస్ట్

ఎన్నికల గ్యారంటీలు 'జుమ్లా'లేనా?

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

దేశంలోని దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు తరచుగా చెప్పే మాట తమకు అధికారం ఇస్తే ప్రజలను సాధికారులుగా చేస్తాం అన్నది. అసలు సాధికారత (ఎంపవర్‌మెంట్) అంటే అర్థం ఏమిటి? దీనికి విస్తృతమైన అర్థాలు ఉన్నాయి. ముందుగా శారీరకంగా బలహీనంగా ఉన్న వ్యక్తి లేదా అతని కుటుంబాన్ని బలోపేతం చేయడం, ఆ తర్వాత ఆ కుటుంబాన్ని సామాజికంగా బలోపేతం చేయడం అన్నది సాధికారతలో ఓ భాగం. కుటుంబాన్ని బలోపేతం చేయడమనే ప్రక్రియ ఎలా జరుగుతుంది? ప్రతిరోజూ బలవర్ధకమైన ఆహారాన్ని వ్యక్తికి లేదా అతని కుటుంబానికి అందించాలి. వారు ఆరోగ్యంగా ఉండేటట్లు చూడాలి. అలా ఎంత కాలం చేయాలి? జీవితకాలంపాటు ఈ ప్రక్రియ కొనసాగాలి. కానీ, ఏ ప్రభుత్వమైనా అధికారంలో ఉండేది ఐదేళ్లపాటు మాత్రమే.

ఐదేళ్లు ఉండే ప్రభుత్వం ఏ వ్యక్తినైనా, కుటుంబాన్నైనా, వర్గాన్నైనా జీవితకాలం పాటు పోషించలేదు కదా? అటువంటప్పుడు వారు సాధికారులు ఎలా అవుతారు?! ఆధునిక చైనా పితామహుడిగా చెప్పుకొనే డెంగ్ జియావో పింగ్ దీనినే ఓ ఉదాహరణ ద్వారా వివరించారు. ఆకలిగొన్న వ్యక్తికి రోజూ ఓ చేప చొప్పున ఇస్తూపోతే... అది ఇచ్చినంత కాలమే అతని ఆకలి తీరుతుంది. అదే అతనికి చేపలు పట్టే విద్య నేర్పించి, ఓ వలను ఇవ్వగలిగితే అతడు తన జీవితకాలం తన పొట్టను తానే పోషించుకొంటాడు. పైగా తన కుటుంబాన్ని సైతం ఆదుకోగలుగుతాడు. ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమం ఎలా ఇవ్వాలో సూక్ష్మంగా చెప్పాడు డెంగ్ ఈ ఉదాహరణ ద్వారా. ఇదే సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణలో పెట్టడం ద్వారానే డెంగ్ తన పాలనలో చైనాను ప్రపంచంలో ఓ బలమైన ఆర్థిక శక్తిగా రూపొందించగలిగాడు.

ప్రజల సమస్త వ్యక్తిగత, సామాజిక అవసరాలన్నింటినీ తామే తీర్చగలమన్న భ్రమల్ని వారిలో కల్పిస్తూ కొన్ని రాజకీయ పార్టీలు పబ్బం గడుపుకొంటున్నాయి. ఓట్ల కోసం హామీలు గుప్పించడం రాజకీయ పార్టీలకు రివాజుగా మారింది. అది ఇటీవలి కాలంలో మరింత వెర్రితలలు వేస్తోంది. వ్యవసాయరంగం మెరుగుదల, మౌలిక సదుపాయాల విస్తరణ; విద్య, వైద్యం వంటివి సామాన్యులకు అందుబాటులోకి తేవడం, శాంతి భద్రతలను పటిష్ఠపర్చి పారిశ్రామిక పెట్టుబడుల్ని ఆకర్షించడం ద్వారా నిరుద్యోగాన్ని పారద్రోలడం వంటి చర్యలు ఏ ప్రభుత్వానికైనా ప్రాధాన్యం కావాలి. మహిళలు, బాలలు, వృద్ధులకు తగిన సామాజిక సంరక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. వీటిపైన దృష్టి పెట్టగలిగితే ప్రజలను సాధికారుల్ని చేసినట్లే.

భారతదేశం నిద్రపోతున్న ఓ ఆర్థిక దిగ్గజం (స్లీపింగ్ జెయింట్) అని 70వ దశకంలోనే నాటి సింగపూర్ అధ్యక్షుడు 'లీ కువాన్ యు' అన్నారు. 1991లో పీవీ నరసింహారావు దేశ ప్రధాని అయిన తర్వాత గానీ దేశానికి పట్టిన స్తబ్ధత వదలలేదు. దశాబ్దాలపాటు పట్టి పీడించిన కొన్ని జాడ్యాలను వదిలించుకొని ఆర్థిక వ్యవస్థ వడివడిగా అడుగులు వేస్తూ... పీవీ – డా॥ మన్మోహన్ సింగ్‌ల ద్వయం చూపిన సంస్కరణల బాటలో ముందుకు సాగిన ప్రస్థానానికి దాదాపు 3 దశాబ్దాల వయస్సు. ఈ కాలంలో దేశం చాలా రంగాలలో అభివృద్ధి చెందిన మాట నిజం. ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతున్నది అన్నది కూడా ఓ వాస్తవం.

అయితే, ఈ ప్రస్థానం ఏ దిశగా సాగుతోంది? దేశంలోని సహజ వనరులన్నీ ప్రజలందరికీ సమానంగా చెందాలన్న రాజ్యాంగ లక్ష్యాలకు, రాజ్యాంగ నిర్మాత డా॥ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు భిన్నంగా దేశ సంపద కొంత మంది పారిశ్రామిక వేత్తలకు దఖలు పడింది. ప్రపంచ కుబేరుల జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు లేదా ముగ్గురు మొదటి వరుసలో ఉండగా, మరో 10 మంది రెండో వరుసలో కనిపిస్తారు. అదే సమయంలో... ప్రపంచ ఆకలి సూచీలో 180 దేశాల జాబితాలో ఇండియా 165–170 స్థానాల మధ్య ఊగిసలాడుతోంది. మనకంటే పొరుగునున్న ఆసియా దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్ ఆకలి సూచీలో మెరుగైన స్థానంలో ఉన్నాయి. ఆర్థిక దిగ్గజమైన భారత్‌కు ఇంతకంటే అవమానం మరొకటి ఉంటుందా?

ఈ 3 దశాబ్దాలలో దేశ సంపద బాగా పెరిగింది. దేశ స్థూల ఉత్పత్తి 40 లక్షల కోట్లు దాటింది. అదే సమయంలో దేశంలో ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోయినట్లు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. దేశంలో పేదలు మరింత పేదలయ్యారు. సంపన్నులు పైపైకి ఎగబాకుతున్నారు.

ఒకప్పుడు బాగా ప్రాచుర్యం పొందిన సోషలిజం



స్థానంలో చాలాకాలంగా 'పాపులిజం' వచ్చి చేరింది. 'అన్ని వర్గాలకూ అన్నీ' అన్నదే పాపులిజం మూల సూత్రం. ఓట్లు రాల్చే ఈ 'ఇజం' చుట్టూనే నేటి రాజకీయాలు పరిభ్రమిస్తున్నాయి. ఈ పాపులిజం ఇటీవలి కాలంలో వెర్రితలలు వేయడమే నేటి విషాదం! దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు 'జాకబ్ జుమా' పాపులిస్ట్‌గా మారి దేశాన్ని అప్పుల ఊబిలో నెట్టివేశారు. ఆ దేశ జీడీపీలో అప్పుల నిష్పత్తి 50 శాతం దాటిన నేపథ్యంలో... సొంత పార్టీ వారే ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి దించి వేశారు. 'జాకబ్ జుమా' ఉదంతం ప్రపంచంలో అనేక దేశాలకు గుణపాఠం నేర్పింది. మొత్తం జీడీపీలో అప్పుల శాతం 24 శాతం మించరాదనీ, అదికూడా వృద్ధిరేటు 7 శాతం దాటినప్పుడే అది ఆమోదయోగ్యం కాగలదనీ ప్రముఖ ఆర్థికవేత్తలు నిగ్గు తేల్చారు.

అయితే, భారత్‌లో కొన్ని రాజకీయ పార్టీలు ఇటువంటి లెక్కల్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. అధికారం కోసం మొదట కర్ణాటకలో, ఆ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీలు, ఇతర హామీల విలువ కనీసం రెండు రాష్ట్రాల బడ్జెట్‌తో సమానం. ఇవి నెరవేర్చాలంటే ప్రజలపై అధికంగా పన్నులు వేయాలి, ఎఫ్.ఆర్.బి.ఎం.ను మించి అప్పులు తేవాలి. అవీ చాలకపోతే ప్రభుత్వ భూములు అమ్మాలి. ఇప్పటికే విలువైన ప్రభుత్వ భూములు చాలావరకు వేలంలో పోయాయి. భవిష్యత్ అవసరాలకోసం తిరిగి భూములు కొనాల్సిన దుస్థితి ఇకపై రావొచ్చు. ఇక ఎటొచ్చీ, కొన్ని పథకాలను అమలు చేయకుండా మంగళం పాడొచ్చు. అలాగే ఎన్నికల ముందు ప్రకటించిన గ్యారంటీలను సైతం ఎత్తివేయవచ్చు.

రాజకీయ పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోకు ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడమే ఎడాపెడా హామీలు ప్రకటించడానికి కారణం అవుతోంది. మన దేశంలో రాజకీయ పార్టీల హామీల అంశంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నాయి. అందువల్ల ఆకాశమే హద్దుగా కొన్ని రాజకీయ పార్టీలు హామీల సునామీ సృష్టిస్తున్నాయి. 2014లో బీజేపీ తన మేనిఫెస్టోలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు అందిస్తామని చెప్పింది. విదేశాల్లో పోగుపడిన నల్ల ధనాన్ని వెనక్కి రప్పించి అందరి ఖాతాల్లో 15 లక్షల రూపాయల చొప్పున జమ చేస్తామని బీజేపీ అగ్రనేతలు నమ్మకంగా చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ హామీల సంగతేమిటని కేంద్రమంత్రి 'అమిత్ షా'ను నిలదీస్తే, అవన్నీ 'ఎన్నికల జుమ్లా' అని ఆయన ఒక్క మాటతో తేల్చేశారు. అంటే, ఎన్నికల సందర్భంలో ఎన్నో గాలి వాగ్దానాలు చేస్తుంటాం. వాటిని మీరు సీరియస్‌గా తీసుకొంటే ఎలా? అనే అర్థంలో కొందరు రాజకీయ నాయకులు అంటున్నారు. ప్రజలు ఈ 'జుమ్లా' మాటలు నమ్మడం లేదనే కారణంగానే ఇపుడు గ్యారెంటీలు ఇస్తున్నారు. సదరు గ్యారెంటీలు అమలు జరుగుతాయన్న గ్యారెంటీ కూడా లేదు. ఇదొక చేదు వాస్తవం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

భగవంతుడు ఒక రైతు

భగవంతుణ్ణి మన పూర్వాచార్యులు వ్యవసాయకారుడితో పోల్చినారు. ఎలాగంటే, వ్యవసాయదారుడు అదనులో దుక్కిదున్ని విత్తనం చల్లుతాడు. ఆ యేడు కురిసిన మిక్కుటమైన వర్షాలవల్ల కోతకొచ్చిన పంట కొట్టుకుపోతుందనుకో, అతడు నిరాశ చెందడు. వ్యవసాయానికి ఎగనామం పెట్టడు. మరుసటేడు మళ్ళీ దుక్కిదున్ని మళ్లీ విత్తనం చల్లుతాడు. ఈసారి కూడా అనావృష్టి వల్ల ఆశించినంతగా పంట దిగుబడి కాలేదనుకో, అయినా అతడు నిరాశకు లోనుకాడు. తన ప్రయత్నం మానడు. మళ్ళీ దున్నుతాడు, మళ్ళీ విత్తనం చల్లుతాడు.

అలాగే భగవంతుడూను. మానవులు ఉపాసించి, తాపత్రయం వీడి, జీవన్ముక్తులై, తన సన్నిధి చేరి తరిస్తారని భగవంతుడి ఆశ. వారిని ఉద్ధరించే ఉద్దేశంతో భగవంతుడు చేయని ప్రయత్నం లేదు. ఎపుడెపుడు ధర్మం



క్షీణముఖం పడుతుందో, అపుడపుడల్లా ధర్మరక్షణ నిమిత్తం భూమ్మీద తాను స్వయంగా అవతరిస్తాడు. ఇంత చేసినా తనను అవతారమూర్తిగా గుర్తించేవారు ఏ కొద్ది మందో ఉంటారు. మిగతా అందరూ తనను నిర్లక్ష్యం చేసేవారుగానో, వ్యతిరేకించే వారుగానో ఉంటారు. భగవద్గీత ఏడో అధ్యాయం 'జ్ఞాన విజ్ఞాన యోగం'లో భగవంతుడైన శ్రీకృష్ణుడు, 'మనుష్యాణాం సహస్రేషు...' అనీ, 'మూఢోయం నాభిజానాతి' అనీ, 'మాంతు వేదన కశ్చన...' అనీ అంటాడు. అంటే, వేయిమంది మనుష్యుల్లో ఏ ఒక్కడో నన్ను తెలుసుకోవడం కోసం ప్రయత్నిస్తాడు. అట్లా ప్రయత్నించే వాళ్లలో ఎవడో ఒకడు నన్ను యథార్థంగా తెలుసుకొంటాడు. ఈ మూఢ లోకం నన్ను గుర్తించలేక పోతోంది. వీరంతా ఎవరో నాకు తెలుసు కాని, నేనెవరో వీళ్లలో ఏ ఒక్కడికీ తెలియదు అని అర్థం. ఈ విధంగా భగవంతుడు తన నిర్వేదాన్ని తెలియజేస్తాడు.

అయినప్పటికీ భగవంతుడు నిరాశ చెంది తన సృష్టి కార్యాన్ని విరమించుకుంటాడా అంటే విరమించుకోడు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తిరిగి తన సృష్టి కార్యానికి శ్రీకారం చుడతాడు. ధర్మగ్లాని సంభవించినపుడల్లా తానే స్వయంగా పూనుకొని, ధర్మాన్ని నిలబెడతాడు. అజ్ఞానంలో ఉన్న మానవాళికి జ్ఞానం ప్రసాదించటానికి ఆచార్యుల్నీ, సద్గురువుల్నీ అవసరమైనపుడల్లా వెంటవెంటనే భూమ్మీదకు పంపే ఏర్పాటు చేస్తాడు. నిరాశ చెందకుండా ఇంత ప్రయత్నం పదే పదే ఎందుకు చేస్తాడు అంటే, అందుకు కారణం, తను చేసిన సృష్టిలోని మానవుడి మీద భగవంతుడికి ఉండే ప్రేమ! తన పొలం మీద వ్యవసాయదారుడికి ఎంత ప్రేమో భగవంతుడికి మానవుడి మీద అంత ప్రేమ. అందువల్లనే భగవంతుడితో వ్యవసాయదారుడికి పోలిక చెప్పారు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.పంచమి సా.4.33 వరకు,తదుపరి షష్ఠి, **నక్షత్రం:** పుష్యమి రా.7.04 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.6.14 నుండి 7.47 వరకు.
అమృతఘడియలు: ప.12.10 నుండి 1.54 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.17, **సూర్యాస్తమయం:** 5.20.

క్లుప్తంగా...

రాష్ట్రంలో హంగ్ వచ్చే అవకాశం లేదు: నారాయణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హంగ్ వచ్చే అవకాశం లేదని, కాంగ్రెస్ పార్టీకి పూర్తి స్థాయి మెజారిటీ వస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అంచనా వేశారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎంఎల్ఏలతో క్యాంపు ఏర్పాటు చేసుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయని, సీపీఐ మాత్రం ఆ క్యాంప్‌నకు వెళ్ళబోదని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ మగ్దూంభవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.బాలమల్లేశ్‌తో కలిసి నారాయణ మీడియాతో మాట్లాడారు. అహంభావమే కేసీఆర్, కేటీఆర్‌లను ఓడిస్తోందన్నారు. ఖమ్మంలో కూడా మంత్రి పువ్వాడకు అహంభావం పెరిగిపోయిందని, అందుకే ఆయనను ప్రజలు ఓడించనున్నారని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి సానుకూల పవనాలు వీచినట్లు పోలింగ్ సరళిని బట్టి స్పష్టమైందని చాడ వెంకట్ రెడ్డి అన్నారు.

ఇక సాగనంపుడే అన్నట్లుగా ఓట్లు వేశారు

- నిరంకుశ ప్రభుత్వాన్ని దించాలని ప్రజలు భావించారు: కోదండరాం



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ నిరంకుశ, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని ఇక సాగనంపుడే.. అన్నట్లుగా ప్రజలు ఓట్లేశారని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ ఉద్యమం తీరు ఎక్కడా చప్పపడలేదని, పరిమితులు దాటుతున్న ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ధోరణిలో ప్రజలు ఉన్నారనే విషయం ఈ ఎన్నికలతో స్పష్టమైందని తెలిపారు. శుక్రవారం టీజేఎస్ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ప్రజలు చూస్తున్నారన్నారు. కింది స్థాయి నేతల వరకు దోపిడీకి పాల్పడే పరిస్థితి ఈ ప్రభుత్వంలో వచ్చిందని, విమర్శించే ప్రజలపై ఒత్తిడి, దౌర్జన్యం చేయడం, ఆస్తులు లాక్కోవడం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై ప్రజలు తిరుగుబాటు బావుటా ఎగరేశారని, ఎవరైనా ప్రజాస్వామ్యానికి అనుగుణంగా పాలన చేయాలని హితవుపలికారు. మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై మాట్లాడుతూ ఆయనది దింపుడుకల్లెం ఆశ అని ఎద్దేవా చేశారు. ఒక పార్టీ నుంచి ఎన్నికైన నాయకులు మరో పార్టీలోకి ఫిరాయించాలని చూస్తే జనం సహించరని కోదండరాం అన్నారు.

ఆ పార్టీకి పనిచేస్తావా.. అంతుచూస్తాం!

ఆందోళనతో యువకుడి ఆత్మహత్య



రాజగౌడ్

భీమ్‌గల్(బాల్కొండ): 'ఎన్నికలలో ఫలానా పార్టీకి పని చేస్తున్నావు.. ఎన్నికలయ్యాక నీ అంతు చూస్తాం'అని కొందరు బెదిరించడంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బెజ్జోరాలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెజ్జోరా గ్రామానికి చెందిన తొనిగండ్ల రాజగౌడ్(45) గురువారం పోలింగ్ సమయంలో అధికార పార్టీ తరపున ప్రచారంలో పాల్గొన్నాడు. ఇది అదే గ్రామానికి చెందిన ఈర్ల లక్ష్మీప్రసన్న, నర్సు, మహేందర్‌కు నచ్చలేదు. ఎన్నికలయ్యాక అంతుచూస్తామని వారు బెదిరించడంతో ఆందోళన చెందాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజగౌడ్ రాత్రి వరకు తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు అతడి కోసం గాలించగా గ్రామశివారులోని ఓ చెట్టుకు వేలాడుతూ మృతదేహం కనిపించింది. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులు మృతదేహాన్ని నిందితుల ఇంటి వద్దకు తీసుకువెళ్లి న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు. ఎస్సై హరిబాబు వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై హరిబాబు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మ్యాజిక్ ఫిగర్.. ఎంతెంత దూరం?

- అధికారంలోకి వస్తున్నామా, లేదా అంటూ కాంగ్రెస్ శ్రేణుల్లో విస్తృత చర్చ
- జిల్లాలు, నియోజకవర్గాల వారీగా నేతల అంచనాల మీద అంచనాలు
- గ్రామాలు, మండలాల వారీగా పోలింగ్ లెక్కలతో పార్టీ అభ్యర్థులు బిజీ
- ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ.. 'కౌంటింగ్'కోసం ఏజెంట్ల ఎంపిక
- హైదరాబాద్ చేరుకున్న రేవంత్, భట్టి.. సన్నిహిత నేతలతో భేటీలు
- పోలింగ్ సరళిపై చర్చలు.. సునీల్ కనుగోలు నివేదికలో సానుకూల ఫలితాలు
- హంగ్ వస్తే గెలిచిన వారంతా కర్ణాటకకే.. నేడు హైదరాబాద్‌కు డీకే శివకుమార్?



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసి, ఎగ్జిట్ పోల్స్ కూడా విడుదలైన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో గెలుపోటములపై తీవ్ర చర్చ సాగుతోంది. ఈసారైనా అధికారంలోకి వస్తున్నామా, లేదా అన్నదానిపై అభ్యర్థులు, ముఖ్య నేతలు, పార్టీ కేడర్‌లో ఉత్కంఠ కనిపిస్తోంది. పోలింగ్ సరళి అనుకూలమనే లెక్కలు, 'చేతి'కి మొగ్గు ఉందన్న ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు నిజమవుతాయా, మ్యాజిక్ ఫిగర్ దాటి పవర్‌లోకి వస్తామా అన్న దానిపైనే శుక్రవారం పొద్దంతా కాంగ్రెస్ శ్రేణులు చర్చలతో గడిపాయి. కౌంటింగ్‌కు మరోరోజు ఉన్న నేపథ్యంలో.. ఎన్ని స్థానాల్లో గెలుస్తాం? ఎక్కడెక్కడ గట్టి పోటీ అవకాశముంది? ఎక్కడెక్కడ ఓడిపోవచ్చు? దక్షిణ తెలంగాణను నిజంగానే స్వీప్ చేస్తున్నామా? ఉత్తర తెలంగాణలో బలం పెరిగిందా? హైదరాబాద్, శివారు నియోజకవర్గాల పరిస్థితేంటి? అన్న అంశాలపై నేతలు లెక్కలు వేసుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడి నుంచి గ్రామస్థాయి కార్యకర్త వరకు ఇదే తీరు కావడం గమనార్హం.

ఉత్కంఠలో అభ్యర్థులు

ఎన్నికల్లో పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థులు తీవ్ర ఉత్కంఠలో ఉన్నారు. తాము గెలుస్తామా లేదా అన్నదానిపై లెక్కలు వేసుకుంటున్నారు. గ్రామ, మండల స్థాయి నేతలతో భేటీ అవుతూ.. ఏ గ్రామంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి? అందులో తమకు పడిన ఓట్లెన్ని? ఏ మండలంలో ఎంత మెజార్టీ వస్తుంది? ఎంత తక్కువ వస్తాయనే అంశాలతో క్షేత్రస్థాయిలో పోలింగ్ సరళిపై అంచనాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇదే సమయంలో ఆదివారం జరగనున్న కౌంటింగ్ కోసం ఏజెంట్లు, వారికి కావాల్సిన పత్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పోలింగ్ రోజున ఎంత జాగ్రత్తగా ఉన్నామో, కౌంటింగ్ కేంద్రాల్లోనూ అంతే జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడా తేడా రాకుండా కౌంటింగ్‌ను పరిశీలించాలని ఏజెంట్లకు సూచనలిస్తున్నారు.

ఎప్పటికప్పుడు ఏఐసీసీతో సంప్రదింపులు

తెలంగాణ ఫలితం సానుకూలంగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో.. టీపీసీసీ నాయకత్వం ఎప్పటికప్పుడు ఏఐసీసీ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులు తమ నియోజకవర్గాల నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఢిల్లీ పెద్దలతో టచ్‌లో ఉన్నారు. రాష్ట్రంలోని పరిస్థితిని వారికి వివరిస్తూ, ఏయే పరిణామాలు తలెత్తితే ఎలా ఎలా వ్యవహరించాలన్న దానిపై హైకమాండ్ నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. మరోవైపు వ్యూహకర్త సునీల్ కనుగోలు కూడా పోలింగ్ సరళిపై ఇచ్చిన నివేదికలో పార్టీకి అధికారం వస్తుందని పేర్కొన్నట్టు తెలిసింది. దీనికి అనుగుణంగా టీపీసీసీ నాయకత్వం ఏర్పాట్లు చేసుకుంటోంది. హైదరాబాద్‌లోని రేవంత్, భట్టి నివాసాలకు పలువురు పార్టీ నేతలు వెళ్లి చర్చలు జరిపారు. పోలింగ్ సరళి ఎలా జరిగింది? ఏ జిల్లాలో ఎలాంటి ఫలితాలు వస్తున్నాయన్న దానిపై చర్చించారు.

పూర్తి మెజార్టీ రాకుంటే ఏం చేద్దాం?

ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నా.. ఆదివారం వెలువడే ఫలితాల్లో పార్టీకి వచ్చే సీట్లను బట్టి పావులు ఏఐసీసీ, టీపీసీసీ ప్రణాళికలు రచిస్తున్నాయి. అధికారం చేపట్టేందుకు అవసరమైన దానికంటే ఎక్కువ స్థానాల్లో గెలిస్తే ఎలాంటి సమస్యా ఉండదని నేతలు పేర్కొంటున్నారు. కానీ ఎక్కువ సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచినా పూర్తి మెజార్టీ రాకుంటే.. గెలిచిన నాయకులందరినీ తక్షణమే కర్ణాటకకు తరలించి క్యాంపు పెట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి కాంగ్రెస్ ముందు జాగ్రత్త చర్యలు కూడా చేపట్టిందని.. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను హైదరాబాద్‌కు పంపాలని నిర్ణయించిందని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. డీకే శివకుమార్ శనివారం మధ్యాహ్నం కల్లా హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉందని అంటున్నాయి. ఇక కొన్నిసీట్లు తక్కువపడితే ఎంఐఎం మద్దతు తీసుకోవాలా, వద్దా? అన్న అంశంపైనా ఏఐసీసీతో టీపీసీసీ నేతల సంప్రదింపుల సందర్భంగా చర్చకు వచ్చినట్టు తెలిసింది.

18 నుంచి 22 సీట్లు గెలుస్తాం

- బీజేపీ నేతల ఆశాభావం
- ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 10 నుంచి 12 సీట్లు
- గ్రేటర్ హైదరాబాద్‌లో 4, రంగారెడ్డి, వరంగల్, మెదక్ జిల్లాల్లో ఒకట్రెండు సీట్ల గెలుపుపై ముఖ్యనేతల ధీమా
- పోలింగ్ శాతం పెరగడంపై సంతృప్తి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో 18 నుంచి 22 సీట్ల వరకు గెలుస్తామని బీజేపీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. పార్టీ బలంగా ఉన్న ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 10 నుంచి 12, అలాగే గ్రేటర్ పరిధిలో 4, రంగారెడ్డి, వరంగల్, మెదక్ జిల్లాల్లో ఒక్కొక్క సీటు గెలుపుపై బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తుండడం గమనార్హం. కొన్ని నియోజకవర్గాల్లోని వివిధ పోలింగ్ బూత్‌లలో గురువారం రాత్రి దాకా పోలింగ్ కొనసాగడంతో ఆయా ప్రాంతాల నుంచి పార్టీ కార్యాలయానికి సమాచారం ఆలస్యంగా చేరింది. క్షేత్రస్థాయి సమాచారం, పార్టీ నాయకుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం ముఖ్యనేతలు పార్టీ గెలిచే స్థానాలపై ఈ అంచనాకు వచ్చినట్టు చెపుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లతో బీజేపీ ముఖాముఖిగా పోటీపడుతున్న సీట్లతో పాటు, ఈ మూడుపార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్న నియోజకవర్గాల్లో కొన్నిచోట్ల అనూహ్య ఫలితాలు వస్తాయని గట్టిగా నమ్ముతున్నారు. కనీసం 25 నుంచి 30 సీట్లలో గట్టి పోటీనివ్వడంతో పాటు, పార్టీ బలంగా ఉన్న చోట్ల ఓటింగ్ శాతం పెరగడం ద్వారా 15 నుంచి 20 శాతం దాకా బీజేపీ ఓటింగ్ శాతం నమోదు చేస్తుందని విశ్వసిస్తున్నారు. కాగా, పార్టీ అభ్యర్థులు పోటీ చేసిన 111 నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరగడం, ఇతర సానుకూల అంశాలపై నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే గురు, శుక్రవారాల్లో వివిధ సర్వే సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల్లో బీజేపీకి అంతగా సానుకూలత కనిపించకపోవడం పట్ల పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అధికారికంగా వెలువడ్డాక వాస్తవ పరిస్థితిని బేరీజు వేయాల్సి ఉంటుందని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

ఉత్తర ద్వారం తెరిచిన 'బీజేపీ'

- నాంపల్లిలోని పార్టీ ఆఫీసు తూర్పు ద్వారం మూత
- ప్రధాన ద్వారం మార్పు కలిసొచ్చేనా?
- ఇరవై ఏళ్లుగా తూర్పు గడప నుంచే రాకపోకలు
- బండి అధ్యక్షుడైన తర్వాత ఉత్తరానికి
- ఇటీవల మళ్లీ తూర్పు.. తాజాగా ఉత్తరానికి మార్పు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ఫలితాల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గురువారం రాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగగా, అదే రోజు నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో తూర్పు వైపు ఉన్న ప్రధాన ద్వారాన్ని మూసేసి గతంలో ఉపయోగించిన ఉత్తరం వైపు తలుపును తెరిచారు. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తే పార్టీకి అనుకూలంగా మంచి ఫలితాలు రావొచ్చునని నాయకులు అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగానే వాస్తు మార్పు చేసి, ఉత్తరం వైపు ద్వారాన్ని ఉపయోగించాలని నిర్ణయించినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం పార్టీ కార్యాలయాన్ని నిర్మించాక తూర్పువైపు ప్రధాన ద్వారాన్నే చాలా కాలం ఉపయోగించారు. గతంలో బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక కొన్ని వాస్తుపరమైన మార్పులు చేశారు. ఇందులో భాగంగా తూర్పువైపు ద్వారం మూసేసి, ఉత్తరం వైపు తలుపులు తెరిచి రాకపోకలకు ఉపయోగించారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల పోలింగ్, ఫలితాలు వెలువడే సందర్భంగా వాస్తుపరంగా ఉత్తర ద్వారాన్ని ఉపయోగిస్తుండడం గమనార్హం. పార్టీ పోటీచేస్తున్న నియోజకవర్గాల్లో గురువారం పోలింగ్ సరళిని బట్టి చూస్తే సానుకూల పరిణామాలే కనిపించాయని, గతం కంటే ఎక్కువ ఓటింగ్‌శాతమే నమోదు అవుతుందనే ధీమా పార్టీ వర్గాల్లో వ్యక్తమౌతోంది. మరి నిజంగానే ప్రధాన ద్వారం మార్పు అనేది పార్టీ అధిక సీట్లను గెలిపిస్తుందా అనేది తేలాలంటే ఫలితాలు వెలువడే దాకా వేచి చూడాల్సిందే మరి.

బిల్లుల చెల్లింపులో కుట్రలకు సిద్ధమవుతున్నారు

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- కాంట్రాక్టర్లకు చెల్లింపుల్లో అధికారులు జాగ్రత్తగా ఉండాలి
- పెద్ద ఎత్తున భూముల రిజిస్ట్రేషన్లకూ రెడీ అవుతున్నారు
- అధికారం చేతులు మారుతున్న దశలో ఈసీ వీటిపై దృష్టి సారించాలి
- అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ తప్పులపై సమీక్ష జరుపుతాం



సాక్షి, హైదరాబాద్: కమీషన్లు తీసుకుని వేల కోట్ల రూపాయల బిల్లులను చెల్లించేందుకే తాము మళ్లీ అధికారంలోకి వస్తామంటూ బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెపుతున్నారని, అధికారంలోకి రావడం లేదని తెలిసినా అధికారులపై ఒత్తిడి చేసి అక్రమాలకు పాల్పడేందుకు సిద్ధమవుతున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. 'ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసినా రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లో వేయకుండా కావాలని కుట్ర చేశారు. ఇప్పుడు ఆ డబ్బులను తమకు ఎన్నికల్లో నిధులు సమకూర్చిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. ఈ కుట్రలపై అధికారులు జాగ్రత్తగా ఉండాలి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుల ఒత్తిడులకు తలొగ్గి పని చేయొద్దు. ఈ విషయంలో ఎన్నికల సంఘం కూడా జోక్యం చేసుకోవాలి. అలాంటి అక్రమాలు చేయకుండా సంబంధిత అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులివ్వాలి'అని ఆయన కోరారు. శుక్రవారం సాయంత్రం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌తో కలసి ఆయన గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులపై సమీక్ష జరుపుతామని, అందుకు బాధ్యులైన అధికారులు, ఇతరులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న వేలాది ఎకరాల అసైన్డ్ భూములను ధరణిలో తప్పుగా నమోదు చేయించి, ప్రభుత్వ పెద్దలకు చెందిన బినామీల పేరిట రిజిస్ట్రేషన్లు చేసేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేస్తోందని ఆరోపించారు. లక్షల కోట్ల విలువైన భూములను బీఆర్ఎస్ నేతలు అక్రమంగా కాజేయకుండా కాపాడాలని రెవెన్యూ శాఖను తాము అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. అధికారం చేతులు మారుతున్న దశలో ఇలాంటి ప్రక్రియలు ముందుకు సాగకుండా ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు. ఆర్థిక శాఖ అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించవద్దని, రెవెన్యూ శాఖ తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయవద్దని కోరారు. కాగా, ఓట్ల కౌంటింగ్ జరిగే సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని, గత ఎన్నికల్లో తుంగతుర్తి, ఇబ్రహీంపట్నం, మంచిర్యాల, ధర్మపురిలో జరిగిన విధంగా బీఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడే అవకాశం ఉందని, బీఆర్ఎస్ శ్రేణులను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ కేడర్ సిద్ధంగా ఉండాలని కోరారు.

కల్వకుంట్ల కుటుంబాన్ని వదిలేది లేదు: మధుయాష్కీ

కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసిన ప్రజలందరికీ మధుయాష్కీ కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ ఈ సారి ప్రగతిభవన్ వీడి వెళ్లిపోవాల్సి వస్తుందని, అందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కల్వకుంట్ల కుటుంబాన్ని వదిలిపెట్టేది లేదని, వారి అవినీతికి సహకరించిన అధికారులు కూడా జైలుకు వెళ్లక తప్పదని మధుయాష్కీ హెచ్చరించారు.

ఆ మీటింగ్ మినిట్స్ సమర్పించండి

- టూరిజం కార్పొరేషన్ మాజీ ఎండీ మనోహర్‌రావుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తనను చట్టవిరుద్ధంగా సస్పెండ్ చేశారంటూ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఎండీ మనోహర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో ఆయన పాల్గొన్న మీటింగ్ మినిట్స్ సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా ఉన్న బోయినపల్లి మనోహర్‌రావును సస్పెండ్ చేస్తూ గత నెల 17న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి ఎండీతో పాటు ఓఎస్డీ తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లడంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదును పరిశీలించిన ఎన్నికల సంఘం వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. అయితే ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మనోహర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రీరఘురామ్ వాదనలు వినిపిస్తూ.. ఈసీ నిర్ణయం చట్టవిరుద్ధమన్నారు. ఎండీపై చర్యలు తీసుకునేందుకు కమిషన్‌కు అర్హత లేదన్నారు. టీటీడీ అధికారిక సమావేశంలో భాగంగా ఎండీ తిరుమలకు వెళ్లారని, ఇది తెలంగాణ రాష్ట్రం పరిధిలో లేదని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఆ సమావేశం వివరాలు అందజేయాలని మనోహర్‌రావును ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది. కాగా, మనోహర్‌రావును సస్పెండ్ చేస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయంపై స్టే ఇవ్వాల్సిందిగా ఆయన తరఫు న్యాయవాది కోరగా, ఈ వినతిని కోర్టు తిరస్కరించింది.

రేవంత్‌రెడ్డిని సీఎం చెయ్యొద్దు

- రేవంత్ బీఆర్ఎస్ కోవర్టు
- ఏఐసీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత బక్క జడ్సన్



సమావేశంలో మాట్లాడుతున్న బక్క జడ్సన్

పంజగుట్ట (హైదరాబాద్): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయవద్దని, ఆయన బీఆర్ఎస్ పార్టీ కోవర్టు అని ఏఐసీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత బక్క జడ్సన్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, కల్వకుంట్ల కవిత స్నేహితురాలు ఎస్ఆర్ఐ మందుల వినుత ఇద్దరూ వ్యాపారంలో భాగస్వామ్యులని ఏఐసీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత బక్క జడ్సన్ వెల్లడించారు. తెలంగాణను ఒక దొంగ చేతినుంచి మరో దొంగకు తాళాలు అప్పగించవద్దని కాంగ్రెస్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓడిపోవాలని రేవంత్‌రెడ్డి ఎన్నో ప్రయత్నాలు చేశారని, 53 మంది ఓడిపోయే అభ్యర్థులకు టికెట్లు ఇచ్చారని విమర్శించారు. తన వ్యాఖ్యలవల్ల పార్టీకి నష్టం కలగకూడదనే ఇన్నిరోజులు ఆధారాలు బయటపెట్టలేదని అందుకే ఎన్నికలయ్యాక సమావేశం పెట్టినట్లు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన పేర్కొన్నారు. 2012లో అప్పటి తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, కేసీఆర్ కూతురు కవిత మిత్రురాలైన ఎస్ఆర్ఐ మందుల వినుత డైరెక్టర్లుగా ఆడికోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కంపెనీని నెలకొల్పారని 2009 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమం సమయంలోనే కేసీఆర్ ఆస్తులు విపరీతంగా పెరిగాయని చెప్పారు. స్వయంగా ఓటుకు కోట్లు కేసులో తనంతటతానే పట్టుబడేలా కవిత, కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి కుట్రపన్నినట్లు ఆరోపించారు. అనంతరం చంద్రబాబును బెదిరించి భారీగా డబ్బులు గుంజి ఆ సొమ్ముతోనే రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేశారని తెలిపారు.

వలస కార్మికులకు బంపర్ ఆఫర్

- యూఏఈలో ఉపాధి కోసం ఉచిత వీసాలు..
- 9న ముంబైలో ఇంటర్వ్యూల నిర్వహణ



ఏడీఎన్‌హెచ్ కంపాస్ కంపెనీ ఉచిత రిక్రూట్‌మెంట్ కోసం విడుదల చేసిన బ్రోచర్

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్రంలోని వలస కార్మికులకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో ఉపాధి కల్పించడానికి ఏడీఎన్‌హెచ్ కంపాస్ కంపెనీ ఉచిత రిక్రూటింగ్ ప్రక్రియ చేపట్టింది. తెలంగాణ జిల్లాలకు చెందిన 12 వేలమంది వలస కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న కంపెనీ మరి కొంతమంది కార్మికులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. క్యాటరింగ్ రంగంలో వలస కార్మికులకు ఆరు రకాలైన పనులు కల్పించనున్నారు. ఉచితంగా వీసా, విమాన టికెట్ సౌకర్యాన్ని కంపెనీ కల్పిస్తుంది. క్యాటరింగ్ సూపర్‌వైజర్(హాస్పిటాలిటీ క్యాటరింగ్ అనుభవం ఉన్నవారికి), టీం లీడర్(హాస్టల్ నిర్వహణ అనుభవం), హెవీ వెహికల్ డ్రైవర్(యూఏఈ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి), కిచెన్ స్టీవార్డ్స్, క్లీనర్స్, వెయిటర్‌లకు ఉపాధి కల్పించడానికి వీసాలను జారీ చేయనున్నారు. ఈ నెల 9న ముంబైలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. ఈ నెల 5, 6 తేదీల్లో ఆర్మూర్, జగిత్యాల్‌లోని జీటీఎం ఇంటర్నేషనల్ రిక్రూటింగ్ ఏజెన్సీవారిని కలిసి వివరాలను అందించాలని సంస్థ యజమాని చీటి సతీశ్‌రావు 'సాక్షి'కి వివరించారు. 22 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలవారు ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులకు పచ్చబొట్టు ఉండకూడదని చెప్పారు. వేతనంతోపాటు ఉచితవసతి, భోజన సదుపాయం కల్పించి ఉపాధి ఇవ్వనున్నారని వెల్లడించారు. ముంబైలో ఇంటర్వ్యూకు వెళ్లేవారి కోసం తక్కువ ఖర్చుతో బస్సు సౌకర్యం కల్పించామన్నారు.

మస్కట్‌లో యాదాద్రీశుడి కల్యాణం



యాదగిరిగుట్ట: ఒమన్ దేశం రాజధాని మస్కట్‌లో ఒమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో శుక్ర వారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు, ముఖ్య అర్చకుడు నర్సింహమూర్తి ఇందులో పాల్గొన్నారు.

కేఆర్ఎంబీకి సాగర్ నిర్వహణ బాధ్యత

- సీఆర్‌పీఎఫ్ పర్యవేక్షణలో ప్రాజెక్టు
- కేంద్ర హోంశాఖ ప్రతిపాదనలకు తెలంగాణ, ఏపీ అంగీకారం
- శ్రీశైలం, సాగర్ ఆపరేషన్ ప్రొటోకాల్స్‌పై నేడు కేంద్ర జలశక్తి శాఖ భేటీ

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించాలని.. కేంద్ర హోం శాఖ చేసిన ప్రతిపాదనలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అంగీకరించాయి. ప్రాజెక్టు పర్యవేక్షణను సీఆర్‌పీఎఫ్ బలగాలకు అప్పగించేందుకు కూడా ఆమోదం తెలిపాయి. నవంబర్ 29న అర్ధరాత్రి ఆంధ్రప్రదేశ్ సాయుధ దళాలు సాగర్ ప్రాజెక్టు వద్ద మోహరించడంతో పాటు కుడికాల్వకు నీటిని విడుదల చేయడంతో వివాదం తలెత్తిన నేపథ్యంలో కేంద్రం జోక్యం చేసుకుంది. హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా శుక్రవారం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర జల వనరుల శాఖ కార్యదర్శి, కేంద్ర జల సంఘం, కృష్ణా బోర్డు అధికారులు కూడా పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు ఆటంకం: తెలంగాణ సీఎస్

తెలంగాణ సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. నవంబర్ 29న రాత్రి ఏపీకి చెందిన దాదాపు 500 మంది సాయుధ పోలీసులు నాగార్జునసాగర్ ప్రాజెక్టుపైకి వచ్చి సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు 5, 7 గేట్ల వద్ద ఉన్న హెడ్ రెగ్యులేటర్లను తెరిచి దాదాపు ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని చెప్పారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఏపీ ప్రభుత్వ చర్య రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించిందని పేర్కొన్నారు. ఏపీ ఈ విధమైన అతిక్రమణలకు పాల్పడడం ఇది రెండోసారి అని అన్నారు. ఏపీ ప్రభుత్వ చర్య వల్ల హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 2 కోట్ల ప్రజల తాగునీటి అవసరాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నవంబర్ 28 వరకున్న యథాతథ స్థితిని కొనసాగించాలని సీఎస్ కోరారు. కాగా ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి నవంబర్ 30వ తేదీన ఉన్న యథాస్థితిని కొనసాగించాలని కోరారు.

యథాతథ స్థితి కొనసాగించాలి: భల్లా

సాగర్ డ్యామ్‌పై గతంలో ఉన్న మాదిరిగా స్టేటస్ కో కొనసాగించాలని, ఈ డ్యామ్ తాత్కాలికంగా సీఆర్‌పీఎఫ్ పర్యవేక్షణలో ఉంటుందని అజయ్ భల్లా చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ వివాదంపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సంప్రదింపులు జరపాలని సూచించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణను కృష్ణా బోర్డుకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సాగర్ జలాల వినియోగంపై ఏపీ, తెలంగాణల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలను చల్లార్చడంతో పాటు శ్రీశైలం, సాగర్ జలాశయాల నిర్వహణకు సంబంధించిన ఆపరేషన్ ప్రొటోకాల్స్ రూపకల్పనపై శనివారం ఉదయం 11 గంటలకు కేంద్ర జల వనరుల శాఖ కార్యదర్శి ఢిల్లీ నుంచి రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్, నీటి పారుదల శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్, ఈఎన్‌సీ సి.మురళీధర్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే పాల్గొన్నారు.

ఏపీకి కృష్ణా బోర్డు సభ్యుడి లేఖ

నవంబర్ 30 నుంచి నీటి విడుదల కోరుతూ ఏపీ ప్రభుత్వం ఎలాంటి ఇండెంట్ సమర్పించలేదని కృష్ణా బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. కుడి కాల్వకు నీటి విడుదల నిలిపి వేయాలని ఏపీ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. మరోవైపు సాగర్ ప్రాజెక్టులోని కొంత భాగాన్ని ఏపీ ప్రభుత్వం కబ్జా చేసిందని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్రం చేసిన ఫిర్యాదుపై తీసుకోవాల్సిన తదుపరి చర్యలను సూచించాలని కోరుతూ కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయిపురే.. కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాశారు.



సాగర్ వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలు

ఏపీ ఇరిగేషన్, పోలీస్ అధికారులపై కేసు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ డ్యాంపై శుక్రవారం కూడా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. డ్యాం పరిసరాలలో ఏపీ, తెలంగాణ పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు ఏపీ పోలీస్, ఇరిగేషన్ అధికారులపై విజయపురి నార్త్ పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ పోలీసులు ఫిర్యాదు చేశారు. దీంతో సెక్షన్లు 441, 448, 427 కింద కేసు నమోదు అయ్యింది.

సాగర్‌కు చేరుకున్న సీఆర్‌పీఎఫ్ దళాలు

కేంద్ర హోం శాఖ ఆదేశాలతో సీఆర్‌పీఎఫ్ బలగాలు నాగార్జునసాగర్‌కు చేరుకున్నాయి. డ్యాంకు ఆవలి వైపున రైట్ బ్యాంకుకు 90 మంది సిబ్బంది చేరుకున్నారు. వారికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో బస కల్పించారు. ఆదివారం ఉదయం వరకు ఇటు వైపునకు కూడా సీఆర్‌పీఎఫ్ దళాలు చేరుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటిక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వ టూరిజం డైరెక్టర్ నాసిక్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మధుమతి సర్దేశాయ్ మాట్లాడుతూ ట్రావెల్ ఎగ్జిబిషన్‌లో సాంప్రదాయ ప్రదర్శనలు, నెట్‌వర్క్, లావాదేవీలు, వ్యాపారాన్ని వృద్ధి చేసుకునే విధంగా పూర్తి సమాచారం స్టాల్స్ వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో మహారాష్ట్రకు చెందిన 16 ప్రతిష్టాత్మక పర్యాటక సంస్థలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ట్రావెల్ పరిశ్రమ నిపుణులు, ట్రావెల్ ఏజెంట్లు, హోటలియర్లు, సరఫరాదారులు, పంపిణీదారులు భాగస్వాములతో విభిన్న సందర్శకులను ఆకర్షిస్తుందన్నారు. మహారాష్ట్రలో అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు ఉంటాయన్నారు. మహారాష్ట్ర టూరిజం పర్యాటక ప్రచారాలు, కార్యక్రమాలు, పర్యాటకాన్ని పెంచడానికి ప్రచారాన్ని అమలు చేయడంపై దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ పర్యాటక మంత్రిత్వశాఖ కార్యాలయం సహాయ సంచాలకులు కృపాకర్ రాయపాటి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మార్కుల డివిజన్ ప్రకటించం

10, 12 తరగతుల ఫలితాలపై సీబీఎస్‌ఈ

సాక్షి, న్యూఢిల్లీ: 10, 12 తరగతుల మార్కుల ఫలితాల్లో ఇకపై డివిజన్, డిస్టింక్షన్‌ను ప్రకటించబోమని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) పేర్కొంది. మెరిట్ లిస్టును ప్రకటించే విధానానికి గతంలోనే స్వస్తి చెప్పిన బోర్డు తాజాగా డివిజన్, డిస్టింక్షన్‌పై నిర్ణయాన్ని వెలువరించింది. ఈమేరకు సీబీఎస్‌ఈ ఎగ్జామినేషన్ కంట్రోలర్ భరద్వాజ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కుల శాతాన్ని లెక్కించడం, ప్రకటించడం వంటివి బోర్డు ఇకపై చేయదని స్పష్టం చేశారు. ఉన్నత చదువులకు మార్కుల శాతం అవసరమనిపిస్తే సదరు సంస్థ వాటిని గణించుకోవచ్చని వివరించింది. ఒకవేళ విద్యార్థి అయిదుకు మించి సబ్జెక్టులను ఎంచుకున్నట్లయితే..వాటిలో అయిదు ఉత్తమ సబ్జెక్టులను గుర్తించడంపై సంబంధిత ఉన్నత విద్యా సంస్థ లేదా యజమాని నిర్ణయం తీసుకోవచ్చని భరద్వాజ్ తెలిపారు. 10, 12వ తరగతి సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షలు 2024 ఫిబ్రవరి 15వ తేదీ నుంచి మొదలవుతాయని తెలిపారు.

కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం

కోటా: రాజస్తాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల సంఖ్య 29కి చేరింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిషా యాదవ్(21)స్థానిక మహావీర్‌నగర్ ఏరియాలోని హాస్టల్‌లో ఉంటూ నీట్ కోసం ప్రిపేరవుతోంది. బుధవారం రాత్రి ఆమె తండ్రి ఫోన్ చేశారు. ఎంత సేపటికీ ఆమె స్పందించకపోవడంతో హాస్టల్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు తలుపులు పగులగొట్టి చూడగా నిషా యాదవ్ ఫ్యానుకు ఉరి వేసుకుని, విగతజీవిగా కనిపించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ మరింత ప్రియం

సాక్షి, న్యూఢిల్లీ: అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే చమురు కంపెనీలు గ్యాస్ వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను శుక్రవారం రూ.21కి పెంచాయి. పెంచిన ధరలు డిసెంబర్ 1నుంచే అమలులోకి వస్తాయని పేర్కొన్నాయి. తాజాగా పెరిగిన ధరల ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1,796.50, కోల్‌కతాలో రూ.1,908, ముంబైలో రూ.1,749, బెంగళూరులో రూ.1,883, చెన్నైలో రూ.1,968.50 గా ఉంది. కాగా, హైదరాబాద్ లో రూ.2,022, విజయవాడలో రూ.1,956.50కి చేరింది.

కశ్మీర్‌లో ఉగ్రవాది హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో గురువారం జరిగిన ఎదురు కాల్పుల ఘటనలో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా సిబ్బంది గురువారం అరిహల్ గ్రామాన్ని చుట్టుముట్టాయి. గాలింపు జరుపుతున్న బలగాలపైకి నక్కి ఉన్న ఉగ్రవాది యథేచ్ఛగా కాల్పులకు దిగాడు. ఎదురుకాల్పుల్లో కిషాయత్ అయూబ్ అలీ అనే ఉగ్రవాది హతమయ్యాడు. ఇతడు లష్కరే తోయిబా తరఫున పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

నేవీ షిప్‌పై మొదటిసారిగా మహిళా అధికారికి బాధ్యతలు

నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ వెల్లడి

న్యూఢిల్లీ: నావికా దళం యుద్ధ నౌకపై మొదటిసారిగా మహిళా కమాండింగ్ అధికారిని నియమించినట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ వెల్లడించారు. మహిళా అధికారులకు 'అన్ని ర్యాంకులు- అన్ని బాధ్యతలు' అనే సిద్ధాంతానికి నేవీ కట్టుబడి ఉంటుందన్నారు. హిందూ మహా సముద్రంలో చైనా ఉనికి పెరిగిన నేపథ్యంలో భారత నావికా దళం యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, విమానాలు గత ఏడాదిగా వ్యూహాత్మకంగా చురుగ్గా వ్యవహరిస్తున్నాయని చెప్పారు.

అలాంటి బిల్లులను రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించలేరు

తమిళనాడు గవర్నర్‌కు సుప్రీం సూచన

న్యూఢిల్లీ: రాష్ట్రాల శాసనసభలో తొలుత తీర్మానించి, తర్వాత పునఃపరిశీలించి తీర్మానించిన బిల్లులపై ఆమోద ముద్ర వేయకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం ఆ రాష్ట్ర గవర్నర్ పంపించడం కుదరని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. పెండింగ్‌లో ఉన్న 10కిపై బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌తో నెలకొన్న ప్రతిష్టంభనకు ఇకనైనా తెరదించాలని తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవికి అత్యున్నత న్యాయస్థానం సూచించింది. ముఖ్యమంత్రితో సమావేశమై చర్చించుకోవాలని, బిల్లులను ఆమోదించే విషయంలో విభేదాలకు ముగింపు పలకాలని సూచించింది. చర్చలకు ముఖ్యమంత్రిని గవర్నర్ ఆహ్వానిస్తారని తాము ఆశిస్తున్నట్లు పేర్కొంది. కలిసి కూర్చొని మాట్లాడుకుంటే సమస్యలు సమసిపోతాయని స్పష్టం చేసింది. గవర్నర్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. అసెంబ్లీలో తీర్మానించిన కీలక బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా గవర్నర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బిల్లులను సకాలంలో ఆమోదించేలా గవర్నర్‌ను ఆదేశించాలని కోరింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు.

భూమిని వేడెక్కిస్తున్న పాపం...

పెద్ద దేశాలదే!

2022లో ప్రపంచ కర్బన ఉద్గారాలు 5 వేల కోట్ల టన్నులు!

అందులో 30 శాతం వాటా చైనాదే, రెండో స్థానంలో అమెరికా

- తలసరి కర్బన ఉద్గారాల్లో అమెరికాది అగ్రస్థానం
- వాటికి అడ్డుకట్ట వేస్తేనే గ్లోబల్ వార్మింగ్‌కు చెక్
- మందుపాతరపై భూగోళం: ఐరాస ఆందోళన



గ్లోబల్ వార్మింగ్. కొన్ని దశాబ్దాలుగా ప్రపంచాన్ని వణికిస్తున్న సమస్య. దీని దెబ్బకు భూగోళపు సగటు ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. అవి ఇంకో అర డిగ్రీ మేరకు పెరిగినా సర్వ వినాశనం జరిగే పరిస్థితి! ప్రాణికోటి మనుగడకే పెను ముప్పు! ఈ ప్రమాదం ఎంతో దూరం కూడా లేదని ఐక్యరాజ్యసమితి ఇప్పటికే ఎన్నోసార్లు హెచ్చరించింది. అయినా పరిస్థితిలో పెద్దగా మెరుగుదల లేదు. ముఖ్యంగా గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణమైన గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు ఏటికేడు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. అంతర్జాతీయ పర్యావరణ సదస్సుల్లో దీనిపై ఎంతగా ఆందోళన వ్యక్తమవుతున్నా అది మాటలకే పరిమితమవుతోంది. ఉద్గారాలకు ముకుతాడు వేస్తామన్న సంపన్న దేశాల వాగ్దానాలు నీటిమూటలే అవుతున్నాయి. తరచి చూస్తే, గ్రీన్‌హౌస్‌వాయు ఉద్గారాల్లో సింహ భాగం పెద్ద దేశాలదే.

మాటలే తప్ప చేతల్లేవు

2022లో ప్రపంచ దేశాలన్నీ కలిపి విడుదల చేసిన గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణమెంతో తెలుసా? ఏకంగా 5,000 కోట్ల మెట్రిక్ టన్నులు! పర్యావరణ కాలుష్య కారకాల్లో అతి ముఖ్యమైనవి గ్రీన్‌హౌస్ ఉద్గారాలే. భూగోళాన్ని వేడెక్కించడంలో కూడా వీటిదే ప్రధాన పాత్ర. ఇంతటి ప్రమాదకరమైన సమస్య విషయంలో మన నిర్లిప్త వైఖరికి ఏత ఏడాది గ్రీన్‌హౌజ్ వాయు ఉద్గారాల పరిమాణం మరో తాజా ఉదాహరణ మాత్రమే. ఈ పాపంలో సంపన్న దేశాల పాత్రే ఎక్కువ. చైనా విషయమే తీసుకుంటే, గతేడాది ప్రపంచ గ్రీన్‌హౌస్ ఉద్గారాల్లో ఆ ఒక్క దేశం వాటాయే ఏకంగా 30 శాతం! 2022లో అది 1,440 కోట్ల టన్నుల మేరకు కార్బన్ డయాక్సైడ్ (సీఓటూ) ఉద్గారాలను వాతావరణంలోకి విడుదల చేసిన చెత్త రికార్డును మూటగట్టుకుంది. కొన్ని దశాబ్దాలుగా చైనా పారిశ్రామిక వ్యవస్థ ప్రధానంగా బొగ్గుపై ఆధారపడటమే ఇందుకు ప్రధాన కారణం. ఇక 639 కోట్ల టన్నులతో అమెరికా రెండో స్థానంలో ఉంది. 343 కోట్ల టన్నులతో యూరోపియన్ యూనియన్(ఈయూ) నాలుగో స్థానంలో ఉంది. గణాంకాలపరంగా 352 కోట్ల టన్నులతో ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉన్నట్టు కనిపించినా జనాభాను బట్టి చూస్తే కర్బన ఉద్గారాల పాపంలో మన వాటా నిజానికి చాలా తక్కువ. మన తలసరి వార్షిక కర్బన ఉద్గారాలు కేవలం 2.5 టన్నులు! ప్రపంచ వేదికలపై పెద్ద మాటలు చెప్పే అమెరికాదే ఈ పాపంలో అగ్రస్థానం! ఒక్కో అమెరికన్ ఏటా సగటున 19 టన్నుల సీఓటూ ఉద్గారాలకు కారకుడవుతున్నాడు. కేవలం 2.5 కోట్ల జనాభా ఉన్న ఆస్ట్రేలియాలో తలసరి కర్బన ఉద్గారాలు 20 టన్నులు, 3.8 కోట్ల జనాభా ఉన్న కెనడాలో 18 టన్నులు, 14 కోట్ల జనాభా ఉన్న రష్యాలో 14 టన్నులు! 20.7 టన్నుల తలసరి ఉద్గారాలతో సౌదీ అరేబియా ఈ జాబితాలో అగ్ర స్థానంలో ఉండటం విశేషం. మొత్తమ్మీద ప్రపంచ కర్బన ఉద్గారాల్లో చైనా, అమెరికా, ఈయూ వాటాయే దాదాపు సగం! వీటిలోనూ చారిత్రకంగా చూసుకుంటే అమెరికా, ఈయూ రెండే ప్రపంచ కాలుష్యానికి ప్రధాన కారకులుగా ఉంటూ వస్తున్నాయి.

వేడెక్కుతున్న భూమి

భూగోళపు ఉష్ణోగ్రత పారిశ్రామికీకరణకు ముందు నాటితో గత 150 ఏళ్లలో 1.5 డిగ్రీలకు మించి పెరిగిపోయింది! ఇటీవల ఒకానొక దశలో అది 2 డిగ్రీలకు మించి కలవరపరిచింది కూడా. దాన్ని 1.5 డిగ్రీలకు మించకుండా కట్టడి చేయాలన్న పారిస్ ఒప్పందానికి ప్రపంచ దేశాలన్నీ పేరుకు అంగీకరించాయే తప్ప ఆచరణలో చేస్తున్నది పెద్దగా కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రపంచం ఇప్పుడు ఏ క్షణమైనా పేలనున్న మందుపాతర మీద ఉందని ఐక్యరాజ్యసమితి తాజాగా ఆందోళన వెలిబుచ్చింది. కర్బన ఉద్గారాల ప్రవాహం ఇలాగే కొనసాగి గ్లోబల్ వార్మింగ్ పెరుగుతూ పోతే ప్రపంచ దేశాలన్నీ ఎలాగోలా ప్రస్తుత పర్యావరణ లక్ష్యాలను చేరుకున్నా భూమి 2 డిగ్రీలను మించి వేడెక్కడం ఖాయమని హెచ్చరించింది. అప్పుడు కనీవినీ ఎరగని ఉత్పాతాలను, ఘోరాలను నిత్యం కళ్లజూడాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఇంతటి విపత్కర పరిస్థితుల నేపథ్యంలో దుబాయ్‌లో అంతర్జాతీయ పర్యావరణ సదస్సు కాప్-28 జరుగుతోంది. అందులోనైనా కర్బన ఉద్గారాలకు కళ్లెం వేసి భూగోళాన్ని కాపాడుకునే దిశగా ఏమైనా నిర్ణయాత్మకమైన అడుగులు పడతాయేమో చూడాలి.

2030 నాటికి భూగోళపు ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలన్న లక్ష్యం నెరవేరాలంటే కర్బన ఉద్గారాల్లో టాప్-20లో ఉన్న దేశాలు వాటిని ఏ మేరకు కట్టడి చేయాలంటే...

ఈయూ	90 శాతం
అమెరికా	71 శాతం
జపాన్	69 శాతం
దక్షిణ కొరియా	65 శాతం
కెనడా	57 శాతం
రష్యా	52 శాతం
ఇరాన్	51 శాతం
ఆస్ట్రేలియా	50 శాతం
సౌదీ అరేబియా	49 శాతం
మెక్సికో	47 శాతం
చైనా	42 శాతం
దక్షిణాఫ్రికా	34 శాతం
తుర్కియే	32 శాతం
ఇండోనేసియా	26 శాతం
బ్రెజిల్	25 శాతం
వియత్నాం	20 శాతం
భారత్	2 శాతం

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ కర్బన ఉద్గారాలు?

బొగ్గు, చమురు, గ్యాస్‌ను మండించినప్పుడు అవి వాతావరణంలోకి భారీ పరిమాణంలో కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయి. అది కొన్ని వందల ఏళ్లపాటు వాతావరణంలోనే ఉండిపోయి భూమిని వేడెక్కిస్తూ ఉంటుంది. ''ఆ లెక్కన భూమికి ముప్పు కేవలం 2022 తాలూకు కర్బన ఉద్గారాలు మాత్రమే కాదు. పారిశ్రామికీకరణ ఊపందుకున్నాక గత 150 ఏళ్లలో విడుదలైన కర్బన ఉద్గారాలన్నీ ఇప్పటికీ భూమిని వేడెక్కిస్తూనే ఉన్నాయి. ఆ లెక్కన ఈ 150 ఏళ్లలో అత్యధిక కర్బన ఉద్గారాలకు కారణమైన అమెరికాదే గ్లోబల్ వార్మింగ్‌లో ప్రధాన పాత్ర అని చెప్పాల్సి ఉంటుంది'' అని బ్రిటన్‌లోని ఎక్స్‌టర్ యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రవేత్త పియరీ ఫ్రెడ్లింగ్‌స్టెయిన్ కుండబద్దలు కొట్టారు!

గాజాలో మళ్లీ దాడుల మోత

- వారం విరామానికి తెర
- విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- 100 మందికి పైగా మృతి

డెయిర్ అల్ బలాహ్ (గాజా స్ట్రిప్): వారం రోజుల విరమణకు తెర పడింది. గాజా స్ట్రిప్ మళ్లీ కాల్పులతో దద్దరిల్లుతోంది. విరామం అనంతరం ఇజ్రాయెల్ శుక్రవారం రెట్టించిన తీవ్రతతో మళ్లీ దాడులకు దిగింది. గాజాలోని పలు ప్రాంతాలపై క్షిపణులు, రాకెట్లు, బాంబులతో విరుచుకుపడింది. దాంతో ఖాన్ యూనిస్‌లో ఒక భారీ భవన సముదాయం నేలమట్టమైనట్టు తెలుస్తోంది. హమాద్‌లో కూడా ఒక అపార్ట్‌మెంట్‌పై క్షిపణుల వర్షం కురిసింది. దాడుల్లో కనీసం 109 మంది మరణించినట్టు హమాస్ ప్రకటించింది.

దక్షిణ గాజాపై కూడా దాడులను ఉధృతం చేసేలా కన్పిస్తోంది. ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలంటూ రోజంతా అక్కడ కరపత్రాలు జారవిడవడం దీన్ని బలపరుస్తోంది. అక్కడి ఖాన్ యూనిస్ తదితర ప్రాంతాలు ప్రమాదకరమైన యుద్ధ క్షేత్రాలుగా మారాయని వాటిలో హెచ్చరించింది. ''యుద్ధ లక్ష్యాల సాధనకు పూర్తిగా కట్టుబడి ఉన్నాం. బందీలందరినీ విడిపించుకోవడం, హమాస్‌ను నిర్మూలించడం, గాజా మరెప్పుడూ ఇజ్రాయెలీలకు ముప్పుగా మారకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేదాకా సైనిక చర్య కొనసాగుతుంది'' అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది. మహిళా బందీలందరినీ వదిలేస్తామన్న ఒప్పంద వాగ్దానాన్ని హమాస్ ఉల్లంఘించడం వల్లే దాడులను తిరిగి మొదలుపెట్టాల్సి వచ్చిందని నెతన్యాహూ అన్నారు. ఇజ్రాయెలే రక్త దాహంతో తమ ప్రతిపాదనలన్నింటినీ బుట్టదాఖలు చేసి దాడులకు దిగిందని హమాస్ ఆరోపించింది.

8 మంది విడుదల...

గురువారం 8 మంది ఇజ్రాయెలీలను హమాస్ విడిచిపెట్టింది. బదులుగా శుక్రవారం ఉదయం 30 మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ వదిలేసింది. ఆ వెంటనే కాల్పుల విరమణకు స్వస్తి పలికి దాడులకు దిగింది.

మానవాళి స్వార్థంతో ప్రపంచానికి పెను చీకట్లే

- దుబాయ్ 'కాప్-28'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- పొరపాట్లను సరిచేసుకోవడానికి ఎక్కువ సమయం లేదు
- ప్రజల భాగస్వామ్యంతో కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలి
- 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్'లో అందరూ పాలుపంచుకోవాలి
- 2028లో 'కాప్-33'ని భారత్‌లో నిర్వహిస్తామని మోదీ ప్రతిపాదన



దుబాయ్: గత శతాబ్ద కాలంలో జరిగిన పొరపాట్లను సరిచేసుకోవడానికి ప్రపంచానికి ఎక్కువ సమయం లేదని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేవలం మన ప్రయోజనాలు మాత్రమే కాపాడుకోవాలన్న మానవాళి వైఖరి అంతిమంగా భూగోళాన్ని చీకట్లోకి నెట్టేస్తుందని స్పష్టం చేశారు. వాతావరణ మార్పులు, తద్వారా ప్రకృతి విపత్తులతో భూగోళానికి పెనుముప్పు పొంచి ఉందని, వాటి దుష్ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రపంచానికి సవాలు విసురుతున్న కర్బన ఉద్గారాలను ప్రజల భాగస్వామ్యం ద్వారా తగ్గించుకోవడానికి 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్' కార్యక్రమాన్ని ఆయన ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి వాతవరణ సదస్సు 'కాప్-33'ని 2028లో భారత్‌లో నిర్వహిస్తామని ప్రతిపాదించారు. శుక్రవారం యూఏఈలోని దుబాయ్‌లో జరిగిన కాప్-28లో ప్రధాని మోదీ ప్రసంగించారు. కాలుష్యం, విపత్తుల నుంచి భూగోళాన్ని కాపాడుకొనే చర్యలను వెంటనే ప్రారంభించాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్'ను ప్రస్తావించారు. వ్యాపారాత్మక ధోరణికి భిన్నంగా, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సాగే ఇందులో పాలుపంచుకోవాలని కోరారు.

మూల్యం చెల్లిస్తున్న మానవాళి

అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతూకాన్ని భారత్ చక్కగా పాటిస్తోందని, ఈ విషయంలో ప్రపంచానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. భూగోళ ఉపరితల ఉష్ణోగ్రత(గ్లోబల్ వార్మింగ్) పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్న లక్ష్య సాధనకు నిబద్ధతతో కృషి చేస్తున్న అతికొన్ని దేశాల్లో భారత్ కూడా ఉందన్నారు. గత శతాబ్ద కాలంలో మానవళిలో ఒక చిన్న సమూహం ప్రకృతికి ఎనలేని నష్టం కలిగించిందని మోదీ ఆక్షేపించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయండి

వాతావరణ మార్పులను ఎదుర్కొనే విషయంలో పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయాలని అభివృద్ధి చెందిన, సంపన్న దేశాలకు నరేంద్ర మోదీ సూచించారు.అభివృద్ధి చెందుతున్న దేశాలకు గ్లోబల్ కార్బన్ బడ్జెట్‌లో తగిన వాటా ఇవ్వాలన్నారు. 'కాప్-33'ని 2028లో భారత్‌లో నిర్వహించడానికి ప్రపంచ దేశాలు అంగీకరిస్తే తమ దేశంలో ఇటీవల జరిగిన జీ20 సదస్సు తర్వాత ఇదే అతిపెద్ద సదస్సు అవుతుందని పేర్కొన్నారు.

ఏమిటీ గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్?

భారత ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబర్‌లో గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. 'గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్' కూడా దాదాపు ఇలాంటిదే. ఇదొక వినూత్నమైన మార్కెట్ ఆధారిత కార్యక్రమం. వేర్వేరు రంగాల్లో పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛందంగా కృషి చేసిన వ్యక్తులకు, వ్యవస్థలకు, కమ్యూనిటీలకు, ప్రైవేట్ రంగానికి ప్రత్యేక గుర్తింపునిస్తారు. ప్రోత్సాహకాలు అందజేస్తారు.

అమెరికా, చైనా అధినేతల గైర్హాజరు

దుబాయ్‌లో జరుగుతున్న కాప్-28కు వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు పాల్గొంటున్నారు. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ మాత్రం హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రపంచంలో ప్రతిఏటా కర్బన ఉద్గారాల్లో ఏకంగా 44 శాతం వాటా అమెరికా, చైనాలదే కావడం గమనార్హం. ఈ రెండు బడా దేశాల నిర్లక్ష్యం వల్ల ఇతర దేశాలకు నష్టపోతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా, చైనా మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

8 మందిని కనండి: పుతిన్

మాస్కో: ఎనిమిది మంది, అంతకంటే ఎక్కువ సంతానాన్ని కనాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తమ దేశ మహిళలను కోరారు. రానున్న దశాబ్దాలతోపాటు ముందు తరాలు కూడా రష్యా జనాభాను పెంచటమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. పెద్ద కుటుంబాలను తయారు చేయడం జీవన విధానంగా మార్చుకోవాలని వారికి తెలిపారు. దేశంలో జననాల రేటు క్షీణిస్తుండటం, ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో పెద్ద సంఖ్యలో సైనికులు మరణిస్తున్న నేపథ్యంలోనే ఆయన ఈ మేరకు పిలుపునిచ్చినట్లు భావిస్తున్నారు.

మిజోరంలో ఓట్ల లెక్కింపు 4న

న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న ఒకే రోజు మొదలవుతుందని ఎన్నికల కమిషన్(ఈసీ) ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, మిజోరంలో మాత్రం ఒక రోజు ఆలస్యంగా డిసెంబర్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు శుక్రవారం ఈసీ తెలిపింది. క్రైస్తవులు మెజారిటీ కలిగిన ఈ రాష్ట్రానికి చెందిన వివిధ వర్గాల ప్రతినిధులు 3వ తేదీ, ఆదివారం తమకు ఎంతో ప్రత్యేకమైనది అయినందున ఓట్ల లెక్కింపు వాయిదా వేయాలని కోరినట్లు ఈసీ వెల్లడించింది. ఈ మేరకు కౌంటింగ్‌ను ఒక రోజు అంటే 4వ తేదీకి వాయిదా వేసినట్లు వివరించింది.

2018 తీర్పుపై పునఃసమీక్షకు రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ: సివిల్, క్రిమినల్ కేసుల్లో హైకోర్టు లేదా దిగువ కోర్టులిచ్చిన స్టేలు 6 నెలల తర్వాత ప్రత్యేకంగా పొడిగింపు ఆదేశాలివ్వకుంటే వాటంతటవే రద్దవుతాయంటూ 2018లో ఇచ్చిన తీర్పుపై పునఃసమీక్షకు రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం సంక్రమించిన అధికారాలను 2018 నాటి తీర్పుతో హైకోర్టులు కోల్పోయాయంటూ అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారణ చేపట్టింది. సీనియర్ లాయర్ రాకేశ్ ద్వివేది వాదనలు వినిపించారు. అప్పటి తీర్పుపై సమీక్షను రాజ్యాంగధర్మాసనానికి అప్పగిస్తామని తెలిపింది.


బెంగళూరు స్కూళ్లకు బాంబు బూచి

బనశంకరి: కర్ణాటక రాజధాని బెంగళూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లోని 68 ప్రైవేట్ పాఠశాలలకు అందిన బాంబు బెదిరింపు మెయిళ్లు శుక్రవారం తీవ్ర అలజడి సృష్టించాయి. ఈ హెచ్చరికలతో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను వెంటనే ఇళ్లకు పంపించివేశాయి. అప్రమత్తమైన పోలీసులు బాంబు డిస్పోజల్ స్క్వాడ్లు, తనిఖీ బృందాలతో ఆయా పాఠశాలల్లో హుటాహుటిన గాలింపు చేపట్టారు. చివరికీ బెదిరింపులు ఉత్తుత్తివేనని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెంగళూరు, పరిసర ప్రాంతాల విద్యార్థులు శుక్రవారం ఉదయం యథావిధిగా తమ స్కూళ్లకు చేరుకున్నారు. అప్పటికే కొన్ని పాఠశాలలకు బెదిరింపు మెయిళ్లు వచ్చినట్లు సమాచారం బయటకు పొక్కింది. దీంతో, భయాందోళనలకు గురైన తల్లిదండ్రులు తమ ఇళ్లు, తాము పనిచేస్తున్న ఆఫీసుల నుంచి హడావుడిగా తమ పిల్లలు చదువుతున్న స్కూళ్లకు చేరుకుని, వారిని వెంట తీసుకెళ్లారు. బెదిరింపు మెయిళ్లు అందిన కొన్ని పాఠశాలల విద్యార్థులు శుక్రవారం పరీక్షలు రాయాల్సి ఉంది. కాగా, బెదిరింపు మెయిళ్లు అందిన 68 పాఠశాలల్లో బెంగళూరు నగరంలోనివి 48 కాగా, మిగతా బెంగళూరు గ్రామీణ పరిధిలోనివని నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద తెలిపారు.

పాక్, బంగ్లా సరిహద్దుల్లో పటిష్ట భద్రత

మంత్రి అమిత్ షా

హజారీబాగ్: భారత్-పాకిస్తాన్, భారత్-బంగ్లాదేశ సరిహద్దుల్లో అత్యంత పటిష్టమైన భద్రత కల్పించబోతున్నామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. రాబోయే రెండేళ్లలో సరిహద్దులను దుర్భేద్యంగా మార్చబోతున్నట్లు తెలిపారు. సరిహద్దుల్లో అసంపూర్తిగా ఉన్న 60 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. శుక్రవారం జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో సరిహద్దు భద్రతా దళం(బీఎస్‌ఎఫ్) 59వ రైజింగ్ డే వేడుకల్లో అమిత్ షా పాల్గొన్నారు. జవాన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత తొమ్మిదేళ్లలో భారత్-పాకిస్తాన్, భారత్-బంగ్లాదేశ సరిహద్దుల్లో 560 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన కంచెలో అక్కడక్కడా ఖాళీలు ఉండేవని, ఆ ఖాళీల గుండా చొరబాటుదారులు, స్మగ్లర్లు సులభంగా మన దేశంలోకి ప్రవేశించేవారని గుర్తుచేశారు. ఆ ఖాళీల్లోనూ కంచె నిర్మాణం పూర్తయ్యిందని, తూర్పు, పశ్చిమ సరిహద్దుల్లో మరో 60 కిలోమీటర్లే కంచె ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు.



వచ్చే పదేళ్లలో 50 శాతం మహిళా సీఎంలు

సీఎంలయ్యే అర్హతలున్న మహిళా నేతలు మా పార్టీలో ఉన్నారు: రాహుల్

కొచ్చి: కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వారిని మరింత ప్రోత్సహించాలని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పార్టీలో ఇంకా చాలామంది మహిళా నాయకులను తయారు చేయాలని, దేశంలో వచ్చే పదేళ్లలో 50 శాత మంది మహిళా ముఖ్యమంత్రులు ఉండాలన్నదే తమ కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు. శుక్రవారం కేరళలోని కొచ్చిలో మహిళా కాంగ్రెస్ నేతల సదస్సు 'ఉత్సాహ్'ను రాహుల్ గాంధీ ప్రారంభించారు. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి మహిళా ముఖ్యమంత్రి ఎవరూ లేరని అన్నారు. ముఖ్యమంత్రులు కావడానికి అవసరమైన అన్ని అర్హతలు కలిగిన మహిళా నాయకులు కాంగ్రెస్‌లో ఎంతోమంది ఉన్నారని చెప్పారు. ప్రయత్నించాలి, లక్ష్యం సాధించాలి అని సూచించారు. ఈరోజు నుంచి వచ్చే పది సంవత్సరాల్లో దేశంలో 50 శాతం మంది ముఖ్యమంత్రులు మహిళలే ఉండాలని, అదే మన లక్ష్యమని ఉద్ఘాటించారు.

మహిళా బిల్లు అమల్లో జాప్యమెందుకు?

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీపై రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. అవి రెండూ పూర్తిగా పురుషాధిక్య సంస్థలని ఆరోపించారు. అధికారంలో మహిళలకు భాగస్వామ్యం కల్పించడానికి ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం అంగీకరించదని చెప్పారు. మొత్తం ఆర్‌ఎస్‌ఎస్ చరిత్రను గమనిస్తే ఏనాడూ ఆ సంస్థలో మహిళల భాగస్వామ్యం లేదని గుర్తుచేశారు. మహిళలను ప్రోత్సహించే విషయంలో కాంగ్రెస్, ఆర్‌ఎస్‌ఎస్ మధ్య ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే అమలు చేయకపోవడం దారుణమని రాహుల్ మండిపడ్డారు. జాప్యం ఎందుకని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందాక దశాబ్దం తర్వాత అమలు చేసే బిల్లును తాను ఏప్పుడూ చూడలేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు విషయంలో మాత్రమే ఇలా జరుగుతోందని తప్పుపట్టారు. ఇదంతా బీజేపీ ప్రభుత్వ నిర్వాకమేనని ఆక్షేపించారు.

మైక్రోఫోన్‌ను ప్రజల వైపు మళ్లిస్తున్నా..

ఢిల్లీలో ఉండే కొందరు నాయకులు లౌడ్‌స్పీకర్లు, కెమెరాలను వారివైపే తిప్పుకుంటున్నారని రాహుల్ గాంధీ పరోక్షంగా బీజేపీ నాయకులపై ధ్వజమెత్తారు. తాను మాత్రం మైక్రోఫోన్‌ను ప్రజల వైపు మళ్లిస్తున్నానని చెప్పారు. సమస్యలను చెప్పుకొనే అవకాశం ప్రజలకు ఇస్తున్నానని తెలిపారు.

బ్యాంకులో పట్టపగలే రూ.18.80 కోట్ల దోపిడీ

ఇంఫాల్: మణిపూర్‌లోని ఓ బ్యాంకులో గురువారం పట్టపగలే భారీ దోపిడీ జరిగింది. గుర్తు తెలియని సాయుధ దుండగులు సుమారు రూ.18.80 కోట్లను దోచుకెళ్లారు. ఉఖ్రుల్ పట్టణంలోని వ్యూలాండ్‌లో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఈ ఘటన చోటుచేసుకుంది. రిజర్వు బ్యాంకు అధికారులు ఉఖ్రుల్ జిల్లాలోని అన్ని ఏటీఎంలకు అవసరమైన నగదును వ్యూలాండ్ బ్రాంచిలో నిల్వ ఉంచుతుంటారు. గురువారం సాయంత్రం 5.40 గంటల సమయంలో అత్యాధునిక ఆయుధాలతో ముసుగులు ధరించిన దుండగులు బ్యాంకు సిబ్బంది ప్రవేశించే గేట్ గుండా లోపలికి ప్రవేశించారు. ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బందిని తుపాకీలతో బెదిరించి వాష్‌రూంలో బంధించారు. క్యాషియర్‌కు తుపాకీ గురిపెట్టి, క్యాష్ వాల్ట్‌ను తెరిపించారు. మొత్తం రూ.18.80 కోట్లను ఎత్తుకెళ్లి పోయారు.

ప్రతినిధుల సభ నుంచి జార్జి శాంటోస్ బహిష్కరణ

వాషింగ్టన్: రిపబ్లికన్ పార్టీకి చెందిన జార్జి శాంటోస్‌ను ప్రతినిధుల సభ బహిష్కరించింది. ప్రచార నిధులను సొంతానికి వాడుకున్నారన్న ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ అందించిన నివేదిక శాంటోస్‌ను దోషిగా తేల్చింది. ఇందుకు గాను సభ నుంచి బహిష్కరించాలన్న తీర్మానం 311-114 ఓట్ల తేడాతో ఆమోదం పొందింది.

సాక్షి
కరీంనగర్
శనివారం | 2 | డిసెంబర్ | 2023



పల్లె గుండెలపై తూటా గాయం

మూడు దశాబ్దాల క్రితం నక్సలైట్లు.. పోలీసులకు మధ్య జరిగిన పోరులో పల్లెలు సమిధలయ్యాయి. కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో గర్జనపల్లి యువకుడు ప్రాణాలు వదలగా ఆ గాయం సలుపుతోంది. 8లో▸



రాజన్నకు జనసందడి

వేములవాడ: కార్తీక శుక్రవారం వేములవాడ రాజన్నను 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి కోడెమొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/22.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పత్తి ధర రూ.6,750



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.6,750 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 29 వాహనాల్లో 260 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.6,000 పలికింది. గన్నీ సంచుల్లో నలుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.5,800, కనిష్ట ధర రూ.5,800కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా.. ఇద్దరు రైతుల నుంచి 11.40 క్వింటాళ్ల పత్తిని సీసీఐ సంస్థ కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,810, కనిష్ట ధర రూ. 6,740 పలికింది. పత్తి మార్కెట్లో క్రయవిక్రయాలను కార్యదర్శి గగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించాలి



రామడుగు: ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో కష్టపడి, ఎంచుకున్న లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ సూచించారు. రామడుగు మండలం వెలిచాల గ్రామపరిధిలో ప్రశాంత్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఎయిడ్స్ దినోత్సవం, రాజ్యాంగదినోత్సవం సందర్భంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ మాట్లాడుతూ.. బాలిబాలికలు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాలని అన్నారు. ప్రశాంత్‌భవన్‌కు అవసరమైన న్యాయపరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ కృష్ణార్జునాచారి, తణుకు మహేశ్, ఆషాడపు శ్రీనివాస్, ప్రశాంత్ భవన్ నిర్వాహకుడు సిరిల్ పాల్గొన్నారు.

రేపు మద్యం దుకాణాలు బంద్

కరీంనగర్‌క్రైం: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈ నెల మూడోతేదీన ఉదయం నుంచి లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్బులు, ఆర్మీకాంటిన్ మూసివేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీచేశారు. 94 వైన్స్‌లు, 32బార్లతో పాటు క్లబ్బులు, ఆర్మీక్యాంటిన్, మద్యం డిపో మూసివేస్తున్నట్లు ఆబ్కారీ అధికారులు వెల్లడించారు.

కౌంటింగ్ సందర్భంగా దారి మళ్లింపు

కరీంనగర్‌క్రైం: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల మూడో తేదీన ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరంలో వాహనాల దారిమళ్లింపు చర్యలు చేపట్టనున్నట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ తెలిపారు. జగిత్యాల నుంచి కరీంనగర్‌కు వచ్చేవారు రేకుర్తి, శాతవాహనయూనివర్సిటీ, చింతకుంట, పద్మనగర్, గీతాభవన్ మీదుగా బస్టాండ్‌కు, కరీంనగర్ నుంచి జగిత్యాలకు వెళ్లేవారు గీతాభవన్, పద్మనగర్, చింతకుంట, శాతవాహన యునివర్సిటీ, రేకుర్తి మీదుగా వెళ్లాలని సూచించారు. ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ పరిస్థితిని బట్టి కోర్టు నుంచి శివ థియేటర్ వైపు మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సూచించారు.

మొదటగా పోస్టల్ బ్యాలెట్ పత్రాలు లెక్కింపు



కరీంనగర్: ముందుగా పోస్టల్ బ్యాలెట్ పత్రాల లెక్కింపు చేపట్టనున్నారు. అయితే పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు కాకున్నా, ఒక అభ్యర్థితో పాటు మరొకరికి ఓటు వేసినా, తప్పుడు బ్యాలెట్ పత్రమని తేలినా, చిరిగిపోయినా, పాడైనా, వేసిన ఓటు ఎవరికి వేశారో నిర్ధారణ కాకున్నా బ్యాలెట్ పత్రంలో ఎలాంటి రాతలు ఉన్నా తిరస్కరిస్తారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తయిన 30 నిమిషాల తరువాత ఈవీఎంల లెక్కింపులను ప్రారంభిస్తారు.

కోతల రాయుళ్ల హవా!

- 'సోషల్' ప్రభావం తగ్గడంతో కొత్త ఎత్తుగడ
- బస్టాండ్లు, టీస్టాళ్లు, టిఫిన్ సెంటర్లలో రాజకీయ చర్చ
- ప్రత్యర్థుల లోపాలు ప్రస్తావించి జారుకోవడంలో దిట్ట
- పబ్లిక్ మూడ్ మార్చేలా ప్రభావం చూపిన మాటలు
- 2018తో పోలిస్తే తగ్గిన పోలింగ్
- జిల్లాలో ఓటింగ్‌కు దూరంగా 2,61,495 మంది

జిల్లాలో గురువారం జరిగిన పోలింగ్ ఇలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	పోలైనవి	శాతం	మొత్తం	ఓటేయనివారు
కరీంనగర్	1,12,025	1,12,458	2,24,504	63.23	3,55,054	1,30,550
చొప్పదండి	85,538	95,655	1,81,194	77.77	2,32,990	51,796
మానకొండూర్	91,497	92,915	1,84,413	83.21	2,21,613	37,200
హుజూరాబాద్	1,02,194	1,05,410	2,07,609	83.19	2,49,558	41,949



సాక్షిప్రతినిధి, కరీంనగర్: సోషల్ మీడియా 2018 ఎన్నికల్లో ప్రముఖ పాత్ర పోషించింది. చాలామంది నేతల తలరాతలు మార్చింది. కరోనాతో అన్ని వయసులవారిలో స్మార్ట్ వినియోగం పెరిగి సోషల్ మీడియాకు ఆదరణ పెరిగింది. కాలక్రమంలో దానికి ఆదరణ తగ్గింది. ఏది నిజమో? ఏది అబద్ధమో నమ్మలేని గందరగోళం నెలకొంది. అందుకే, ఈసారి కొన్ని పార్టీలు ప్రత్యేకంగా 'కోతల' రాయుళ్లను నియమించుకున్నాయి. వీరు జనాల్లో కలిసిపోయి తమ పార్టీ ఎజెండా అమలు చేస్తారు. అంటే ప్రజల అభిప్రాయాన్ని తమ మాటల ద్వారా మార్చడం వీరి పని. వీరంతా ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రద్దీ ప్రాంతాలే లక్ష్యంగా..

దేశంలో కొన్ని సంస్థలు తొలుత యువత దారిలోకి వెళ్లి.. తరువాత తమ దారికి తెచ్చుకుంటాయి. సరిగ్గా కొన్ని పార్టీలు ప్రచారానికి ఇదే పంథా అవలంబించాయి. గ్రామీణ ప్రాంతాల్లో బస్టాండ్లు, టీస్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, బెల్ట్‌షాపులు, వైన్స్, రెస్టారెంట్లు, పంచాయతీ కేంద్రాలను పలు పార్టీల సానుభూతిపరులు అడ్డాలుగా చేసుకున్నారు. అక్కడ తొలుత తమ ప్రత్యర్థి పార్టీలు చేసిన మంచి పనులను పొగుడుతారు. ఆ తరువాత లోపాలు ఒక్కొటి ప్రస్తావించి, చర్చ పెడతారు. స్థానికులు కావడంతో అంతా చర్చలో లీనమవుతారు. ఇక వెంటనే అక్కడ నుంచి వారు లేచి మరో చోటుకు వెళ్తారు. ఇలా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రిపూట నాలుగుపూటలా వీరిది ఇదే పని. వీరికి చాలా చోట్ల రూ.15వేలకుపైగా జీతం చెల్లించారట. వీరి కారణంగా చాలా నియోజకవర్గాల్లో ప్రజల మూడ్ మారిందంటే అతిశయోక్తి కాదు. వీరు ఇప్పుడు ఏ పార్టీ గెలుపు ఓటములు ప్రభావితం చేశారో మరో 24 గంటల్లో తేలిపోనుంది. ప్రస్తుతం ప్రతీ నాయకుడు పోలింగ్‌బూత్‌ల వారీగా నమోదైన పోలింగ్‌శాతం తమకు ఎంత మేరకు లాభిస్తుందో.. అంచనా వేసే పనిలో తలమునకలయ్యారు. మరికొందరు అనుచరులతో పర్యటనలు చేస్తే.. మిగిలినవారు కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు.

కరీంనగర్‌లో ఓటేయని 1.30 లక్షల మంది

కరీంనగర్ జిల్లాలో క్రితంసారి కన్నా ఈసారి పోలింగ్ శాతం తగ్గింది. వాస్తవానికి 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. ఇప్పుడు ఓటర్లు పెరిగారు. ముఖ్యంగా కరీంనగర్‌లాంటి నగరంలో ఏకంగా 60వేలమంది కొత్త ఓటర్లు నమోదు చేయించుకున్నారు. అలాంటి కరీంనగర్‌లో 3.40లక్షల మంది ఉండగా.. కేవలం 2.24లక్షల మంది ఓట్లేయడం చర్చానీయాంశంగా మారింది. అంటే దాదాపుగా 1.30 లక్షల మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇది దాదాపుగా భద్రాచలం లాంటి చిన్న నియోజకవర్గ జనాభాకు సమానమంటే అతిశయోక్తి కాదు. ఇక చొప్పదండిలో 51వేలమంది, మానకొండూరులో 37వేలమంది, హుజూరాబాద్‌లో 41వేలమంది ఓటింగ్‌లో పాల్గొనకపోవడం గమనార్హం. క్రితంసారి నియోజకవర్గాల వారీగా కరీంనగర్ 69.29శాతం, చొప్పదండి 79.73శాతం, మానకొండూరు 85.36శాతం, హుజూరాబాద్ 84.40శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కరీంనగర్ 63.23శాతం, చొప్పదండి 77.77శాతం, మానకొండూరు 83.21శాతం, హుజూరాబాద్ 83.19శాతం ఇలా.. అన్ని నియోజవకర్గాల్లో 2 శాతానికి తక్కువగా నమోదైంది. కానీ, కరీంనగర్‌లో క్రితంసారి కన్నా ఆరు శాతం ఓటింగ్ పడిపోవడం చర్చానీయాంశంగా మారింది.

వరుస సెలవులే కారణమా?

పోలింగ్ శాతం పడిపోయేందుకు పలు కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్‌లాంటి పట్టణంలో 1.30 లక్షల మంది ఓటు హక్కు ఉన్నా వినియోగించుకోవడాన్ని దురదృష్టకరంగానే అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వాలు, పార్టీలు ఇంత ప్రచారం కల్పిస్తే.. ఓటు నమోదులో కనిపించిన ఆసక్తి, ఓటేయడంలో కానరాలేదు. ఇందుకు వరుస సెలవులు, డబుల్ ఓట్లు, అనారోగ్యం, పోలింగ్‌పై అనాసక్తి తదితరాలు కారణాలు అయి ఉంటాయని విశ్లేషిస్తున్నారు.

డబ్బులు తీయని నేతలు

జిల్లాలో నేతలు ఈసారి ఓటర్ల కోసం పెద్దగా డబ్బులు ఖర్చు చేయలేదనే వినికిడి. సభలు, ప్రచారానికి పార్టీ ఫండ్, వ్యక్తిగత ఫండ్ పూర్తిగా వెచ్చించారా? లేక ఎలాగూ ఓడిపోతున్నప్పుడు ఖర్చు చేసి ఎందుకు దండగా అని ఊరుకున్నారా? తెలియదు కానీ, ఎక్కడా పెద్దగా పంచకపోవడం గమనార్హం. పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో 29వ తేదీ రాత్రి ఒంటి గంట వరకూ చాలామంది ఇంటి తలుపులు తెరిచే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. గత ఉప ఎన్నికలలో హుజూరాబాద్‌లో ఓటుకు రూ.6000 పంచిన దాఖలాల నేపథ్యంలో ఈసారి అంతకుమించి వస్తాయనుకుంటే రూ.500లతోనే సరిపెట్టారని స్థానికులు గొణుక్కుంటున్నారు. క్రితంసారి వచ్చిన డబ్బులతో టీవీ కొనుకున్న తాము, ఈసారి ఫ్రిడ్జ్ కొందామనుకున్నామని ఇంట్లో నాలుగు ఓట్లు ఉన్న ఓ పెద్దాయన 'సాక్షి'తో వాపోయాడు. మరోవైపు చాలాచోట్ల ప్రచారంలో దాదాపు 50 రోజులు పాల్గొన్న సెకండ్ కేడర్, కార్యకర్తలకు కనీసం ఖర్చులకు ఇవ్వకుండా ఎమ్మెల్యే అభ్యర్థులు 29వ తేదీన ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకోవడం విశేషం.

ఓట్ల లెక్కలపై మల్లగుల్లాలు



టవర్ సర్కిల్‌లో జిలేబీ తింటున్న బీజేపీ అభ్యర్థి, ఎంపీ సంజయ్



బొమ్మకల్‌లోని తన నివాసంలో కార్యకర్తలతో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్

- కరీంనగర్‌లో గతంతో పోలిస్తే తగ్గిన పోలింగ్ శాతం
- అభ్యర్థుల ఇళ్ల వద్ద నాయకుల సందడి
- హైదరాబాద్ వెళ్లిన మంత్రి 'గంగుల'
- జిలేబీ సెంటర్‌కు 'బండి'
- కార్యకర్తలతో 'పురుమల్ల' సమావేశం

కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఇక గెలుపోటములు తేలాల్సి ఉంది. కరీంనగర్ నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో 68 శాతం.. ఈ ఎన్నికల్లో 63.23 శాతమే పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 3,55,054 మంది ఓటర్లు ఉండగా 2,24,504 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థులు తమ ఇళ్ల వద్ద నాయకులు, అనుచరులతో బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ ఏడాది లక్ష మంది కొత్త ఓటర్లు నమోదు కావడంతో ఆ ఓట్లు ఎటు పడ్డాయంటూ ఆరా తీస్తున్నారు. కులాలు, మతాల ఓట్లనూ లెక్కిస్తున్నారు. ఎవరికి వారే గెలుపుపై ధీమాగా ఉన్నారు. యువత ఓట్లు తమ ఖాతాలోకే వస్తాయని బీజేపీ నాయకులు ఆశిస్తుండగా, బీఆర్‌ఎస్ నాయకులు సైతం తమకు యువత ఓటు బ్యాంకు పటిష్టంగా ఉందని చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉందని, యువతతోపాటు అన్ని వర్గాల ఓట్లు పడతాయని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

తక్కువ ఓట్లు వస్తే ఎలా?

ఎన్నికలకు ముందు చోటామోటా నాయకులు తమ గ్రామాలు, డివిజన్ల నుంచి ఇన్ని ఓట్లు వస్తాయని లెక్కలు కట్టి, అభ్యర్థులకు చూపించారు. ఆదివారం ఫలితాలు వెల్లడి కానుండడంతో వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తమ పోలింగ్ బూత్‌లలో తక్కువ ఓట్లు వస్తే అభ్యర్థులకు ఏం చెప్పాలన్న మీమాంసలో ఉన్నారు.

విజయావకాశాలపై చర్చ

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలే కాకుండా నగరంలో నలుగురు కలిసిన చోట ఎన్నికల్లో గెలుపోటములపై జోరుగా చర్చ జరుగుతోంది. ఫలానా పార్టీకి ఇన్ని ఓట్లు వస్తాయని, ఫలానా సామాజిక వర్గం ఓట్ల మెజారిటీతో గెలుస్తాడని, పట్టణం, పల్లె ఓట్ల లెక్కలతోపాటు ఇతర సామాజిక వర్గాలకు సంబంధించిన ఓట్ల సంఖ్య, కూడికలు, తీసివేతలను ప్రధాన అంశాలుగా మాట్లాడుకుంటున్నారు.

నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు

బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ హైదరాబాద్ వెళ్లడంతో మేయర్ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు నగరానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లే కాకుండా ఇతర గ్రామాల ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, వాణిజ్య, వ్యాపారులు, రిటైర్డ్ ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓట్ల తీరుతెన్నులు, విజయావకాశాలపై ఆరా తీస్తున్నారు. గెలుపు మనదే అని కార్యకర్తలకు భరోసా ఇస్తున్నారు. బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ సైతం తన ఇంట్లో శుక్రవారం కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఓటింగ్ సరళితోపాటు ఎక్కడెక్కడ తమకు అనుకూలంగా ఓట్లు పోలయ్యాయనే విషయాలను తెలుసుకున్నారు. ఎంపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొట్టె మురళి, బోయినపల్లి ప్రవీణ్, డాక్టర్ పుల్లెల పవన్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో మాట్లాడారు. టవర్ సర్కిల్ వద్ద మామాజీ జిలేబీ సెంటర్‌కు వెళ్లి, స్థానిక వ్యాపారులు, వాణిజ్య, వర్తక సంఘాల నాయకులు, ప్రజలతో కాసేపు ముచ్చటించారు. స్వీట్లు పంచుతూ అరగంటపాటు సందడి చేశారు. యువత వెన్నుదన్నుగా ఉండటంతో తనకే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ బొమ్మకల్‌లోని తన ఇంట్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పోలింగ్ జరిగిన తీరు, కౌంటింగ్ ఏర్పాట్లపై ఆరా తీశారు. గెలుపు తమదేనని వారికి భరోసా కల్పించారు. అనంతరం దుర్శేడ్ గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు.

స్ట్రాంగ్‌రూంకు పటిష్ట భద్రత



స్ట్రాంగ్‌రూం వద్ద జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

- రక్షణ చర్యలు పరిశీలించిన కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల భవితవ్యాన్ని నిర్ణయించే ఈవీఎంలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం పోలింగ్ ముగిసిన అనంతరం అర్ధరాత్రి వరకు ఎస్సారార్ కళాశాలకు ఈవీఎంలను తరలించారు. ప్రత్యేక వాహనాల్లో ఎస్కార్ట్ ద్వారా తరలించగా జీపీఎస్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పర్యవేక్షించారు. కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ శాసనసభ నియోజకవర్గాల అభ్యర్థుల భవితవ్యం ఆదివారం తేలనుండగా ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు నాలుగంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం లను పరిశీలించారు. భద్రతా చర్యలను ఆరా తీశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి స్ట్రాంగ్ రూం పరిసరాలు పరిశీలించారు.

కౌంటింగ్ సెంటర్ వద్ద గట్టి బందోబస్తు

- సీపీ అభిషేక్ మహంతి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎస్సారార్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. శుక్రవారం కమిషనరేట్ కేంద్రంలో వివిధ స్థాయిల పోలీసు అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కమిషనరేట్‌వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని వివరించారు. పటిష్టమైన ప్రణాళిక, క్రమశిక్షణతో అధికారులందరూ సమష్టిగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎంతో అప్రమత్తంగా ఉంటూ వారికి కేటాయించబడ్డ విధులు సక్రమంగా నిర్వహించారని, ఈ సందర్భంగా అన్ని విభాగాలకు చెందిన అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. డిసెంబర్ 3న కౌంటింగ్ ఉండగా జిల్లాలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో పోలీసు నిఘాతో భద్రపరిచినట్లు వివరించారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అడిషనల్ డీసీపీలు ఏ.లక్ష్మీనారాయణ(శాంతి భద్రతలు), సి.రాజు (పరిపాలన), ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, సర్వర్, విజయ్‌కుమార్, కాశయ్య, మాధవి, వేణు, ప్రతాప్ పాల్గొన్నారు.

ఈవీఎం గుప్పిట్లో 73 మంది అభ్యర్థుల భవిష్యత్తు



కరీంనగర్: జిల్లాలో పోలింగ్ ప్రక్రియ పూర్తవ్వడంతో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠకు తెరలేచింది. ఈనెల 3వ తేదీన జరిగే కౌంటింగ్ విజేతలెవరో, వెనుకబడేదెవరో తేలనుంది. ఇక జిల్లాలో పోలింగ్ ప్రక్రియ సజావుగా జరుగడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. సదరు స్ట్రాంగ్‌రూంల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 3న జిల్లా ఎన్నికల అధికారితో పాటు ఎన్నికల కమిషన్ నియమించిన ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంలను తెరిచి ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతోంది. ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. ఉదయం 10 గంటల కల్లా ఫలితాలు వెలువడనున్నాయి. కరీంనగర్‌లో 27 మంది, హుజూరాబాద్ 22 మంది, చొప్పదండి 14 మంది, మానకొండూరు 10 మంది అభ్యర్థులు తమ భవితవ్యం తేల్చుకోనున్నారు.

కొత్త వైన్స్‌లు షురూ..



- శుక్రవారం ప్రారంభమైన దుకాణాలు
- జిల్లాలో 94వైన్స్‌లు.. రెండేళ్ల నిర్వహణ

జిల్లాలో వైన్స్‌లు.. వచ్చిన టెండర్లు

సర్కిల్	షాపులు	టెండర్లు
కరీంనగర్ అర్బన్	21	1,017
కరీంనగర్ రూరల్	26	1,165
తిమ్మాపూర్	14	780
హుజూరాబాద్	17	625
జమ్మికుంట	16	453
మొత్తం	94	4,040

కరీంనగర్‌క్రైం: జిల్లావ్యాప్తంగా కొత్త వైన్స్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మద్యం టెండర్లకు వ్యాపారులు పోటెత్తగా ఆగస్టులో లక్కీడ్రా ద్వారా కలెక్టర్ చేతుల మీదుగా షాపులు కేటాయించారు. 94 దుకాణాలకు 4,040 దరఖాస్తులు రాగా ఎక్సైజ్ శాఖకు రూ.80.80 కోట్ల ఆదాయం వచ్చింది. చివరి రోజు పెద్దసంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఆదాయం పెరిగింది. గతంలో 1,720 దరఖాస్తులు రాగా రూ.34.40 కోట్ల ఆదాయం సమకూరింది. ఇప్పుడు సుమారు రూ.45కోట్ల వరకు అదనంగా ఎక్సైజ్‌కు కలిసివచ్చింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వం నాలుగు నెలల ముందే టెండర్ల ప్రక్రియ స్వీకరించడంతో గతనెల 30వరకు పాత దుకాణాల నిర్వాహకులే అమ్మకాలు జరిపారు. కొత్తగా టెండర్లు దక్కించుకున్నవారు శుక్రవారం వ్యాపారాలు ప్రారంభించారు. 2023 డిసెంబర్ 01 నుంచి 2025 నవంబర్ 30 వరకు కొత్త దుకాణాలు కొనసాగనున్నాయి.

పాతవారికి అమ్మేశారు

కొత్తగా వైన్స్‌లు దక్కించుకున్నవారు 15 నుంచి 20మంది వరకు నిర్వహణ భారమని ఆలోచించి, అనుభవం ఉన్న పాత వ్యాపారులకు వైన్స్‌లు అమ్మేశారు. జిల్లావ్యాప్తంగా 4,040 దరఖాస్తులు రాగా.. చింతకుంట వైన్స్‌కు 127, కొత్తపల్లి వైన్స్‌కు 95 దరఖాస్తులు అధికంగా వచ్చాయి. అర్నకొండ వైన్స్‌కు 11 దరఖాస్తులు వచ్చాయి ఆగస్టులోనే లక్కీ డ్రా ద్వారా వైన్స్‌లు దక్కించుకున్న వ్యాపారులు అప్పుడే లైసెన్సు ఫీజు చెల్లించి, ఇప్పుడు దుకాణాలు ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాత వ్యాపారులు పెద్దఎత్తున అమ్మకాలు జరిపారు. కొత్తగా వచ్చిన వారు శుక్రవారం ప్రారంభించగా ముందు స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికలు ఉండడంతో లాభాల వర్షం కురిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో సత్తా



రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.కార్తికేయ మంథనిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో సత్తా చాటాడు. కరీంనగర్ జిల్లా జట్టు రెండో స్థానంలో నిలవడానికి అతని ప్రదర్శనే కారణమని విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంట పోచమ్మవాడకు చెందిన బొంకూరి శ్రీనివాస్ ఇంట్లో శుక్రవారం షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.3 లక్షల విలువైన బంగారం, నగదు, టీవీ, కూలర్, ఫ్రిడ్జి, గ్యాస్ సిలిండర్ తదితర సామగ్రి దగ్ధమయ్యాయని అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సిరాజుద్దీన్, కుమారస్వామి, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నరేందర్ సంఘటన స్థలానికి చేరుకొని, మంటలను ఆర్పివేశారని పేర్కొన్నారు.

డమ్మీ ఈవీఎంలు వాడిన వ్యక్తులపై కేసు

జగిత్యాల క్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఓటర్లకు అవగాహన కల్పించేందుకు డమ్మీ ఈవీఎంలను వినియోగించారని పోలీసులు తెలిపారు. రాయికల్ మండల కేంద్రంలో ఓ వ్యక్తిని, పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోట్ల పలువురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద డమ్మీ ఈవీఎంలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

'సీ-విజిల్'లో ఫిర్యాదు చేసినందుకు దాడి

- అధికారులకు స్వతంత్ర అభ్యర్థి ఫిర్యాదు

పెద్దపల్లిరూరల్: సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసినందుకు తన ఏజెంట్ కర్రె రాజుపై బీఆర్‌ఎస్ నాయకులు దాడికి పాల్పడి, అక్రమంగా ప్రైవేట్ పాఠశాలలో నిర్బంధించారని పెద్దపల్లి స్వతంత్ర అభ్యర్థి గుంటి కుమారస్వామి తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలంటూ కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల అధికారులకు శుక్రవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులతో ప్రాణభయం ఉందని, రక్షణ కల్పించాలని కోరానన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలంలోని తుమ్మనపల్లికి చెందిన ముప్పు రమేశ్(30) శుక్రవారం హుజూరాబాద్ నుంచి తుమ్మనపల్లికి బైక్‌పై వస్తున్నాడు. గ్రామ శివారులో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

పల్లెగుండెలపై తూటా గాయం



కొయ్యూరు ఎన్‌కౌంటర్ మృతులు (ఫైల్)



సంఘటన స్థలంలో మృతదేహాలు





లక్ష్మీరాజం తల్లి భారతమ్మ, సోదరుడు నర్సయ్య

- కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌కు 24 ఏళ్లు
- స్మరించుకుంటూ వారోత్సవాలు నిర్వహిస్తున్న మావోయిస్టు పార్టీ
- నాడు మావోయిస్టు అగ్రనేతలతోపాటు గర్జనపల్లి పశువుల కాపరి మృతి
- చితికిన పేద కుటుంబం
- బాధితులకు బాసటగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..

సిరిసిల్ల: మూడు దశాబ్దాల కిందట సమసమాజాన్ని స్థాపించే లక్ష్యంతో నక్సలైట్లు.. శాంతిభద్రతల పేరిట పోలీసుల మధ్య సాగిన సాయుధ పోరులో పల్లెలు సమిధలయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆనాటి ఘటనలు చెరిగిపోని జ్ఞాపకాలను మిగిల్చాయి. మావోయిస్టు పార్టీ పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వారోత్సవాలను ఇప్పుడు నిర్వహిస్తుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కొయ్యూర్ (ఇప్పుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా) అటవీప్రాంతంలో 1999 డిసెంబరు 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, అగ్రనేతలు నల్ల ఆదిరెడ్డి అలియాస్ శ్యామ్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి అలియాస్ మహేశ్, శీలం నరేశ్ అలియాస్ మురళి ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఎన్‌కౌంటర్‌ను స్మరించుకుంటూ పీఎల్‌జీఏ వారోత్సవాలను మావోయిస్టు పార్టీ నిర్వహిస్తుంది. సరిగ్గా 24 ఏళ్ల కిందట జరిగిన కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతలతోపాటు రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన సింగం లక్ష్మీరాజం(21) మరణించారు. అగ్రనేతలతో ఎన్‌కౌంటర్ అయిన లక్ష్మీరాజం పశువుల కాపరి మాత్రమే. పల్లెగుండెలపై ఆనాటి తూటా గాయం ఇంకా సలుపుతోంది. నిజానికి 24 ఏళ్ల కిందట జరిగిన ఆనాటి ఘటన మాయని గాయమై గర్జనపల్లిలో ఇంకా సలుపుతూనే ఉంది. ఓ పశువుల కాపరి లక్ష్మీరాజం మావోయిస్టు అగ్రనేతలతోపాటు ఎన్‌కౌంటర్ కావడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. లక్ష్మీరాజంను మరో మావోయిస్టు అగ్రనేతగా, గుర్తు తెలియని శవంగా పోలీసులు ముందుగా ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులు శవాన్ని గుర్తించడంతో లక్ష్మీరాజంగా నిర్ధారించారు. మావోయిస్టు అగ్రనేతలతో గర్జనపల్లి యువకుడు ఎన్‌కౌంటర్ కావడం కలకలం సృష్టించింది.



గర్జనపల్లి చౌరస్తాలో అమరవీరుల స్తూపం

ఆనాడు ఏం జరిగిందంటే..

లక్ష్మీరాజం గర్జనపల్లిలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేసి తండ్రి సింగం వెంకటితోపాటు పశువులు కాసేవాడు. కడు పేదరికం అనుభవించే లక్ష్మీరాజం ఊరిలో వివాదరహితుడు. అప్పట్లో పీపుల్స్‌వార్ సానుభూతిపరుడిగా లక్ష్మీరాజం పనిచేసినట్లు ఎవరికీ తెలియదు. కానీ ఎల్లారెడ్డిపేట పోలీసులు లక్ష్మీరాజంను ఇంట్లో నుంచి నవంబరు 30వ తేదీ అర్ధరాత్రి పట్టుకెళ్లారు. తెల్లవారే ఆ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లక్ష్మీరాజం గురించి వాకబు చేశారు. కానీ పోలీసులు తమకేమీ తెలియదని చెప్పారు. తెల్లారే (డిసెంబరు 2న) కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతలు ఎన్‌కౌంటర్ అయ్యారు. నలుగురు మావోయిస్టులు మరణించారని పోలీసులు ప్రకటించారు. అప్పటి రాష్ట్ర డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హెలికాప్టర్‌లో కొయ్యూర్ ఎన్‌కౌంటర్ స్థలాన్ని సందర్శించారు. నాలుగో మృతుడు(లక్ష్మీరాజం) అంతర్ రాష్ట్ర నక్సలైట్ అని ప్రకటించారు. కానీ అప్పటికే కీడు శంకించిన గర్జనపల్లి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కొయ్యూర్‌కు వెళ్లి శవాన్ని గుర్తించారు. దీంతో నాలుగో మృతుడు గర్జనపల్లి వాసిగా నిర్ధారణయ్యాడు. సామాన్యమైన పశువుల కాపరి మావోయిస్టు అగ్రనేతలతో ఎన్‌కౌంటర్‌లో బలి అయ్యాడు. ఇది అప్పట్లో సంచలనం. గర్జనపల్లి యువకుడు కొయ్యూర్‌లో ఎలా ఎన్‌కౌంటర్‌లో మరణించాడు అనేది చర్చ సాగింది.

శీలం నరేశ్‌కు సిరిసిల్లతో అనుబంధం

కొయ్యూర్ మృతుల్లో మరో అగ్రనేత శీలం నరేశ్ అలియాస్ మురళి జగిత్యాల వాసి కాగా, సిరిసిల్ల పాలిటెక్నిక్ కాలేజీ(అగ్రహారం)లో చదువుకున్నాడు. ఆయన సోదరుడు జగదీశ్ సిరిసిల్ల సెస్‌లో ఉద్యోగం చేసి రిటైర్డు అయ్యారు. సిరిసిల్లలో శీలం నరేశ్ మిత్రులు చాలా మంది ఉన్నారు. కొయ్యూర్ ఎన్‌కౌంటర్ ఘటన సిరిసిల్ల ప్రాంతంలో కలకలం సృష్టించింది. ఆ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు ముగ్గురు మరణించగా.. రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన పశువుల కాపరి లక్ష్మీరాజం మరణించడం చర్చకు దారితీసింది.

అజ్ఞాతంలో మరో ఇద్దరు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో మావోయిస్టు పార్టీ మానాల ఎన్‌కౌంటర్‌లో 11 మంది మరణించడంతో ఉనికి కోల్పోయింది. జిల్లాలో పట్టున్న జనశక్తి ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో క్షీణించింది. ప్రస్తుతం జిల్లాలోని తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెకు చెందిన కదారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కొస, కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన చంద్రయ్య, బండలింగంపల్లికి చెందిన మరో యువకుడు అజ్ఞాతంలో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. జిల్లాలోని గండిలచ్చపేటకు చెందిన బాలసంతుల ఉప్పలయ్య అలియాస్ చిన్నన్న సైతం 34 ఏళ్లుగా అదృశ్యమయ్యాడు. కానీ ఆయన ఎక్కడ ఉన్నది ఇప్పటికీ మిస్టరీయే.

దీనస్థితిలో లక్ష్మీరాజం కుటుంబం

కొయ్యూర్ ఎన్‌కౌంటర్ మృతుడు లక్ష్మీరాజం కుటుంబం ఇప్పుడు దీనస్థితిలో ఉంది. అతని తండ్రి వెంకటి చాలా రోజుల కిందట మరణించగా.. తల్లి భారతవ్వ అనారోగ్యంతో చేతకాని స్థితిలో ఉంది. తమ్ముడు నర్సయ్య కూలి పనులకు వెళ్తున్నాడు. రేకులషెడ్డు వేసుకుని జీవిస్తున్నారు. లక్ష్మీరాజం ఎన్‌కౌంటర్‌లో మరణించకుంటే.. ఆ కుటుంబం పరిస్థితి ఇలా ఉండేది కాదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా 24 ఏళ్ల కిందటి తూటా గాయం.. ఓ కుటుంబానికి ఇంకా మానని గాయమై సలుపుతూనే ఉంది. స్వరాష్ట్రంలోనూ సలుపుతున్న గాయాన్ని కనీసం మాన్పించే మందురాయని పరిస్థితి ఉండడం బాధాకరం. ఆ పేద కుటుంబానికి బాసటగా నిలువాల్సిన బాధ్యత పాలకులదే.

పుట్టిన బిడ్డ ముఖం చూడకుండానే..

- అధిక రక్తస్రావంతో బాలింత మృతి
- కొత్త కొరండ్లపల్లెలో విషాదం



లాస్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ధర్మపురి: పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లి కొడుకు ముఖం చూడకుండానే మృతిచెందింది. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలి బంధువుల వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని నర్సయ్యపల్లె పంచాయతీ పరిధి కొత్త కొరండ్లపల్లెకు చెందిన కొక్కుల లాస్య(26) గత నెల 29న పురిటినొప్పులతో బాధ పడుతుండగా కుటుంబసభ్యులు జగిత్యాలలోని మాతా శిశు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆపరేషన్ చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. కానీ, ఆమెకు అధికంగా రక్తస్రావం కావడంతో కుటుంబీకులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో గురువారం రాత్రి నగునూర్‌లోని ప్రతిమ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా లాస్య చనిపోయింది. ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లి, శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి ఇదివరకు ఒక కుమారుడు ఉన్నాడు. భర్త భూమేశ్ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. లాస్య మృతి ఘటన కొత్త కొరండ్లపల్లెలో విషాదం నింపింది.

రైతు మృతి.. ప్రభుత్వాస్పత్రిపై రాళ్ల దాడి

- కనీస వసతులు లేకపోవడంతోనే చనిపోయాడన్న బాధితులు
- ధర్మపురిలో ఘటన



రామయ్య మృతదేహం



పగిలిపోయిన ఆస్పత్రి కిటికీ అద్దం

ధర్మపురి: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఓ రైతు మృతిచెందాడు.. కనీస వసతులు లేకపోవడంతోనే అతను చనిపోయాడని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. వారి వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని దోనూర్ గ్రామానికి చెందిన మామిడి రామయ్య(50) అనే రైతు కొంతకాలంగా షుగర్, బీపీతో బాధ పడుతున్నాడు. శుక్రవారం వ్యవసాయం పనుల నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి, మార్గమధ్యలో ఓ కల్వర్టు వద్ద పడిపోయాడు. కొన ఊపిరితో ఉన్న ఆయనను కుటుంబసభ్యులు ధర్మపురి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి, పల్స్ తెలియడం లేదని, ఈసీజీ తీయాలని చెప్పారు. కాసేపటికి మరోసారి పరీక్షించి, పల్స్ ఏమాత్రం లేదని, అయన పడిపోయిన చోటే మృతిచెంది ఉంటాడని అన్నారు. దీంతో బాధితులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దాస్పత్రి అని చెప్పే ఈ దవాఖానాలో కనీస వసతులు లేకపోవడం వల్లే రామయ్య చనిపోయాడని ఆరోపించారు. తర్వాత ఆస్పత్రిపై రాళ్లతో దాడి చేయగా కిటికీల అద్దాలు పగిలాయి. దవాఖానాలోని వస్తువులను చిందరవందర చేశారు. వైద్యం సిబ్బంది భయాందోళనకు గురై, పైఅంతస్తుకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామకృష్ణ, ఏఎస్‌ఐ రాజు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై వైద్యురాలు ఝాన్సీని వివరణ కోరగా రామయ్యను ఆస్పత్రికి తీసుకువచ్చారని, తాము పరీక్షించగా అతనికి ఏ మాత్రం పల్స్ లేదని తెలిపారు. హార్ట్ బీట్ చూడాలంటే ఆస్పత్రిలో ఈసీజీ సౌకర్యం లేదని చెప్పామన్నారు. మృతిచెందిన వ్యక్తిని తీసుకువచ్చారని పేర్కొన్నారు. మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని మృతుడి బంధువులు కోరితే ఇచ్చే హక్కు తమకు లేదని చెప్పామన్నారు. అయినప్పటికీ వినకుండా దాడికి పాల్పడ్డారని తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన చంద్రప్రకాశ్

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటకు చెందిన అలిశెట్టి చంద్రప్రకాశ్ తన బైక్‌పై శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని గోధూర్ వెళ్లాడు. తిరిగి వస్తుండగా ముత్యంపేట శివారులో ఎదురుగా అతివేగంగా దూసుకువచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రప్రకాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో బాధిత కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అతన్ని కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక



తిమ్మాపూర్(మానకొండూర్): అలుగునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్ 12వ తరగతి విద్యార్థిని నిజాం అస్మిత అండర్–19 బాలికల విభాగంలో ఎస్జీఎఫ్ జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపికైంది. గత నెల 26న వరంగల్ జిల్లా తొర్రూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, కాంస్య పతకం సాధించిందని ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్ తెలిపారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని నందియాడ్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అస్మితను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు, డైరెక్టర్లు వి.యు.ఎం.ప్రసాద్, అనుకర్‌రావు, రశ్మిత, ప్రసూన, వినోద్‌రావు శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆర్.నాగరాజు, పీఈటీలు తిరుపతి, శ్రీధర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి



మేడిపల్లి(జగిత్యాల): భీమారం మండలంలోని గోవిందారంలో భూపతి కొండమల్లయ్య అనే రైతుకు చెందిన సుమారు 20 గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందాయి. వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. గురువారం రాత్రి జీవాలను పాకలో ఉంచి, ఇంటికి వెళ్లానని, పొద్దున వచ్చి చూసేసరికి తీవ్ర గాయాలతో చనిపోయి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. సర్పంచ్ మధుకర్‌కు సమాచారం అందించగా వెటర్నరీ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, చనిపోయిన జీవాలను పరిశీలించారు. బాధితుడికి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

వ్యక్తికి గాయాలు

ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురి మండలంలోని దమ్మన్నపేటకు చెందిన జైశెట్టి నారాయణ శుక్రవారం రాత్రి ధర్మపురి నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో అడ్డు వచ్చిన కుక్కను ఢీకొట్టి, కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

17న అల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): గణిత శాస్త్రం చాలా ముఖ్యమైందని, వివిధ పోటీ పరీక్షలకు ఉపకరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో శ్రీనివాస రామానుజన్ జయంతి(డిసెంబర్ 22)ని పురస్కరించుకొని అల్ఫోర్స్ మాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్–2024 నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. శ్రీనివాస రామనుజన్ మన దేశం గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్త అని, ఆయన సేవలు మరువలేనివన్నారు. వాటిని విద్యార్థులకు తెలియజేయడానికి ఏటా రామానుజన్ జ్ఞాపకార్థం ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 17న(ఆదివారం) ఉదయం 10 గంటలకు రాష్ట్రంలోని వివిధ అల్ఫోర్స్ పాఠశాలల్లో, కళాశాలల్లో పరీక్ష ఉంటుందని తెలిపారు. మొదటి 3 స్థానాల్లో నిలిచిన వారికి 22న నిర్వహించే జాతీయ గణిత దినోత్సవంలో అతిథుల చేతులమీదుగా బహుమతి, నగదు పారితోషికం అందిస్తామని తెలిపారు. పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థికి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. దీనికి ఎటువంటి రుసుము ఉండదని, అల్ఫోర్స్ శాఖలు ఉన్న హైదారాబాద్, కరీంనగర్, జగిత్యాల, హన్మకొండ, వర్ధన్నపేట, వరంగల్, మంచిర్యాల, నిర్మల్, భైంసా, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్, కరీంనగర్‌లోని గోపాల్‌రావుపేటలో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ప్యాడ్, పెన్, పెన్సిల్, పాఠశాల నుంచి ధ్రువపత్రం లేదా ఐడీ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. విద్యాసంస్థల యాజమాన్యలు తమ విద్యార్థులకు సమాచారం అందించి, ప్రోత్సహించాలని కోరారు. మరిన్ని వివరాలకు 91602 94441, 93982 30614, 92469 34441 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రవి (ఫైల్)

మెట్‌పల్లిరూరల్/కథలాపూర్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి మండలంలోని రామలచ్చక్కపేటకు చెందిన ముదాం రవి(48) గతంలో కథలాపూర్, కోరుట్ల మండలాల్లో వీఆర్వోగా పని చేశాడు. ప్రభుత్వం వీఆర్వోలను పలు శాఖల్లో సర్దుబాటు చేయగా ఇతను కథలాపూర్ పీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసేవాడు. కడుపులో మంట కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. నెల రోజుల క్రితం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కుటుంబసభ్యులు మొదట మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రవి మృతి పట్ల రెవెన్యూ, వైద్యశాఖ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

కరెంట్ షాక్‌తో ఎలక్ట్రీషియన్..

కరీంనగర్ క్రైం: కరెంట్ షాక్‌తో ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలంలోని ఇరుకుల్లకు చెందిన రవి(23) నగరంలోని ఒక ప్రైవేట్ సంస్థలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. సప్తగిరికాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ఏసీని బుక్ చేసుకున్నాడు. శుక్రవారం దాన్ని ఫిట్ చేయడానికి రవి అతని ఇంటికి వెళ్లాడు. ఏసీని అమర్చుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బాధితుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని టూ టౌన్ పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని తనయుడి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)



రాజమల్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మధుసూదన్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేటకు చెందిన ఆవునూరి శ్రీనివాస్(27) తరచూ సెల్‌ఫోన్‌తో ఆడుతుండటంతో తల్లి మందలించింది. దీంతో అతను ఫోన్ పగులగొట్టి, క్షణికావేశంలో పొలం వద్దకు వెళ్లి, క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. మృతుడి తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు.

మద్యంలో మత్తులో ఒకరు..

ముత్తారం(మంథని): మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్‌కు చెందిన బొమ్మిల్ల రాజమల్లు(55) భార్య గతంలోనే చనిపోయింది. అప్పటి నుంచి అతను మద్యానికి బానిసయ్యాడు. ఆ మత్తులోనే శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. కాసేపటికి కుటుంబసభ్యులు ముత్తారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తమ్ముడు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రాజన్న ఆశీస్సులు ఎవరికో?



వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం

- బాక్సుల్లో భవితవ్యం భద్రం
- లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..
- వేములవాడలో నువ్వా ? నేనా ?

వేములవాడ: వేములవాడ అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. సీట్ల కేటాయింపు, టికెట్ల పంపకం మొదలుకొని ఎన్నికల వరకు ఆయా పార్టీల్లో నాయకులు, ముఖ్య కార్యకర్తల్లో టెన్షన్ మొదలైంది. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రమేశ్‌బాబుకే టికెట్ వస్తుందని ముందుగా ప్రచారం జరిగింది. అంతకంటే ముందే బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని వేములవాడలో ఏర్పాటు చేసి తన స్వచ్ఛంద సంస్థ పేరుతో సేవలందిస్తూ చల్మెడ లక్ష్మీనర్సింహారావు జనంలోకి వెళ్లారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ రమేశ్‌బాబును తప్పించి చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు టికెట్ కేటాయించారు. ఇక బీజేపీలోనూ టికెట్లు ఆశించిన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. చివరికి మూడో జాబితాలో తుల ఉమ పేరును ఖరారు చేశారు. కానీ నామినేషన్ల చివరి రోజున మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు తనయుడు చెన్నమనేని వికాస్‌రావుకు బీఫామ్ ఇవ్వడంతో తుల ఉమ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇక బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి టికెట్ ఆశించిన డాక్టర్ గోలి మోహన్ బీఎస్పీలో చేరి బరిలో నిలిచారు. ఇలా నాలుగు పార్టీల నుంచి అభ్యర్థులు వేములవాడ నియోజకవర్గంలో పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఆది శ్రీనివాస్ పేరు ముందు నుంచే వినిపించడంతో ఆయన అందరికంటే ముందుగానే ప్రచారం ప్రారంభించారు.

లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు

నియోజకవర్గంలో ఓటింగ్ సరళిని శుక్రవారం ఉదయం నుంచి ఆయా పార్టీల అభ్యర్థుల తమ అనుచరులతో చర్చించడం మొదలుపెట్టారు. ఓటింగ్ సరళి, తమకొచ్చే ఓట్లపై లెక్కలేసుకుంటున్నారు. ఏ మండలం, ఏ గ్రామంలో ఎలా పోలింగ్ జరిగిందో బేరీజు వేసుకుంటున్నారు. వేములవాడలో గెలుపోటములపై జోరుగా చర్చ సాగుతోంది. ఓటర్లు సానుభూతికి మద్దతు తెలుపుతారా? డబ్బుల వైపు మొగ్గుతారా? అనే చర్చ ఊపందుకుంది. నియోజకవర్గంలోని ఆయా మండలాల ఓటింగ్ సరళిని చూస్తూనే వేములవాడటౌన్ ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపితే వారిదే విజయమంటూ చర్చించుకుంటున్నారు.

ఫలితాలపై బెట్టింగ్‌లు

ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపుపై జోరుగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. తమ పార్టీ అభ్యర్థే గెలుస్తాడంటే.. కాదు కాదు తమ పార్టీ అభ్యర్థే గెలుస్తాడంటూ.. బెట్టింగ్‌లు పెడుతున్నట్లు తెలిసింది.

నేడు లక్ష్మీనృసింహుని రథోత్సవం

- దేవునిపల్లిలో ఏర్పాట్లు పూర్తి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి శ్రీలక్ష్మీనృసింహుని రథోత్సవం శనివారం జరగనుంది. ఇక్కడికి మన రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరానున్నారు. ఇక్కడి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయన్న నమ్మకం భక్తుల్లో ఉంది. రథోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ శంకరయ్య, సర్పంచ్ రాయిశెట్టి కిషన్ తెలిపారు. పెద్దపల్లి–గోదావరిఖని మార్గంలోని అందుగులపల్లి స్టేజి వద్ద నుంచి ఆలయానికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా బసంత్‌నగర్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.




నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని సాయినగర్‌లో గల విజయగణపతి సాయిబాబా ఆలయంలో జరుగుతున్న నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్థాపిత దేవతా పూజలు, హోమాలు, సాయంత్రం ధాన్యఫల పుష్ప, శయ్యాధివాసములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్తలు ప్రకాశ్, చిట్టుమల్ల కొండయ్య, అయిందాల లక్ష్మయ్య, ఈవో మారుతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా నేడు శనివారం ఉదయం 10.35 గంటలకు యంత్ర, విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగనున్నాయి.

శ్రీమద్భాగవత సప్తాహ మహోత్సవం



కొత్తపల్లి: పట్టణంలో నవంబర్ 24 నుంచి శుక్రవారం వరకు భాగవత శ్రావణం త్రిదండి అహోబిల జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నరహరి నారాయణరెడ్డి సౌజన్యంతో భాగవత సప్తహ పూర్తి చేసుకుని రుక్మిణి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న జీయర్‌స్వామి హాజరయ్యారు. అహోబిల జీయర్ స్వామి చిన్న గుట్టపైకి వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి చిన్న జీయర్‌స్వామిని ఆలయ ప్రతిష్ఠకు తీసుకు వస్తానని తెలిపారు. ఈ ఉత్సవాల్లో నారాయణరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డి, గౌతమ్‌రావు, భోగ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్‌నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో శంకర్ శిల్పం



శంకర్ రూపొందించిన సద్దుల బతుకమ్మ సైకత శిల్పం

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌కు చెందిన సైకత శిల్పి రేవెల్లి శంకర్‌కు ఒడిస్సా రాష్ట్ర టూరిజం శాఖ నిర్వహించే ఇంటర్ నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు రెండోసారి అరుదైన అవకాశం లభించింది. ఇందులో భాగంగా శుక్రవారం కల్చర్ అండ్ హెరిటేజ్ విభాగంలో తెలంగాణ రాష్ట్ర పండుగ సద్దుల బతుకమ్మ వేడుక ఉట్టిపడేట్లు సైకత శిల్పాన్ని శంకర్ రూపొందించి అభినందనలు అందుకున్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ అండర్-14 జిల్లాస్థాయి సెలక్షన్స్

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో శనివారం పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14 బాలబాలికల ఖోఖో సెలక్షన్స్, అండర్-14, 17 బాలబాలికల బాస్కెట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 10 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. ఫొటోతో కూడిన ఎలిజిబులిటీ సర్టిఫికెట్, ఆ ఫొటోపై హెడ్మాస్టర్ సంతకం ఉండాలని, స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారు ఈనెల 4న పెద్దపల్లిలో జరిగే అండర్-14 ఖోఖో బాలబాలికల ఉమ్మడి జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

పేదకుటుంబానికి ఆర్థిక సాయం



జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన నూతికాడి విజయ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గ్రామానికి చెందిన కొందరు యువకులు కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించారు. రూ.16 వేలు సేకరించి శుక్రవారం రాత్రి అందజేశారు. ఈసందర్భంగా విజయ ఆర్థికసాయం చేసినవారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యువకులు మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

పారిశుధ్యంపై పట్టింపేది..!

- నగరంలో జాడ లేని ఫాగింగ్
- కాలనీల్లో దోమల బెడద
- పెరుగుతున్న వ్యాధులు



ఏడో డివిజన్ పరిధిలో రోడ్డు పక్కన చెత్తాచెదారం

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో దోమలు విజృంభిస్తున్నాయి. కిందిస్థాయి ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం పేరుకుపోయాయి. డ్రైనేజీలు మినీ డంప్‌యార్డుల్లా మారాయి. ఫలితంగా దోమలు పుట్టుకొస్తున్నాయి. కాలనీల్లో దోమల బెడద ప్రజలను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దీంతో వ్యాధులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. డెంగీ లాంటి ప్రమాదకర వ్యాధులు కూడా అక్కడక్కడా వెలుగు చూస్తున్నాయి. డివిజన్‌లలో ఫాగింగ్ చేపట్టకపోవడంతో దోమలు వృద్ధి చెందుతూనే ఉన్నాయి. వ్యాధులు పెరుగుతూనే ఉన్నాయి.

అధ్వానంగా పారిశుధ్యం

నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా మారింది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో మరింత దిగజారిపోయింది. ఆయా డివిజన్‌లలో పారిశుధ్య కార్మికులు తిరుగుతున్నా, వారంతా కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతున్నారు. అందునా పైపైనే పనులు చేస్తున్నారు. చాలా చోట్ల చెత్తా చెదారం పూర్తిగా తొలగిపోవడం లేదు. డ్రైనేజీలు శుభ్రం చేయడానికి కనీసం పారిశుధ్య కార్మికులు రాని ప్రాంతాలు కూడా ఇప్పటివరకు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. దీంతో డ్రైనేజీల్లో మురుగునీరు నిలిచి, రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు పుట్టుకొస్తున్నాయి. నగరంలోని చాలా కాలనీల్లో వ్యాధులు పెరుగుతుండడంతో ప్రజలు ఆసుపత్రులకు వరుస కడుతున్నారు.

జాడ లేని ఫాగింగ్

దోమల నియంత్రణకు నగరపాలక సంస్థ వినియోగించాల్సిన ఫాగింగ్‌ల జాడ నగరంలో కనిపించడం లేదు. ఓ వైపు కాలనీల్లో దోమలు విజృంభిస్తుంటే, ఎక్కువ ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాము నగరంలో ఫాగింగ్ చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నా, ఆచరణలో మాత్రం కనిపించడం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అంతకుముందు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా ఇంటింటికీ మూడు నాలుగు సార్లు స్ప్రే చేయనున్నట్లు కూడా గతంలో నగరపాలకసంస్థ పేర్కొంది. కాని నాలుగైదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్కసారి కూడా స్ప్రే చేయని ఇళ్లు ఎన్నో ఉన్నాయి. దోమల నియంత్రణ లేకపోవడంతో నగరంలో మెల్ల మెల్లగా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికైనా ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ చేపట్టి, తమను వ్యాధుల బారి నుంచి కాపాడాలని నగరవాసులు అధికారులను కోరుతున్నారు.

మోదం.. ఖేదం

- కొన్ని కేంద్రాల్లోనే 90శాతానికి పైగా పోలింగ్
- గ్రామాల్లో పోటెత్తిన ఓటర్లు.. పట్టణాల్లో మారని తీరు
- 2018కి నేటికి తగ్గిన పోలింగ్ శాతం

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ఓటర్ల ఆసక్తి మోదం.. ఖేదమన్నట్లుగా సాగింది. కరీంనగర్ నియోజకవర్గంలో అత్యల్పంగా 63.23 శాతం పోలింగ్ నమోదవగా అత్యధికంగా మానకొండూరులో 83.21 పోలింగ్ శాతం నమోదైంది. ఇక హుజూరాబాద్‌లో 83.19, చొప్పదండిలో 77.77శాతం పోలింగ్ నమోదవగా ఆయా నియోజకవర్గాల్లోని పలు పోలింగ్ బూత్‌లు మాత్రం ఆదర్శంగా నిలిచాయి. 80నుంచి 92శాతం వరకు పోలింగ్ నమోదవడం ఆహ్వానించదగ్గ పరిణామం కాగా అత్యల్పంగా కేవలం 16.37 పోలింగ్ శాతమే నమోదవడం ఆందోళనకర పరిణామం. జిల్లా ఎన్నికల చరిత్రలో ఇంత తక్కువగా పోలింగ్ నమోదవడం ఇదే తొలిసారని అధికారులు చెబుతున్నారు.

ఇంత ఘోరమా

కరీంనగర్ నియోజకవర్గంలోని గుంటూరుపల్లివాసులు ఓటుకు దూరంగా ఉండటం శోచనీయం. కొత్తపల్లి పరిధిలోని గుంటూరుపల్లిలో అత్యంత తక్కువగా పోలింగ్ నమోదైంది. 126 పోలింగ్ బూత్‌లో 904 మంది ఓటర్లు ఉండగా 222 పురుషులు, 682 మహిళలు ఓటర్లుగా ఉండగా కేవలం 148 మంది మాత్రమే ఓటు వేశారు. ఇందులో 34 మంది పురుషులు కాగా 114మంది మహిళలు ఉన్నారు. ఇక హుజూరాబాద్‌లో అత్యల్పంగా 170 జమ్మికుంట పోలింగ్ బూత్ లో 645 ఓటర్లకు గానూ 391 మంది ఓటు వేయగా 60.6శాతం, మానకొండూరు నియోజకవర్గంలో అత్యల్పంగా 160 రామకృష్ణాకాలనీ పోలింగ్ బూత్‌లో 58.72శాతం పోలింగ్ నమోదవగా 1061 ఓటర్లకు గానూ 623 మంది ఓటేశారు. అలాగే చొప్పదండి నియోజకవర్గంలో 252 కొడిమ్యాల పోలింగ్ బూత్‌లో 60.98శాతం పోలింగ్ నమోదవగా 528 ఓటర్లకు గానూ 322 మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఆ గ్రామాలు.. 80- 90శాతంపైనే

కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పోలింగ్ 80-90శాతం పోలింగ్ నమోదవడం శుభ పరిణామం. దేశ్‌రాజ్‌పల్లి, గునిపర్తి, గూడూరు, లస్మక్కపల్లి, కల్వల, సోమారంపేట, పారువెల్ల, కొండాపూర్, గోపాల్‌పూర్, తిరుమలపూర్, వెలిచాల, షానగర్ గ్రామాల్లో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది.

కరీంనగర్ నియోజకవర్గంలో..

100 నల్లగుంటపల్లి పోలింగ్ బూత్‌లో 92.08శాతం పోలింగ్ నమోదైంది. 467 మంది ఓటర్లకు గానూ 430 మంది ఓటు వేశారు. 95 తాహెర్ కొండాపూర్ పోలింగ్ కేంద్రంలో 90.97శాతం పోలింగ్ నమోదవగా 432 ఓటర్లకు గానూ 393 మంది ఓటు వేశారు. 107 గోపాల్‌పూర్ పోలింగ్ బూత్‌లో 614 మందికి గానూ 551 మంది ఓటు వేయగా 89.74శాతం పోలింగ్ నమోదైంది.

మానకొండూర్‌లో...

128 కల్వల పోలింగ్ బూత్‌లో 337 మంది ఓటర్లకు గానూ 309 ఓటు వేయగా 91.69శాతం పోలింగ్ నమోదైంది. 314 సోమారంపేట పోలింగ్ బూత్‌లో 575 మంది ఓటర్లకు గానూ 524 మంది ఓటు వేయగా 91.13 పోలింగ్ శాతం నమోదైంది. 210 పారువెల్ల పోలింగ్ బూత్‌లో 90.89 శాతం పోలింగ్ నమోదవగా 472 మందికి గానూ 429 మంది ఓటు వేశారు.

హుజూరాబాద్‌లో..

107 లస్మక్కపల్లి పోలింగ్ బూత్‌లో 91.60శాతం పోలింగ్ నమోదవగా 598 మందికి గానూ 548 మంది ఓటు వేశారు. 72 ధర్మస్‌పల్లి పోలింగ్ బూత్‌లో 91.50శాతం పోలింగ్ జరగగా 1059 మంది ఓటర్లకు గానూ 969 మంది ఓటు హక్కు వినియోగించారు. 281 గునిపర్తి పోలింగ్ బూత్‌లో 657 మందికి గానూ 594 మంది ఓటు హక్కు వినియోగించగా 90.40శాతం పోలింగ్ నమోదైంది.

చొప్పదండిలో..

319 గొర్రెగుండెం పోలింగ్ బూత్‌లో 88.45శాతం పోలింగ్ నమోదవగా 251 మంది ఓటర్లకు గానూ 222 మంది ఓటు వేశారు. 90 షానగర్ పోలింగ్ కేంద్రంలో 741 మంది ఓటర్లకు గానూ 618మంది ఓటు వేయగా 85.95శాతం పోలింగ్ నమోదైంది. 20 చరపల్లి పోలింగ్ కేంద్రంలో 85.15శాతం పోలింగ్ నమోదవగా 532కి గానూ 453 మంది ఓటు వేశారు.

మైనార్టీల ఓట్లెవరికో..?

- అభ్యర్థుల మల్లగుల్లాలు
- కరీంనగర్ నాయకుల లెక్కలు

కరీంనగర్: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయగల మైనార్టీ ఓట్లపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నియోజక వర్గంలో మొత్తం 3,55,054 మంది ఓటర్లు ఉండగా అందులో 66 వేల పైచిలుకు మంది ముస్లిం ఓటర్లు ఉన్నారు. వీరు కాకుండా క్రిస్టియన్లు, సిక్కులు, ఇతరులు కలిపి మరో 12 వేల మంది వరకు ఉన్నారు. గురువారం జరిగిన పోలింగ్‌లో నియోజకవర్గంలో 3,55,054 ఓట్లకు 2,24,504 ఓట్లు పోలయ్యాయి. ముస్లిం మైనార్టీలకు సంబంధించి 78 వేల ఓట్లల్లో 70 శాతం పోలైన 52 వేల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఒక అంచనా. మైనార్టీలు ముస్లింల ఓట్లు ఒకే పార్టీకి పడే అవకాశం ఉండటంతో ఈ ఓట్లపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ముస్లింలు ఏ పార్టీ వైపు మొగ్గుచూపారో అన్న చర్చ హట్‌టాపిక్‌గా మారింది. ఓటు హక్కు వినియోగించుకున్న 52 వేల పైచిలుకు మందిలో ఏ పార్టీకి ఎక్కువ ఓట్లు వేశారనే సందిగ్ధంలో అభ్యర్థులు మల్లగుల్లాలు పడుతున్నారు. అంచనా ప్రకారం పోలైన 52 వేల ఓట్లల్లో 35వేల పైచిలుకు ఓట్లు బీఆర్‌ఎస్‌కే పడుతాయని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. మిగతా 17వేల ఓట్లు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పడుతాయనే అంచనాల్లో మూడు పార్టీల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్లల్లో చేపట్టిన సంక్షేమ పథకాలు ముస్లిం మైనార్టీ వర్గాల్లో గడపగడపకూ అందాయని బీఆర్‌ఎస్ నాయకులు తెలుపుతుండగా, కాంగ్రెస్ హయంలోనే 4 శాతం రిజర్వేషన్ ఇచ్చామని ముస్లిం మైనార్టీలకు వెన్నుదన్నుగా నిలిచింది కాంగ్రెస్ పార్టీయేనని కాంగ్రెస్ నాయకులు అంచనా వేసుకుంటున్నారు. ముస్లిం ఓట్ల చీలికపై బీజేపీ ఆశలు పెంచుకుంది. త్రిపుల్ తలాక్‌తో పాటు బీజేపీ చేపట్టిన కార్యక్రమాలతో మైనార్టీల మద్దతు బీజేపీకి ఉందని బీజేపీ నాయకులు విశ్వసిస్తున్నారు. దీంతో కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గం ఫలితం హట్ టాపిక్‌గా మారింది,

కరీంనగర్ మండలంలో 74శాతం పోలింగ్

- అత్యధికంగా నల్లగుంటపల్లి
- అత్యల్పంగా గుంటూరుపల్లిలో నమోదు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 74.91శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం పోలైన ఓట్లు, పోలింగ్‌స్టేషన్ల వారీగా పోలైన ఓట్ల వివరాలను మండల తహసీల్దార్, ఎన్నికల సహాయ అధికారి నవీన్ శుక్రవారం ప్రకటించారు. కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం 390 పోలింగ్ కేంద్రాలుండగా.. కరీంనగర్ మండల పరిధిలో పోలింగ్ కేంద్రం 62 నుంచి 127 వరకు మొత్తం 69 కేంద్రాలున్నాయి. మండలంలోని 17 గ్రామపంచాయతీలతో పాటు కార్పొరేషన్‌లో విలీనమైన ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ పరిధిలో మొత్తం ఓట్లు 53,802 కాగా పురుషులు 26,619, మహిళలు 27,181, థర్డ్‌జెండర్ 2 ఉన్నారు. గురువారం నిర్వహించిన పోలింగ్‌లో మొత్తం 40,303 ఓట్లు పోల్ కాగా పురుషులు 20,167, మహిళలు 20,135 మంది, నగునూరులో థర్డ్‌జెండర్ వైష్ణవి ఉన్నారు. అత్యధికంగా నల్లగుంటపల్లి పోలింగ్ కేంద్రంలో 467 మంది ఓటర్లకు 430 మంది ఓట్లు వేయగా 92.08శాతం నమోదైంది. అదేవిధంగా తాహెర్‌కొండాపూర్ పోలింగ్ కేంద్రం 95లో 432 మంది ఓట్లకు 393 పోల్ కావడంతో 90.97శాతంగా నమోదైంది. అత్యంత తక్కువగా గుంటూరుపల్లిలోని పోలింగ్ కేంద్రం 125లో 739 ఓట్లకు 272 ఓట్లతో 36.81శాతం, పోలింగ్ కేంద్రం 126లో 904 ఓట్లకు 148 ఓట్లు పోల్ కాగా 16.37శాతంగా నమోదైంది. అయితే గుంటూరుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఈ పోలింగ్ కేంద్రాలకు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న రజ్వీచమన్, సిటిజన్ కాలనీ, ప్రియదర్శినీకాలనీ, శ్రీపురం కాలనీ, సెల్ఫీ నగర్ కాలనీవాసుల ఓట్లున్నాయి. అయితే ఆయా కాలనీలు దూరంగా ఉండటంతో ఓటేసేందుకు ఆసక్తి చూపించలేదు. అంతేకాకుండా పలువురు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌దేశాలకు వలసవెళ్లారు.

అంకెల పదనిసలు

- ఓటింగ్‌లో భళారే సంఖ్యలు
- 333లు అధికం

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికలో సిత్రాలు చోటుచేసుకున్నాయి. అంకెల చిత్రాలు విస్తుగొల్పాయి. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాల్లో మొత్తం 1,338 పోలింగ్ కేంద్రాలుండగా పలు కేంద్రాల్లో నమోదైన ఓటింగ్ సంఖ్య మూడు ఒకే అంకెల్లో ఉండటం విశేషం. కొత్తగా ప్రకటించిన ఓటర్ల సంఖ్యలోనూ ఏక అంకెల పదనిసలు ఆసక్తి కలిగించాయి. 333 సంఖ్యలు అధికంగా ఉండగా మొత్తం ఓటర్ల సంఖ్యలోనూ ఒకే సంఖ్యలున్నాయి. ఒకసారి వాటిని పరికిస్తే..

పోలింగ్ కేంద్రం	గ్రామం	ఒకే అంకెలు
కరీంనగర్ నియోజకవర్గం		
190	సుబాష్‌నగర్	333 (మహిళలు)
286	కశ్మీర్‌గడ్డ	222 (పురుషులు)
హుజూరాబాద్ నియోజకవర్గం		
57	రాంపూర్	777 (పురుషులు)
90	కోర్కల్	333 (మహిళలు)
మానకొండూరు నియోజకవర్గం		
39	కొండపల్కల	111 (మహిళలు)
51	ఖాదర్‌గూడెం	333 (పురుషులు)
96	ఎరుకల గూడెం	444 (మహిళలు)
98	ఎరడపల్లి	222 (మహిళలు)
146	ఎల్‌ఎండీ కాలనీ	333 (పురుషులు)
చొప్పదండి నియోజకవర్గం		
49	గట్టుబూత్కూర్	222 (మహిళలు)
73	తిరుమలాపూర్	333 (పురుషులు)
141	చొప్పదండి	333 (పురుషులు)
155	ఇప్పనపల్లి	333 (పురుషులు)
253	కొడిమ్యాల	222 (మహిళలు)
256	కొడిమ్యాల	333 (మహిళలు)

యాసంగి పంటల సాగుకు సన్నద్ధం

- నారుమడులు దున్నుతున్న రైతాంగం
- తక్కువ పంటకాలమున్న వరిసాగుకే మొగ్గు



ఇరుకుల్లలో నారుమడి



నగునూరులో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. 15 రోజుల నుంచి నారుమడుల కోసం పొలం దున్నుతున్నారు. వడ్లు నానాపెట్టి మండె పోస్తున్నారు. వానాకాలం సీజన్ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన పలువురు రైతులు యాసంగిలో సాగునీటి సమస్య ఏర్పడుతుందనే ఉద్దేశ్యంతో ముందస్తుగా వరిపంటను సాగు చేస్తున్నారు. తక్కువ పంటకాలం 115 నుంచి 120 రోజుల వరకు పంట చేతికొచ్చే వరివంగడాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎస్సారెస్పీ నీరు విడుదల చేసే అవకాశం ఉండటంతో రైతులందరూ వరిపంటనే సాగు చేసేందుకు నార్లు పోస్తున్నారు.

వరిపంటకే ప్రాధాన్యం

కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే యాసంగి సీజన్ వ్యవసాయ పనులను రైతులు ప్రారంభించారు. వానాకాలంలో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయినప్పటికీ పలువురు రైతులు యాసంగిలో వరిపంటనే సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. వ్యవసాయ బావుల్లో ఉన్న నీటికి తోడుగా ఎస్సారెస్పీ నీటి సరఫరాపై ఆశతో వరి సాగుకే ముందుకొస్తున్నారు. గతేడాది 12వేల ఎకరాల్లో వరిపంటను వేయగా ప్రస్తుతం 13వేల ఎకరాల వరకు సాగు చేసే అవకాశముంది. గతంలో యాసంగిలో వరిపంటకు బదులుగా ఆరుతడి పంటలను రైతులు సాగు చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే సాగునీరు పుష్కలంగా ఉండటంతో పాటు కోతుల బెడద కారణంగా ఆరుతడి పంటలను సాగుచేయడం లేదు.

విత్తన శుద్ధి తప్పకుండా చేయాలి

వరివంగడాలను మండె పోసేటప్పుడు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. ఐఆర్-64, ఎంటీయూ1121, కేఎస్‌ఎం-118, 1638, ఎంటీయూ-1010, జేజీఎల్-24423 తదితర వరి వంగడాలను సాగు చేయవచ్చు. నారు పోసేటప్పుడు విత్తనాలను డ్రమ్ సీడర్ లేదా నేరుగా వెదజల్లే విధానాలను పాటించాలి. మధ్యకాలిక, స్వల్పకాలిక రకాలను డిసెంబరు 15 వరకు నార్లు పోసుకునే అవకాశముంది.

– స్వర్ణలత, ఏఈవో, మొగ్దుంపూర్ క్లస్టర్

రాజన్న కోడెలకు పశుగ్రాసం



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన రైతు ఎడవెల్లి వెంకటరమణారెడ్డి వరిగడ్డిని కట్టలు కట్టించి వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం కోడెలకు సొంత ట్రాక్టర్‌లో తీసుకెళ్లి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిత్య జనగణమన కమిటీ అధ్యక్షుడు ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



జమ్మికుంట: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని పట్టణ, మండలంలోని ఉప కేంద్రాల్లో శుక్రవారం వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ కుడిసియా పర్యవేక్షణలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు మహోన్నత పటేల్, హిమబిందు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

‘ఐబీ’ అడుగులు

విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ దిశా నిర్దేశం

- సర్కారు స్కూళ్లలో విద్యార్థులకు ఫ్యూచర్‌ స్కిల్స్‌.. పాఠ్య ప్రణాళికలో ఆర్థిక పాఠాలకు ప్రాధాన్యం
- అంతర్జాతీయంగా రాణించేలా విదేశీ భాషలు కూడా
- ‘ఐబీ’ బోధనా విధానాలపై వచ్చే ఏడాది టీచర్లకు ట్రైనింగ్‌
- 2025–26లో ఒకటో తరగతితో ఐబీ ప్రారంభించి.. ఆపై ఏటా ఒక్కో తరగతిలో దశలవారీగా అమల్లోకి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించేందుకు అవసరమైన తర్ఫీదు స్కూళ్ల స్థాయి నుంచే అందించాలని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. అందుకు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా విద్యార్థులకు ఫ్యూచర్‌ స్కిల్స్‌ నేర్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇంటర్నేషనల్‌ బాకలారియేట్‌ (ఐబీ) సిలబస్‌ అమలుకు సన్నద్ధం కావాలని, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఏపీ ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఐబీ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ప్రవేశపెట్టి ఆ తరువాత ఏడాది రెండో తరగతికి, ఆపై దశలవారీగా మిగతా తరగతులకు విస్తరించాలని సూచించారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని నిర్దేశించారు. ఈమేరకు విద్యాశాఖపై శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో సీఎం జగన్‌ పలు కీలక సూచనలు చేశారు. పాఠ్య ప్రణాళికలో ఆర్థిక పాఠాలను అంతర్భాగం చేయాలన్నారు. హైస్కూల్‌ స్థాయిలో ప్రతి తరగతిలోనూ ఇంటరాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ) అందుబాటులో ఉండాలన్నారు. టోఫెల్‌ అమలు తీరు మరింత మెరుగ్గా ఉండాలని సూచించారు. దేశవ్యాప్తంగా సగటున 37.03 శాతం మంది ఇంగ్లిష్‌ మీడియంలో పరీక్షలు రాస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో 84.11 శాతం మంది ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. మిగిలిన పిల్లలను కూడా ప్రోత్సహిస్తూ వంద శాతం ఇంగ్లీష్‌ మీడియంలో పరీక్షలు రాసేలా సిద్ధం చేయాలని సీఎం సూచించారు. నాడు–నేడు రెండో దశ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేయండి



10 రోజుల పాటు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం

- 17 నుంచి జనవరి 14 వరకు సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై సేవ
- టీటీడీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి కాషన్‌ డిపాజిట్‌ రిఫండ్‌ ట్రాకర్‌
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని డిసెంబర్‌ 23 నుంచి జనవరి 1 (10 రోజులు) వరకు కల్పించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్‌ యువర్‌ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తిరుపతి, తిరుమలలోని 10 కేంద్రాల్లో డిసెంబర్‌ 22 నుంచి 4,23,500 టోకెన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. తిరుపతిలోని ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్‌, విష్ణు నివాసం కాంప్లెక్స్‌, భూదేవి కాంప్లెక్స్‌, శ్రీ గోవిందరాజస్వామి రెండో సత్రం, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్‌ పల్లి, జీవకోనలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, తిరుమలలో స్థానికుల కోసం కౌస్తుభం విశ్రాంతి గృహం వద్ద టోకెన్లు ఇవ్వనున్నట్లు వివరించారు. టోకెన్లు ఉన్నవారిని మాత్రమే శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 22 నుంచి 24 వరకు, డిసెంబర్‌ 31, జనవరి 1న కల్యాణోత్సవం, ఊంజల్‌ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను రద్దు చేసినట్లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 9–11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామిని స్వర్ణ రథంపై మాడ వీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. వైకుంఠ ద్వాదశి నాడు శ్రీవారికి ఉదయం 4.30 గంటలకు చక్రస్నానం నిర్వహిస్తామని చెప్పారు. ధనుర్మాసం సందర్భంగా ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై పఠనాన్ని నిర్వహిస్తామని చెప్పారు. తిరుమలలో గదులు పొందిన భక్తులు కాషన్‌ డిపాజిట్‌ స్థితిని తెలుసుకునేందుకు టీటీడీ వెబ్‌సైట్‌లో కాషన్‌ డిపాజిట్‌ రిఫండ్‌ ట్రాకర్‌ను పొందుపరిచినట్లు చెప్పారు.

శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ మండవ కిరణ్మయి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు.



ఆలయం వెలుపల జస్టిస్‌ మండవ కిరణ్మయి

డాక్టర్‌ వైఎస్సార్‌ రంగస్థల పురస్కారాలు..

- డిసెంబర్‌ 10లోగా దరఖాస్తులు పంపాలి
- రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటకరంగ

సాక్షి, అమరావతి: ఈ ఏడాది నుంచి ‘డాక్టర్‌ వైఎస్సార్‌ రంగస్థల పురస్కారం’ పేరుతో నాటక సమాజాల ప్రోత్సాహానికి ఏటా ఓ అవార్డును అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌, సమాచార పౌరసంబంధాల శాఖ ఎక్స్‌ అఫీషియో సెక్రటరీ తుమ్మ విజయకుమార్‌ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నాటక రంగంపై ఆసక్తిగల కళాప్రియులకు వేదిక కల్పించి, ఆ రంగం వృద్ధికి గణనీయమైన కృషి చేసిన సమాజాలు, పరిషత్తులకు రూ. 5,00,000, వైఎస్సార్‌ ప్రతిమ మెమెంటోను ప్రభుత్వం అందజేయనుంది. నంది నాటకోత్సవాల సందర్భంగా అదే వేదికపై వ్యక్తిగత స్థాయిలో నాటక రంగంలో విశేష కృషి చేసిన నటులకు, కళాకారులకు ‘ఎన్టీఆర్‌ రంగస్థల పురస్కారం’ పేరుతో అవార్డు ప్రదానం చేయనుంది. కాగా మొదటిసారి ఈ రంగంలో సమష్టి కృషితో (టీమ్‌వర్క్‌) పని చేసిన సమాజాలకు, పరిషత్తులకు గుర్తింపు లభించనుంది. ‘ఎన్టీఆర్‌, డాక్టర్‌ వైఎస్సార్‌ రంగస్థల పురస్కారాలకు’ అర్హులైన వ్యక్తులు, సమాజాలు, పరిషత్తులు ఆన్‌ లైన్‌ ద్వారా తమ దరఖాస్తులను డిసెంబర్‌ 10వ తేదీ లోగా పంపాలి. తగు ధృవ పత్రాలు జతచేసిన దరఖాస్తులు డిసెంబర్‌ 18వ తేదీలోగా మేనేజింగ్‌ డైరెక్టర్‌, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ, ఆర్‌.టి.సి. కాంప్లెక్స్‌, ఎన్టీఆర్‌ అడ్మినిస్ట్రేటివ్‌ బ్లాక్‌, 4వ ఫ్లోర్‌, విజయవాడ–520013 చిరునామాకు చేరేట్టుగా పంపాలి.

కోస్తాంధ్రపై మిచాంగ్‌ తుపాను పడగ!

5న నెల్లూరు–మచిలీపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం

సాక్షి, విశాఖపట్నం/ సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను కోస్తాంధ్రపై పడగ విప్పనుంది. రాయలసీమలోనూ పెను ప్రభావం చూపనుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోంది. తుపాను ప్రభావిత జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది.

నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం శుక్రవారం రాత్రికి నెల్లూరుకు ఆగ్నేయంగా 790, బాపట్లకు దక్షిణ ఆగ్నేయంగా 860, మచిలీపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 850 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ శనివారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారనుంది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తుపానుగా బలపడుతుంది. ఆపై వాయవ్య దిశగా పయనిస్తూ ఈనెల 4వ తేదీకి దక్షిణ కోస్తాంధ్ర తీరానికి చేరుకుంటుంది. అనంతరం ఉత్తర దిశగా కదులుతూ ఐదో తేదీ ఉదయం నెల్లూరు – మచిలీపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న రెండు రోజులు గంటకు 50 నుంచి 60 కి.మీలు, తీరాన్ని దాటే సమయంలో గంటకు 80–90 కి.మీలు, గరిష్ఠంగా 100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఈ తుపానుకు మయన్మార్‌ సూచించిన ‘మిచాంగ్‌’గా నామకరణం చేయనున్నారు.



తుపాను గమ్యాన్ని తెలిపే సైక్లోన్‌ట్రాక్‌

భారీ నుంచి అతి భారీ వర్షాలు

తుపాను ప్రభావం శనివారం నుంచి మొదలై ఈ నెల ఐదో తేదీ వరకు కొనసాగనుంది. శనివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురవనున్నాయి. మూడో తేదీన పశ్చిమ గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, ఎస్పీఎస్సార్‌ నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్‌, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్‌ జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. 4వ తేదీన పశ్చిమ గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఎస్పీఎస్సార్‌ నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, తిరుపతి జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, ఏలూరు, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్‌ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అన్నమయ్య, చిత్తూరు, వైఎస్సార్‌, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురవవచ్చని తెలిపింది. తుపాను తీరాన్ని దాటే 5వ తేదీన పశ్చిమ గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఏలూరు జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, కృష్ణా, ఎన్టీఆర్‌ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్‌ ఉందని పేర్కొంది.

కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు

తుపాను నేపథ్యంలో తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్టేట్‌ కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ ఎండీ బీఆర్‌ అంబేడ్కర్‌ తెలిపారు. ప్రజలు అత్యవసర సహాయం, వాతావరణ సమాచారం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్‌ కంట్రోల్‌ రూమ్‌ నంబర్లు **1070, 112, 18004250101** లో సంప్రదించాలని తెలిపారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు, ప్రత్యేక రైళ్ల పొడిగింపు

రైల్వేస్టేషన్‌(విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న ట్రాక్‌ నిర్వహణ పనుల కారణంగా డివిజన్‌ మీదుగా నడిచే పలు రైళ్లను పూర్తిగాను, పాక్షికం గాను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 4 నుంచి 17వ తేదీ వరకు కాకినాడ పోర్టు–విశాఖపట్నం (17267/17268), మచిలీపట్నం–విశాఖపట్నం (17219/17220), ఈ నెల 5 నుంచి 18 వరకు గుంటూరు–రాయగడ (17243/17244), బిట్రగుంట–విజయవాడ (07977/07978), విజయవాడ–తెనాలి (07279/07575), విజయవాడ–ఒంగోలు (07461/07575), విజయవాడ–గూడూరు (07500), విజయవాడ–గూడూరు (12744), ఈ నెల 4, 5, 6, 8 తేదీలలో విజయవాడ–విశాఖపట్నం (22702), ఈ నెల 9, 11, 12, 13 తేదీలలో విశాఖపట్నం–విజయవాడ (22701), ఈ నెల 4 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు–విశాఖపట్నం (17239/17240), ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు విశాఖపట్నం–గుంటూరు (17240), ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు, అదే విధంగా ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు బిట్రగుంట–చెన్నై సెంట్రల్‌ (17237/17238), ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు గూడూరు–విజయవాడ (07458/12743) రైళ్లు పూర్తిగా రద్దు చేశారు. కాగా, మచిలీపట్నం– విజయవాడ, నర్సాపూర్‌–విజయవాడ, విజయవాడ–భీమవరం మధ్య రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వేర్వేరు ప్రాంతాల నుంచి నడుపుతున్న పలు రైళ్లను పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 4 నుంచి 25వ తేదీ వరకు పూర్ణా–తిరుపతి (07609), ఈ నెల 5 నుంచి 26వ తేదీ వరకు తిరుపతి–పూర్ణా (07610), ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌–నర్సాపూర్‌ (07631), ఈ నెల 3 నుంచి 31వ తేదీ వరకు నర్సాపూర్‌–హైదరాబాద్‌ (07632), ఈ నెల 3 నుంచి 31వ తేదీ వరకు తిరుపతి–సికింద్రాబాద్‌ (07481), ఈ నెల 4 నుంచి 25వ తేదీ వరకు సికింద్రాబాద్‌–తిరుపతి (07482), ఈ నెల 1 నుంచి 29వ తేదీ వరకు కాకినాడ టౌన్‌–లింగంపల్లి (07445), ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరకు లింగంపల్లి–కాకినాడ టౌన్‌ (07446) రైళ్లను పొడిగించారు.

దోపిడీ, మాఫియా పాలనకు చరమగీతం

- ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంలో పోలీస్‌ యంత్రాంగం విఫలం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

కాగజ్‌నగర్‌టౌన్‌: తెలంగాణలో కేసీఆర్‌ కుటుంబ దోపిడీ, మాఫియా పాలనకు చరమగీతం పాడుతూ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వనున్నారని బహుజన్‌ సమాజ్‌ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, సిర్పూర్‌ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్‌ ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌ పట్టణంలో శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటూ అభివృద్ధి చేసే పార్టీలకు పట్టం కట్టనున్నారని స్పష్టం చేశారు. గురువారం పోలింగ్‌ ప్రారంభం కాగానే కొత్త సార్సాలలో ఎమ్మెల్యే అనుచరుడు బీఎస్పీ నాయకుడు ఇందూరి రవిపై మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్‌ చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. కాగజ్‌నగర్‌ పట్టణంలోని ఎమ్మెల్యే అనుచరులు పోలింగ్‌ బూత్‌ నంబర్లు 55, 56, 75, 90లను తమ అధీనంలోకి తీసుకుని యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. అడ్డుకున్న బీఎస్పీ పోలింగ్‌ ఏజెంట్లపై దాడికి పాల్పడ్డారని, అక్కడ బందోబస్తు చేసిన పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిర్పూర్‌ నియోజకవర్గంలో బీఎస్పీ గెలుపు ఖాయమని, రానున్న రోజుల్లో దౌర్జన్యాలకు పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతర కృషి చేస్తానని అన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంతో పోలీస్‌ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్‌ నేతలకు అనుకూలంగా వ్యవహరించిన ఈ ప్రాంత పోలీసులు తమ డ్రెస్‌లను మార్చుకుని గులాబీ డ్రెస్‌లు వేసుకోవాలని హితవు పలికారు. బీఎస్పీ రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్‌ హుస్సేన్‌, రాష్ట్ర కార్యదర్శి గణపతి, జిల్లా అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు, నాయకులు దుర్గం ప్రవీణ్‌, కౌన్సిలర్లు లావణ్య శరత్‌ ముదిరాజ్‌, మినాజ్‌ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

బాసర ట్రిపుల్‌ఐటీకి గ్రీన్‌ వర్సిటీ అవార్డు

భైంసా: నిర్మల్‌ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీకి క్యాప్‌–28 గ్రీన్‌జోన్‌ వర్సిటీ దక్కింది. పర్యావరణ పరిరక్షణ, గ్రీన్‌జోన్‌ ఏర్పాటు విభాగంలో ఈ అవార్డు దక్కిందని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ వెంకటరమణ తెలిపారు. దుబాయ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో యూఏఈ అధికారుల చేతుల మీదుగా వెంకటరమణ అవార్డు అందుకున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో 70 ఎకరాల విస్తీర్ణంలో చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన చర్యలను అధికారులు అభినందించినట్లు వీసీ వెల్లడించారు. ప్రతిష్టాత్మకమైన అవార్డు అందుకున్న ఇన్‌చార్జి వీసీ వెంకటరమణను పలువురు అభినందించారు.



గ్రీన్‌వర్సిటీ అవార్డు అందుకుంటున్న వీసీ వెంకటరమణ

‘మున్సిపల్‌’ మొద్దు నిద్ర



మినీ ట్యాంక్‌ బండ్‌పై ఏర్పాటు చేసిన జాతీయ జెండా చుట్టూ చెత్తాచెదారం



మద్యం సీసాలు



జెండా వద్ద చుట్టూ చెత్తాచెదారం



మెట్లపై మందుబాబులు తాగి వదిలేసిన మద్యం బాటిళ్లు



మినీ ట్యాంక్‌బండ్‌ గేట్‌ ముందు అడ్డంగా వాహనాలు

నిర్మల్‌ మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది మొద్దు నిద్రతో జిల్లా కేంద్రంలోని ధర్మసాగర్‌ చెరువు ఒడ్డున మినీ ట్యాంక్‌ బండ్‌పై ఏర్పాటు చేసిన 150 అడుగుల జాతీయ పతాకం అవమానానికి గురవుతోంది. జెండా చుట్టూ అపరిశుభ్ర వాతావరణంతో కంపు కొడుతోంది. జెండా గద్దె రాత్రివేళ మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం అక్కడ మద్యం సేవిస్తున్నవారు ఖాళీ సీసాలు, ఇతర వ్యర్థాలు అక్కడే వదిలేసి వెళ్తున్నారు. శుభ్రం చేయించాల్సిన మున్సిపల్‌ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. జెండా ఆవరణను చూసి పట్టణ ప్రజలు బల్దియా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌ నిర్మల్‌

‘సహకారం’లో మల్టీపర్పస్‌ సేవలు

- చిన్నకల్వల పీఏసీఎస్‌ ప్రత్యేకత
- రైతుల సేవల్లో ద్వితీయస్థానం

సంఘం సమాచారం

సంఘం సభ్యులు	2098
వాటాధనం(రూ.కోట్లలో)	151.35
నికరలాభం(రూ.లక్షల్లో)	71.41
రైతులకు అందించే డివిడెంట్‌(శాతంలో)	6

సుల్తానాబాద్‌రూరల్‌: చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మల్టీపర్పస్‌ సేవలు అందిస్తూ సంఘంతోపాటు సభ్యుల ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తోంది. ప్రధానంగా అత్యధిక వాటాధనం కలిగి, ఆర్థికంగా పురోగతి సాధిస్తూ జిల్లాలోనే రెండోస్థానంలో నిలిచింది. సొంతంగా నిధులు సమకూర్చుకుంటూ, విరివిగా రుణాలు మంజూరు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

కొద్దిమందితో ప్రారంభం..

- చిన్నకల్వల గ్రామంలోని చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొద్దిమంది రైతులతో ప్రారంభమైంది. ఇప్పుడు 2,098 మంది రైతుల సభ్యత్వం కలిగి ఉంది.
- మూలధన వాటా కింద రైతులు రూ,151.35 కోట్లు కలిగి ఉన్నారు. సంఘం ప్రస్తుత నికర లాభం రూ.71.41 లక్షలు ఉంది.
- సీజన్‌కు అనుగుణంగా యూరియా, డీఏపీ తదితర ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను రైతులకు రాయితీపై అందిస్తోంది.
- పీఏసీఎస్‌ పరిధిలో చిన్నకల్వల, చిన్నబొంకూర్‌, మియ్యాపూర్‌, నారాయణపూర్‌, కొదుపాక, దేవునిపల్లి గ్రామాలు ఉన్నాయి.



సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్‌బంక్‌

- సంఘం ద్వారా రుణాలు మంజూరు చేయడంతోపాటు రుణ వసూళ్లలో 85–90శాతం నమోదు చేస్తూ ముందంజలో నిలుస్తోంది.
- కామన్‌ సర్వీస్‌ సెంటర్‌(సీఎస్‌సీ) ప్రారంభించి అందరికీ సేవలు విస్తరిస్తోంది.

సంఘం మంజూరుచేసిన రుణాలు..

30 ట్రాక్టర్లు, 8 హార్వెస్టర్లతోపాటు 470మంది గొర్రెల పెంపకందారులకు సుమారు రూ.20 కోట్ల వరకు దీర్ఘకాలిక రుణాలు మంజూరుచేసింది. క్రాప్‌లోన్స్‌ కింద 910 మంది రైతులకు రూ.6.50 కోట్లు, సంఘం సొంత నిధుల నుంచి ద్విచక్ర వాహనాల కొనుగోళ్లకు 42 మందికి రూ.26 లక్షలు, చిరు వ్యాపారులకు రూ.20 వేల చొప్పున 32 మందికి రూ.10 లక్షల స్వల్పకాలిక రుణాలిచ్చి ఆదర్శంగా నిలుస్తోంది. గత వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కమిషన్‌ రూపంలో రూ.50 లక్షలు ఆర్జించింది.

ఆర్థికాభివృద్ధికి తోడ్పడిన అంశాలివే..

ఎమ్మెల్సీ నిధుల కింద రూ.10 లక్షలు, సొంత నిధులు రూ.5లక్షలతో నిర్మించిన సంఘానికి 200 మెట్రిక్‌ టన్నులు, 500 మెట్రిక్‌ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన ఆరు గోదాంలు కొదురుపాక, నారాయణపూర్‌, చిన్నబొంకూర్‌, మియ్యాపూర్‌, చిన్నకల్వలలో ఉన్నాయి. దేవునిపల్లిలో సంఘానికి చెందిన 15గుంటల ఖాళీ స్థలంలో కేడీసీసీబీ నుంచి రూ.10 లక్షలు, సీసీ లోన్‌ కింద రూ.15లక్షలతో పెంట్రోల్‌ బంక్‌ ఏర్పాటు చేశారు. విత్తన శుద్ధి కేంద్రం ఏర్పాటుకు కూడా ప్రణాళికలు రూపొందించారు.

విత్తనశుద్ధి కేంద్రం ఏర్పాటునకు కృషి



పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో విత్తనశుద్ధి కేంద్రం ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాం. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సహకారంతో సంఘం అభివృద్ధితోపాటు రైతులకు అన్నిసేవలు అందిస్తున్నాం. పాలకవర్గం నిర్ణయాలతో రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అందిస్తాం.

– మోహన్‌రావు, చైర్మన్‌, సింగిల్‌విండో

అందరి సహకారం



అందరి సహకారంతోనే సంఘం అభివృద్ధి చెందుతోంది.రుణాలు తీసుకున్న రైతులు.. సకాలంలో వాయిదాలు చెల్లించి అభివృద్ధికి తోడ్పడుతున్నారు. 100శాతం రుణాలు వసూలు చేస్తే జిల్లా సహకార సంఘం నుంచి ప్రోత్సాహం కింద రూ.50 వేలు ఇవ్వనున్నారు. దీనికి రైతులు అందరూ సహకరించాలి.

–వల్లకొండ రమేశ్‌, సీఈవో

సమ్మె విరమించిన కార్మికులు

- కార్మిక సంఘాల చర్చలు సఫలం
- పాతదారి కొనసాగించేందుకు అంగీకారం

గోదావరిఖని: జీడీకే 11గని కార్మికుల మెరుపు సమ్మెతో సింగరేణి యాజమాన్యం దిగివచ్చింది. నాయకుల జోక్యంతో జీడీకే–11గనికి వెళ్లే పాతదారిని పునరుద్ధరించేందుకు అంగీకరించింది. ఈనెల 11నుంచి పాత దారివెంట కార్మికులు డ్యూటీలకు వెళ్లివచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చింది. ఈలోగా రోడ్డు మరమ్మతులు, లైటింగ్‌ పనులు పూర్తి చేసేందుకు ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌ అంగీకరించారు. మూడురోజుల క్రితం డ్యూటీకి వెళ్తున్న సింగరేణి కార్మికుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కార్మికులు మెరుపు సమ్మెకు దిగిన విషయం విదితమే. కార్మికుల పక్షాన యూనియన్‌ నాయకులు యాజమాన్యంతో చర్చించినా ఫలితం కానరాలేదు. అయినా కార్మికులు వెనక్కి తగ్గక సమ్మె కొనసాగిస్తుండటంతో శుక్రవారం కార్మిక సంఘాల నేతలు చర్చలు జరిపారు. దారి కొనసాగించేందుకు అనుకూలంగా ఉండటంతో యాజమాన్యం పాతదారి వెంట ప్రయాణానికి అంగీకరించింది.

తగ్గనున్న దూరభారం

ఈనెల 11 నుంచి పాతదారి వెంట కార్మికులు ప్రయాణించేందుకు యాజమాన్యం అంగీకరించింది. దీంతో నిత్యం కార్మికులకు 12 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. నిత్యం పెట్రోల్‌, సమయం ఆదా కానుంది. జీడీకే–5 ఓసీపీ విస్తరణతో గోదావరిఖని నుంచి జీడీకే–11గనికి వెళ్లేందుకు సుందిళ్ల, ముస్త్యాల మీదుగా గనికి చేరుకోవాల్సి వస్తోంది. నూతన దారి వెంట 12 స్పీడ్‌ బ్రేకర్లు, ఆరు మూలమలుపులు ఉండటంతో నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు రోజుల కిందట విధులకు వెళ్తున్న కార్మికునిపై బొగ్గు పెళ్ల పడింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఆ కార్మికుడు కిందపడిపోయాడు. వెనకాలే వస్తున్న లారీ అతడిపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కార్మికులు ఆందోళనకు దిగారు.

యాజమాన్యంతో చర్చలు సఫలం..

కార్మిక సంఘాల నాయకులు, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌తో శుక్రవారం జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. ఈనెల 11 నుంచి పాత దారి వెంట సింగరేణి కార్మికులు ద్విచక్రవాహనాలతో గనికి వెళ్లేందుకు అంగీకరించారు. ఈవిషయాన్ని కార్మిక సంఘాల నేతలు గనిపై కార్మికులకు వివరించారు. దీంతో వారు సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. ఎట్టకేలకు దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపిన యాజమాన్యానికి కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. చర్చల్లో కార్మిక సంఘాల నాయకులు యాదగిరి సత్తయ్య, తుమ్మల రాజారెడ్డి, జనక్‌ప్రసాద్‌, మిర్యాల రాజిరెడ్డి, కె.విశ్వనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.



జీఎంతో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

ధన్యత



బట్టల తాత వచ్చాడోచ్

ఒరిస్సాలో ఏదో ఒక ఉదయం ఏదో ఒక మారుమూల పల్లెలో వ్యాన్ ఆగుతుంది. దానిని చూసిన వెంటనే పిల్లల కళ్లల్లో వెలుగు. కటిక దారిద్ర్యం వల్ల చలికాలమైనా వానాకాలమైనా ఒంటి నిండా బట్టలు లేని వారికి గగన్ బట్టలు పంచుతాడు. రిటైర్డ్ ఉద్యోగి అయిన పెయిటల్ గగన్ తన భార్యతో కలిసి ఊరూరా తిరిగి బట్టలు సేకరించి పంచుతాడు. పిల్లల పసినవ్వును ఆశీర్వాదంగా పొందుతాడు.

సంఘటనలు అందరికీ ఎదురవుతుంటాయి. కొందరు స్పందిస్తారు. కొందరు స్పందించరు. కొందరు ఆ సంఘటనలతో తమ లక్ష్యాన్ని, కర్తవ్యాన్ని తెలుసుకుంటారు. అలాంటి వారు ఆదర్శంగా నిలుస్తారు.

పదేళ్ల క్రితం– భువనేశ్వర్‌లో చిన్న పోస్టల్ ఉద్యోగైన గగన్ పెయిటల్ ఇంటికి వెళుతున్నాడు. అతనికి వాణి విహార్ రైల్వే స్టేషన్ దగ్గర ఒక దిక్కులేని మహిళ కనిపించింది. ఆమె చిరిగిన చీర కట్టుకుని ఉంది. గగన్ ఆమెను చూసి జాలిపడి హోటల్ నుంచి ఫుడ్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చాడు. కాని ఆమె 'అన్నం వద్దు. ముందు ఒక చీర ఇవ్వండి' అని ప్రాధేయపడింది. స్త్రీగా ఆమె అవస్థ గమనించిన గగన్ వెంటనే ఇంటికి వెళ్లి తన తల్లి పాత చీర తెచ్చి ఇచ్చాడు. 'దానిని అందుకుంటూ ఆమె ముఖంలో కనిపించిన సంతోషం అంతా ఇంతా కాదు. ఒంటికి తగిన బట్ట ఉంటేనే మనిషికి మర్యాద. అది లేని వారు ఈ దేశంలో ఎందరో ఉన్నారు. వారి కోసం ఏదైనా చేయాలి అని నిశ్చయించుకున్నాను' అంటాడు గగన్. ఉద్యోగంలో ఉండగా మొదలుపెట్టిన ఈ పనిని రిటైరయ్యాక కూడా కొనసాగిస్తున్నాడు.

చిన్న ఉద్యోగి అయినా

పోస్టాఫీసులో చిరుద్యోగిగా పని చేసి రిటైరైన గగన్ భువనేశ్వర్‌లో చక్కైసియాని ప్రాంతంలో నివసిస్తాడు. కొడుకు మృత్యుంజయ బలిగూడ అనే ఊళ్లో క్యాబ్ డ్రైవర్. కోడలు టీచర్‌గా పని చేస్తున్నది. ఇతర బాదరబందీలు లేని గగన్ తన భార్య అన్నపూర్ణకు తన ఆలోచన చెప్పాడు. 'మనం అందరికీ కొత్త బట్టలు ఇవ్వలేం. అలాగని అన్నేసి పాత బట్టలూ ఉండవు. కాబట్టి సేకరించి పంచుదాం' అన్నాడు. అన్నపూర్ణ అతనికి సహరించడానికి అంగీకరించింది. ఆ రోజు నుంచి గగన్ తనకు ఖాళీ ఉన్నప్పుడల్లా భువనేశ్వర్‌లోని అపార్ట్‌మెంట్లకూ హౌసింగ్ కాలనీలకు తిరిగి వాడిన దుస్తులను సేకరిస్తాడు. అవసరమైతే కటక్ వంటి ఇతర పట్టణాలకు కూడా వెళతాడు. 'పేదలకు పంచుతాం. మీరు ఉపయోగించక పడేసిన దుస్తులు ఇవ్వండి' అంటే చాలా మంది ఇస్తారు. వాటిని తీసుకొస్తాడు గగన్.



● చిన్నారులకు దుస్తులు పంచుతూ...



● భార్యతో కలిసి సేకరించిన దుస్తులను ప్యాక్ చేస్తూ...

సరి చేసి, ఇస్త్రీ చేసి

'మనం బట్టలు పంచినా అవి సరిగ్గా ఉండాలి. మావారు తెచ్చిన బట్టలు ఏవైనా చిరిగి ఉంటే కుట్టి, ఇస్త్రీ చేసి, స్త్రీలవి, పురుషులవి, పిల్లలవి విడివిడిగా ప్యాక్ చేసి కొత్తవిగా కనిపించేలా చేస్తాను' అంటుంది గగన్ భార్య అన్నపూర్ణ. వాళ్లుండేది చిన్న ఇల్లే అయినా ఒక గది ఖాళీ చేసి పూర్తిగా గోడౌన్‌గా వదిలారు. భార్యాభర్తలిద్దరూ డాబా మీదకు చేరి వాటిని విభజించి మూటలుగా కడతారు. ఆ తర్వాత గగన్ తీసుకెళ్లి పంచుతాడు.

బట్టలు, బూట్లు, దోమతెరలు

గగన్ ముఖ్యంగా చిన్నపిల్లల కోసం బట్టలు సేకరిస్తాడు. ఒడిసాలో గిరిజన పిల్లలకు సరైన బట్టలు ఉండవు. కొండ ప్రాంతాలకు వెళ్లి వారి బాగోగులు ఎవరూ చూడరు. గగన్ అలాంటి పిల్లల కోసం బట్టలు సేకరించి పంచుతాడు. గగన్ సేవా భావం గమనించిన దాతలు అతనికో వ్యాన్ ఏర్పాటు చేశారు. గగన్‌కు ఏనుగంత బలం వచ్చింది. తాను సేకరించిన బట్టలను వ్యాన్‌లో వేసుకుని మారుమూల పల్లెలకు వెళ్లి పిల్లలకు పంచుతాడు. దోమలు కుట్టి పసికందులు రోగాల బారిన పడకుండా దోమతెరలు పంచుతాడు. బొమ్మలు ఇస్తాడు. పిల్లలు ఎంతో సంతోషంగా వాటిని స్వీకరిస్తారు. బట్టల తాత అని పిలుస్తారు.

పండుగల ముందు

ఒడిసాలో చేసుకునే పండగల ముందు చాలా శ్రమించి బట్టలు సేకరిస్తాడు గగన్. పేదలు పండగ సమయంలో వీలైనంత మంచి బట్టలు వేసుకోవాలని ఆ సమయాలలో ప్రత్యేకంగా తీసుకెళ్లి పంచుతాడు. అంతేకాదు పూరి జగన్నాథ రథ యాత్ర సమయంలోనూ, కటక్ దుర్గా పూజకూ ఎక్కడెక్కడి పేదవారో వస్తారు. అక్కడ ప్రత్యేకంగా స్టాల్స్ పెట్టి మరీ పాత బట్టలు పంచుతాడు.

ఈ దేశంలో ప్రతి పేదవాళ్లకి ఒంటినిండా బట్ట దొరికే దాకా గగన్ లాంటి వాళ్లు వందలుగా పని చేయాల్సి ఉంటుంది. ఇలాంటి వారుగా ఎవరైనా ఉండొచ్చు. ప్రయత్నించాలి... కొద్దిగా మనసు పెట్టాలి అంతే.

పవర్ లిఫ్టింగ్

మన బలమేంటో మనమే నిరూపించాలి

క్రీడల పట్ల ఆసక్తితోపాటు చదువులోనూ రాణిస్తూ తనని తాను కొత్తగా ఆవిష్కరించుకుంటోంది హైదరాబాద్ వాసి, 28 ఏళ్ల స్ఫూర్తి ఏనుగు. లా చదువుతూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లోనూ పాల్గొని పతకాలు సాధిస్తోంది. ఇటీవల కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా పవర్ లిఫ్టర్ స్ఫూర్తి ఏనుగు పంచుకున్న విషయాలు ఇవి...



● స్ఫూర్తి ఏనుగు

''సహజంగా ఇళ్లలో బరువులెత్తే పనులు అమ్మాయిలకు చెప్పరు. అవి, కేవలం అబ్బాయిల పనే అన్నట్టు చూస్తారు. చిన్నప్పటి నుంచి శిక్షణ ఇవ్వడం లేదా టెక్నిక్స్ తెలుసుకుంటే బరువులు ఎత్తడం అమ్మాయిలకూ సులువే. ప్రొఫెషనల్ అవ్వాలన్నా, శారీరక బరువు, మానసిక సమతుల్యత సాధించాలన్నా వెయిట్ మానేజ్‌మెంట్ తెలుసుకోవడం చాలా ముఖ్యం.

ఛాలెంజెస్

అమ్మాయిలకు ఈ రంగంలో ప్రధాన సమస్య నెలసరి సమస్య. అది ఫేస్ చేయాల్సి వస్తుంది. ప్రతిసారి ఒకే బరువును మోయలేం. శక్తిలోనూ మార్పులు వస్తుంటాయి. ఇందుకు తీసుకునే ఆహారం అబ్బాయిలతో పోల్చితే భిన్నంగా ఉంటుంది. బరువులు ఎత్తే సమయంలో కండరాలు పట్టేస్తుంటాయి. దెబ్బలు తగులుతుంటాయి. జాయింట్స్ దగ్గర సమస్యలు వస్తుంటాయి. బరువులు ఎత్తే సమయంలో ఊపిరిలో తేడాలు వస్తుంటాయి. కానీ, వీటన్నింటినీ సాధనతో అధిగమిస్తుంటాను. మంచి ఆహారం, సరైన నిద్రాసమయం, స్ట్రెస్ లెవల్స్ అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకోవడానికి ప్రతిరోజూ ప్రయత్నిస్తుంటాను. ఈ విషయంలో మా అమ్మ సాధన, నాన్న రామారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు.

బరువును బ్యాలెన్స్ చేసుకోవడానికి...

సెకండ్ క్లాస్ నుంచి స్పోర్ట్స్‌లో ప్రవేశం ఉంది. డిస్క్ త్రో, జావలిన్ త్రో వంటి క్రీడల్లో పతకాలు సాధించాను. రెండేళ్ల నుంచి వెయిట్‌లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాను. కరోనా టైమ్‌లో బరువు పెరిగాను. పది కేజీల బరువు తగ్గాలనుకున్నాను. అందుకు డైట్‌లో మార్పులు చేసుకోవడానికి బదులు నాకు ఎలాగూ స్పోర్ట్స్ అంటే ఇష్టం కాబట్టి, బరువు తగ్గడానికి వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేశాను. ప్రాక్టీస్ చేసేటప్పుడు మనల్ని మనం ఎలా క్రమశిక్షణగా మలచుకోవాలో నిపుణుల ఆధ్వర్యంలో తెలిసిపోతుంది. అందుకు అనుగుణంగా సరైన దినచర్యను అమలు చేసుకుంటూ, విజయం దిశగా నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను.

ఆలోచనలో మార్పు..

అమ్మాయిలు చిన్నప్పటి నుంచే క్రీడలను ప్రాక్టీస్ చేస్తూ ఉంటే వారు ఎంచుకున్న రంగంలోనూ చాలా బాగా దూసుకుపోగలరు. ఇంట్లో వాటర్ క్యాన్స్, గ్యాస్ సిలిండర్, సోఫా.. వంటి బరువులు ఎత్తడంలో కూడా టెక్నిక్స్ ఉంటాయి. సాధారణంగా అమ్మాయిలు కూడా 50–60 కేజీల బరువు ఎత్తగలరు. కానీ, టెక్నిక్స్ తెలియకుండా ఎత్తి, నొప్పితో బాధపడుతుంటారు. దీంతో అమ్మాయిలు వెయిట్ లిఫ్టింగ్ చేయలేరు అనే అభిప్రాయం మనలో చాలా మందిలో పాతుకుపోయి ఉంది. మన ఆలోచనలో మార్పు రావాలంటే తల్లిదండ్రులు కూడా చిన్నప్పటి నుంచే స్పోర్ట్స్ దిశగా అమ్మాయిలను ప్రోత్సహించాలి.

క్రీడలతోపాటు ...

చదువునూ బ్యాలెన్స్ చేసుకోవాలి. ఎంబీయే పూర్తి చేశాను. సివిల్ సర్వీసెస్ కోసం ప్రిపేర్ అవుతూనే స్పోర్ట్స్‌లో సాధన చేస్తూ వచ్చాను. ఇప్పుడు లా చదువుతున్నాను. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లోనే కాదు, కిందటి నెలలో కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన ఏడబ్ల్యూసీ ఓపెన్ వరల్డ్ కప్‌లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించాను. మా అమ్మానాన్నల ప్రోత్సాహంతో పాటు కోచ్ ఇచ్చే గైడెన్స్ ఎంతగానో తోడ్పడుతున్నాయి. మరిన్ని పోటీలు, అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రతిచోటా ఎన్నో సవాళ్లు ఉంటాయి. వాటిని దృఢ సంకల్పంతో, పట్టుదలతో ఎదుర్కొన్నవారే విజేతలవుతారు.

'వెయిట్ లిఫ్టింగ్ అంటే అబ్బాయిలదే. అమ్మాయిలకు ఏం సాధ్యమవుతుంది, సూటవదు' అనే మాట ఇప్పటికీ ఈ రంగంలో మొదటగా వినిపిస్తుంది. కానీ, మనల్ని మనం గెలిచి చూపినప్పుడు అమ్మాయిలుగా మన బలం ఏంటో కూడా ప్రపంచానికి తెలుస్తుంది'' అని వివరిస్తుంది స్ఫూర్తి.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్

సహజ సిద్ధమైన మాయిశ్చరైజర్



● కొబ్బరినూనె మంచి సౌందర్య సాధనంగా పనిచేస్తుంది. సెలబ్రిటీలు చాలామంది తమ చర్మాన్ని అందంగా... ఆరోగ్యంగా ఉంచుకునేందుకు కొబ్బరినూనెను విరివిగా వాడుతుంటారు. కొబ్బరినూనెలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు పొడి చర్మానికి ఔషధంలా పనిచేస్తాయి. కొబ్బరినూనె చర్మానికి సహజసిద్ధమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది.

● టీ స్పూను కొబ్బరినూనెలో అర టీ స్పూను పెరుగు, టీస్పూను ఓట్స్ పొడి వేసి మెత్తని పేస్టులా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసి పదిహేను నిమిషాలపాటు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరాక గుండ్రంగా మర్దన చేస్తూ గోరువెచ్చని నీటితో కడిగేయాలి. వారానికి రెండు సార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖ చర్మానికి తేమ అంది ఆరోగ్యంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

● రెండు టీస్పూన్ల కొబ్బరినూనెలో కొద్దిగా నిమ్మరసం, టీస్పూను వంటసోడా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముక్కు, గడ్డం, నుదురు వంటి బ్లాక్‌హెడ్స్ ఎక్కువగా ఉండే ప్రాంతంలో పట్టించి పది నిమిషాల తరువాత నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్ బ్లాక్‌హెడ్స్‌ను తొలగించడమేగాక, చర్మాన్ని లోతుగా శుభ్రం చేస్తుంది. ఫలితంగా చర్మరంధ్రాల్లో పేరుకున్న అధిక జిడ్డు, దుమ్మూ ధూళీ పోయి చర్మం చక్కని నిగారింపుని సంతరించుకుంటుంది.

● ముఖం మీద నల్లమచ్చలు, కంటి చుట్టూ ఏర్పడిన నల్లని వలయాలపై కొబ్బరినూనెతో క్రమం తప్పకుండా మర్దన చేస్తుంటే .. మచ్చలు తగ్గి ముఖం పడతాయి.

పురస్కారం

వీఆర్ అంటే విజయ సంకేతం



● వీఆర్ లలితాంబిక

ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో 'ఫెయిల్యూర్' ఎదురొచ్చి భయపెట్టాలని చూసింది. 'అంతా గందరగోళం' అన్నట్లుగా ఉండేది పరిస్థితి. సందేహం వచ్చినప్పుడు ఎవరిని అడిగితే ఏమనుకుంటారో అనే భయం ఉండేది. అయినా సరే... 'ఇస్రో' రహదారిలో లలితాంబిక ఎక్కడా తన ప్రయాణాన్ని ఆపలేదు. అడుగడుగునా పాఠం నేర్చుకుంది. సుదీర్ఘ ప్రయాణంలో ఇస్రో టాప్ ఇంజనీర్‌లలో ఒకరిగా ఎదిగింది. తాజాగా... అత్యున్నత ఫ్రెంచ్ పౌర పురస్కారం 'ది లెజియన్ డి ఆనర్ ఆఫ్ ఫ్రాన్స్'ను అందుకుంది వీఆర్ లలితాంబిక...

కేరళలోని తిరువనంతపురంలో జన్మించింది లలితాంబిక. తండ్రితో సహా చుట్టాలలో ఎక్కువమంది ఇంజనీర్‌లు. గణితశాస్త్రంలో దిట్టగా పేరున్న తాత వల్ల లలితకు శాస్త్రీయ విషయాలపై ఆసక్తి మొదలైంది. ఆ ఆసక్తే ఇస్రో వరకు తీసుకువెళ్లింది.

చదువు పూర్తికాగానే పెద్దలు పెళ్లి ఫిక్స్ చేశారు. పెళ్లి తరువాత కూడా చదువుకు విరామం ఇవ్వలేదు లలిత. ఎంటెక్ చేస్తున్న కాలంలో ఆమెకు కూతురు జన్మించింది. కాలేజీకి విరామం ఇచ్చినప్పటికి స్నేహితురాలు తెచ్చి ఇచ్చిన క్లాసులకు నోట్స్ ఇంట్లోనే చదువుకునేది. 1998లో తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో చేరింది.

కొద్దిరోజుల్లోనే తాను పనిచేస్తున్న ఏరియాలో కంట్రోల్ సిస్టమ్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్ ఎర్రర్ వల్ల ఫెయిల్యూర్ ఎదురైంది.

'ఆ రోజుల్లో ప్రతిదీ కొత్తగానే అనిపించేది. ప్రతిరోజూ ఒక సవాలుగానే ఉండేది. ఒక సమస్యకు సంబంధించి పరిష్కారాన్ని అన్వేషించడానికి, అధ్యయనం చేయడానికి అవసరమైన పుస్తకాలు ఉండేవి కాదు. సీనియర్‌లను అడగాలంటే భయంగా ఉండేది. ఆత్మస్థైర్యం అంతంత మాత్రంగానే ఉండేది' అని గతాన్ని గుర్తు చేసుకుంది లలిత.

పీఎస్ఎల్‌వీ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్నప్పుడు లలిత యంగ్ మదర్.

ఒకవైపు... ఏ టైమ్‌కు ఇంటికి వెళతారో తెలియనంత ఊపిరి సలపని పని.

మరోవైపు... పని విరామంలో పదే పదే గుర్తుకు వచ్చే బిడ్డ.

1993లో పీఎస్ఎల్‌వీ లాంచ్ ఫెయిల్ అయింది. అదే సంవత్సరం రెండో ప్రయత్నానికి సంబంధించిన షెడ్యూల్ వచ్చింది. పని ఒత్తిడి మరింత పెరిగింది. అలాంటి క్లిష్టమైన కీలక సమయంలోనూ ఎప్పుడూ 'ఇక చాలు. ఈ ఉద్యోగం చేయడం మన వల్ల కాదు' అనుకోలేదు. 'ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది' అని మాత్రమే అనుకుంది.

'ఆ సమయంలో జరిగిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. తప్పులు పునరావృతం కాకుండా చూసుకున్నాం. తప్పుల నుంచి నేర్చుకోవడం అనేది ఇస్రో సంస్కృతిలో ఒకటి' అంటుంది లలిత.



● ఫ్రెంచ్ పౌర పురస్కారం అందుకుంటూ...

సెకండ్ పీఎస్ఎల్‌వీ లాంచ్ సక్సెస్‌కు సంబంధించిన ఆనందం లలితకు ఆత్మస్థైర్యం, అంతులేని ఉత్సాహాన్ని ఇచ్చింది.

'పీఎస్ఎల్‌వీలో ఆటోపైలట్ సిస్టమ్ విభాగంలో చాలాకాలం నుంచి ఉన్నాను. లాంచ్ రోజులు ఉత్కంఠభరితమైనవి. అదే సమయంలో సంతోషం రూపంలో ఆత్మస్థైర్యాన్ని రెట్టింపు చేసేవి. ప్రతి ఫెయిల్యూర్ కొత్త పాఠం నేర్పేది. ప్రతి సక్సెస్ కొత్త శక్తిని ఇచ్చేది' అంటుంది లలిత.

'మీ విజయరహస్యం?' అనే ప్రశ్నకు లలిత చెప్పే మాట...

'ఫ్యామిలీ సపోర్ట్'

'లాంచ్‌కు సంబంధించిన రోజుల్లో పనే లోకంగా ఉండేవాళ్లం. ఏ టైమ్‌కు ఇంటికి చేరుతామో తెలియదు. ఇలాంటి సమయంలోనూ నాకు కుటుంబ మద్దతు రూపంలో ప్రోత్సాహం, బలం లభించాయి. వ్యక్తిగత త్యాగాలను కూడా ఇష్టపూర్వకంగా చేసే రోజులు అవి. స్త్రీ, పురుషులను వేరు వేరుగా చూడడం అనే సంస్కృతి ఇస్రోలో కనిపించేది కాదు. ఎవరైనా ఒక్కటే అన్నట్లుగానే ఉండేది. మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చేవారు' అంటుంది లలిత.

ఫ్రెంచ్ అత్యున్నత పౌర పురస్కారం విషయానికి వస్తే...

ఫ్రాన్సు, మన దేశం మధ్య అంతరిక్ష సహకారాన్ని పెంపొందించడంలో చేసిన విశేష కృషికి ఇస్రోలో డైరెక్టరేట్ ఆఫ్ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ ప్రోగామ్ మాజీ డైరెక్టర్ అయిన వీఆర్ లలితాంబికను ఫ్రెంచ్ అత్యున్నత పౌరపురస్కారంతో సత్కరించారు. ఫ్రాన్స్ ప్రభుత్వం తరపున మన దేశంలోని ఫ్రాన్స్ రాయబారి మాథ్యూ నుంచి ఈ అవార్డ్ అందుకుంది లలిత.

'అంతరిక్ష సాంకేతికతలో విశిష్ట శాస్త్రవేత్త' అని మాథ్యూ లలితాంబికను కొనియాడారు.

'ఈ గౌరవం మరింత మంది మహిళలు స్టెమ్ రంగాలలోకి రావడానికి, విజయాలు సాధించడానికి స్ఫూర్తిగా నిలుస్తుంది' అంటుంది వీఆర్ లలితాంబిక.

ఉత్కర్షిణి కిచెన్

ఆకలి తీర్చే అమ్మ



● బిందు రమాకాంత్

ప్రేమను పంచడంలో అమ్మ తర్వాతే ఎవరైనా! కొంతమంది తల్లులు తమ పిల్లల్లాగే... ఇతరులను సైతం ప్రేమగా చూసుకుంటుంటారు. కడుపున జన్మించక పోయినప్పటికీ ఆ తల్లి చూపే ప్రేమాభిమానాలకు అమ్మ అని ఆప్యాయంగా పిలుస్తుంటారు. ఈ కోవకు చెందిన వారే బిందు రమాకాంత్ ఘట్‌పాండే. బిందుని తన పిల్లలేగాక, వేలాది మంది 'అమ్మ' అని ఆప్యాయంగా పిలుస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న వారికి కడుపునిండా భోజనం పెడుతూ ఎందరికో అమ్మగా మారింది బిందు రమాకాంత్ ఘట్‌పాండే. అంతమందికి అమ్మగా మారిన బిందు గురించి ఆమె మాటల్లోనే....

''రాజస్థాన్‌లోని ఝుంఝునులో పుట్టాను. ముగ్గురు అక్కచెల్లెళ్లు, నలుగురు అన్నదమ్ములు ఉన్న పెద్ద కుటుంబం మాది. నాన్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. ఉద్యోగరీత్యా ప్రతి రెండేళ్లకోసారి నాన్నకు బదిలీలు జరిగేవి. దీంతో చాలా భాషలు పరిచయం అయ్యాయి. పంజాబీ, హిందీ, బెంగాలీ, మరాఠీ భాషలు చక్కగా మాట్లాడగలను. నా పెళ్లి అయిన తరువాత మా ఆయనతో కలిసి భోపాల్‌లో స్థిరపడ్డాను. నాకు ఇద్దరు పిల్లలు. మా అబ్బాయి కోల్‌కతా ఐఐఎమ్ టాపర్. అమ్మాయి దుబాయ్‌లో రేడియో జాకీ. యాంకర్‌గా పనిచేస్తోంది. పిల్లల బాధ్యతలు తీరాక నాకు చాలా ఖాళీ సమయం దొరికింది. ఈ సమయంలో సమాజానికి ఏదైనా మంచి చేయాలనిపించింది. ఏం చేయాలా... అని ఆలోచిస్తున్న సమయంలో ఒక రోజు టీవీలో 'గ్రాండ్ మదర్స్ కిచెన్' గురించి చూశాను. అప్పుడే నాకు కూడా ఆకలితో అలమటించే వారికి అన్నం పెట్టాలన్న ఆలోచన వచ్చింది. మా ఆయనకు చెప్పాను. దానికి ఆయన ఒప్పుకున్నారు. వెంటనే ఇంట్లో భోజనం తయారు చేసి కారులో పెట్టుకుని రోడ్డుమీదకు ఆకలితో ఉన్న వారు కనిపిస్తే వారికి భోజనం పార్శిల్ ఇచ్చేదాన్ని. వాళ్లు తిన్న తరవాత చెప్పే కృతజ్ఞతలతో నాకు కడుపు నిండిపోయేది. అలాగే ఉదయాన్నే పాతిక లీటర్ల గంజి తయారు చేసి వీధికుక్కలకు పోసేదాన్ని. ఆ తరువాత 'ఉత్కర్షిణి' పేరిట కిచెన్‌ను ఏర్పాటు చేశాను. ప్రస్తుతం ఈ ఉత్కర్షిణి వందలాది మంది ఆకలి తీరుస్తోంది.

రోజుకో మెను...

కిచెన్‌లో ఎంతో పరిశుభ్రంగా భోజనం వండిస్తాను. తయారీ అంతా నా పర్యవేక్షణలో జరుగుతుంది. రోజుకొక మెను పెడుతున్నాను. ఒక రోజు పప్పు, కూరలు, అన్నం పెడితే.. మరుసటిరోజు రాజ్మా, అన్నం, ఇంకోరోజు పూరీ, కూరలతో వడ్డిస్తున్నాం. పప్పు, అన్నం అయితే ప్లేటు ఐదు రూపాయలకు, రసగుల్లా, హల్వా పూరీ ఉన్న రోజు ప్లేటు ఇరవై రూపాయలకు విక్రయిస్తున్నాం. మా భోజనం తినేవారి సంఖ్య పెరగడం... ''భోజనం బావుంది, కానీ స్వీట్ ఉంటే బావుంటుంది'' అని కస్టమర్లు చెప్పడంతో తొలుత హల్వా పెట్టడం మొదలుపెట్టాము. ఇప్పుడు రసగుల్లా కూడా పెడుతున్నాం.



● సహాయకులతో బిందు



ఆకలి తీరడానికి మాత్రమే...

ఉత్కర్షిణి కిచెన్‌లో తయారైన భోజనానికి ఎలాంటి నిబంధనలు లేవు. నిరుపేదల నుంచి ఎవరైనా తినవచ్చు. మా భోజనం తినేవారిలో పారిశుధ్య కార్మికులు, రిక్షా నడిపేవాళ్లు, నర్సులు, డాక్టర్లు, విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఎవరికి ఆకలి వేసినా తిని వెళ్లాల్సిందే తప్ప.. ఇంటికి ప్యాక్ చేసి ఇవ్వడం లేదు. ఆసుపత్రికి వచ్చే రోగులు మందులు వేసుకునే ముందు ఏదైనా తినాలని చెప్పి సమోసా, బిస్కెట్లు తింటుంటారు. ఇవి ఆరోగ్యానికి మంచిది కాదు. అందుకే వీరు సైతం తినేలా మా కిచెన్ ఆహార పదార్థాలు అందిస్తోంది.

అలా వందలమందికి..

నేను పెడుతోన్న భోజనానికి డిమాండ్ పెరగడంతో వంటవాళ్లను పెట్టుకుని వండించడం మొదలుపెట్టాను. ప్రస్తుతం ఆసుపత్రి, దానిపక్కన స్టూడెంట్ క్యాంపస్ ఉంది. అక్కడ భోజనం ప్లేటు ఐదు రూపాయలకు ఇస్తున్నాను. చాలామంది విద్యార్థులు వచ్చి తింటున్నారు. అలా నా దగ్గర భోజనం చేయడానికి వచ్చేవారు నన్ను ''అమ్మ లేదా మా'' అని పిలుస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం మా ఉత్కర్షిణి కిచెన్ కుటుంబం రోజురోజుకి పెరిగిపోతోంది. అందుకే త్వరలో భోపాల్‌లోని ఇతర ప్రాంతాలకు కూడా నా సేవలను విస్తరించబోతున్నాను. మరింత మంది ఆకలి తీర్చడమే నా లక్ష్యం''అని చెప్పింది బిందు రమాకాంత్ ఘట్‌పాండే



స్మార్ట్‌గా మాన్పించండి

ప్రస్తుత కాలంలో ఎవరింట చూసినా పిల్లల చేతిలో స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లు, ఐపాడ్లు ఉండవలసిందే! స్మార్ట్‌ఫోన్లు అధికంగా వాడుతున్న పిల్లలు కదలకుండా ఒకేచోట కూర్చొని ఉంటారు. దీనివల్ల వారు చిన్న వయసులోనే ఊబకాయం బారిన పడే అవకాశం ఉంది. అంతేకాదు ఫోన్ లేదా టీవీ చూస్తూ ఉంటే కాస్త ఎక్కువే తినేస్తారు. దీనివల్ల భవిష్యత్తులో ఊబకాయం, మధుమేహం, కీళ్ల సమస్యలు, గుండె జబ్బులు వంటి వాటి బారిన పడే ప్రమాదం పెరిగిపోతుంది. వీటన్నింటి నుంచి రక్షించాలంటే పిల్లలు స్మార్ట్‌ఫోన్ వాడకుండా చేయాలి. అదెలాగో చూద్దాం.

పిల్లల మనసు అద్దం లాంటిది. తల్లిదండ్రులు, ఇంట్లో ఉన్న ఇతర పెద్దలు ఏం చేస్తున్నారో చూసి అదే అలవాటు చేసుకుంటారు. కాబట్టి ఇంట్లో ఉన్న సమయంలో తల్లిదండ్రులు, ఇతర పెద్దలూ స్మార్ట్‌ఫోన్, లాప్‌టాప్ వంటివి చూడకూడదని గుర్తుంచుకోండి.

పిల్లలకు ఫోన్ చూస్తూ తినే అలవాటు ఉంటే, వాళ్లకు ఆకలిగా ఉన్నప్పుడే అన్నం పెట్టండి. ఎందుకంటే ఆకలితో ఉన్నప్పుడు అల్లరి చేయరు. మొబైల్ గురించి ఆలోచించరు. తిండి పైనే ధ్యాస పెడతారు.

మొబైల్ లేకుండా ఐదు నిమిషాల పాటు వారికి ఆహారం పెట్టడానికి ప్రయత్నించండి. పేచీ పెట్టకుండా సరిగ్గా తింటే, ఈ సమయాన్ని పెంచవచ్చు.

పిల్లలకు తినిపించేటప్పుడు వాళ్లతో మాట్లాడుతూ ఉండండి. వంటకాలు ఎలా ఉన్నాయో అడగండి. నవ్వుతూ... కబుర్లు చెబుతూ, జోకులేస్తూ, సరదాగా గడిపితే మొబైల్ ఫోన్ చూపించి తిండి పెట్టాల్సిన అవసరం ఉండదు.

చిన్నప్పటినుంచి పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలి. ముందు బొమ్మల పుస్తకాలతో మొదలు పెట్టండి. ఆ తర్వాత పజిల్స్ పూర్తి చేయడం, కథల పుస్తకాలు, వార్తా పత్రికలలో పిల్లలకోసం కేటాయించే కథనాలను చదవడం అలవాటు చేయడం వల్ల వారి దృష్టి స్మార్ట్‌ఫోన్ పైకి మళ్లదు.

పిల్లలకు బాల్యం నుంచి చుట్టుపక్కల పిల్లలతో ఆటలు ఆడటం అలవాటు చేయాలి. వారి వయసు పిల్లలు లేకపోతే మీరే వారితో ఆడుకోండి. కాసేపు ఔట్‌డోర్ ఆటలు, కాసేపు చెస్, క్యారమ్స్ వంటివి ఆడటం అలవాటు చేస్తే స్మార్ట్‌ఫోన్ బారిన పడకుండా స్మార్ట్‌గా తయారవుతారు.

ఆ బద్ధకాన్ని వదిలించుకోండిలా...



చాలామంది పైకి చెప్పుకోలేరు కానీ ఈ రోజుల్లో చాలామందిని వేధించే సమస్యలలో మలబద్ధకం కూడా ఒకటి. చిత్రం ఏమిటంటే, దానిని అసలు ఒక సమస్యగా కూడా గుర్తించకపోవడం! మలబద్ధకాన్ని సీరియస్‌గా తీసుకోకపోతే మాత్రం శరీరంలో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. దీర్ఘకాల మలబద్ధకం వల్ల కిడ్నీ సమస్యలు, జీర్ణవ్యవస్థ సమస్యలు, పైల్స్, తలనొప్పి, గ్యాస్, ఆకలి లేకపోవడం, బలహీనత, వికారం, ముఖం మీద మొటిమలు, నల్ల మచ్చలు వంటి సమస్యలు మొదలవుతాయి. అందువల్ల రోజువారీ మన అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకుంటూ డైట్‌లో కొన్ని ఆహార పదార్థాలు చేర్చుకుంటే.. మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

మలబద్ధకంతో బాధపడే వారికి కడుపులో అసౌకర్యంగా... ఇబ్బందిగా ఉంటుంది. మలద్వారం కోసుకుపోవడం, రక్తస్రావం వంటి సమస్యలు ఎదురవుతాయి. కదలకుండా కూర్చునే జీవనశైలి, అస్తవ్యస్తమైన ఆహారపు అలవాట్లు, జంక్ ఫుడ్, వేపుళ్లు, ప్రాసెస్డ్ ఫుడ్, తగినన్ని నీరు తాగకపోవడం, ఫైబర్ ఎక్కువగా తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, బలహీనమైన జీవక్రియలు, రాత్రిళ్లు ఆలస్యంగా తినడం లేదా అసలే తినకపోవడం వంటి కారణాల వల్ల మలబద్ధకం వచ్చే అవకాశం ఉంది. ఇది దీర్ఘకాలం ఉంటే.. కిడ్నీ సమస్యలు, జీర్ణవ్యవస్థ సమస్యలు, పైల్స్, తలనొప్పి, గ్యాస్, ఆకలి లేకపోవడం, బలహీనత, వికారం, ముఖం మీద మొటిమలు, నల్ల మచ్చలు వంటి సమస్యలు మొదలవుతాయి. దీనిని నివారించడానికి ఎన్నో చికిత్సలు, ఔషధాలు ఉన్నాయి. మీ డైట్‌లో కొన్ని ఆహార పదార్థాలు చేర్చుకుంటే.. మలబద్ధకం నుంచి ఉపశమనం పొందవచ్చు. అవేంటో తెలుసుకుందాం.



■ ఆహారంలో మెంతులు

మలబద్ధకం సమస్య ఉంటే.. చెంచాడు మెంతులను రాత్రంతా నానబెట్టి, ఉదయాన్నే తినండి లేదంటే పడుకునే ముందు గోరువెచ్చని నీటిలో చెంచాడు మెంతిపొడిని కలుపుకుని తాగడం వల్ల తెల్లారేసరికి సుఖ విరేచనం అవుతుంది.



■ పండ్లు, కూరగాయలు

ఉదయానే టిఫిన్ చేసిన తర్వాత, మధ్యాహ్నం భోజనానికి ముందు, సాయంత్రం మీకు ఇష్టమైన కూరగాయలతో చేసిన గ్లాసుడు వెజిటబుల్ జ్యూస్ తీసుకోవడం వల్ల మలబద్ధకం బారిన పడకుండా ఉంటారు. బచ్చలికూర, టొమాటో, బీట్‌రూట్, నిమ్మరసం, అల్లం కలిపి జ్యూస్‌ను తయారు చేసుకుని తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. తాజాపండ్లు ముఖ్యంగా బొప్పాయి పండు తినడం మంచిది.



■ సబ్జానీళ్లు

మలబద్ధకంతో బాధపడేవారు రోజూ ఉదయం నానబెట్టిన సబ్జా గింజలను చెంచాడు ఖాళీ కడుపుతో తీసుకుంటే సమస్య తగ్గుముఖం పడుతుంది. నానబెట్టిన బాదం పప్పులు, వాల్‌నట్, ఎండు ద్రాక్షలను తీసుకున్నా మంచిది.



■ అంజీర్

అంజీర్‌లో విటమిన్ బి6 పుష్కలంగా ఉంటుంది. ఇందులో కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. రాత్రిపూట నానబెట్టిన అంజీర పండ్లను ప్రతిరోజూ ఉదయం తీసుకుంటే మలబద్ధకం సమస్య తగ్గుతుంది. అంజీర్ పేగు కదలికలను సులభతరం చేస్తుంది.



■ బొప్పాయి

ప్రతి రోజూ ఉదయం 11 గంటల ప్రాంతంలో, భోజనానికి ముందు కప్పుడు బొప్పాయి ముక్కలు తీసుకుంటే మంచిది. అలాగే జామపండు ముక్కలు, దోసబద్దలు తీసుకున్నా మంచిదే. భోజనానికి అరగంట ముందు గ్లాసు మజ్జిగ, అర స్పూన్ అవిసెగింజలు తీసుకుంటే మలబద్ధకం తగ్గుతుంది.



■ ఓట్స్

ఓట్స్‌లో బీటా–గ్లూకాన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇది కరిగే ఫైబర్, ఇది కడుపు పనితీరును ప్రోత్సహిస్తుంది. ఓట్స్ ప్రేగులలో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో కూడా సహాయపడతాయి. ఓట్స్ పేగుల పనితీరును ప్రోత్సహించడంలో, మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీంతో మలబద్ధకం సమస్య త్వరగా తగ్గుతుంది.



■ నెయ్యి

నెయ్యికి ఉండే.. సహజమైన జిడ్డుతత్త్వం పేగుల కదలికలను వేగవంతం చేస్తుంది. రోజూ ఆహారంలో నెయ్యి వేసుకని తింటే మలబద్ధకం నుంచి విముక్తి పొందచ్చు.

జామపండ్లు, దోసకాయ, కాకరకాయ, చిక్కుళ్లు మలబద్ధకాన్ని నివారించడంలో ముందుంటాయి కాబట్టి అవి ఆహారంలో ఉండేలా చూసుకుంటే మంచిది.



చలిలోనూ కురులు నిగనిగా...

శీతాకాలంలో చర్మ సమస్యలు సాధారణం. ఈ విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ కాలంలో చర్మానికే కాదు.. జుట్టుకూ సమస్యల చిక్కులు తప్పవు. ముఖ్యంగా చలికాలంలో జుట్టు రాలిపోవడం కాస్త ఎక్కువగానే ఉంటుంది. శీతాకాలంలో శిరోజాలను సంరక్షించుకోవాలంటే ఏం చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి... తదితర విషయాలు తెలుసుకుందాం...

శీతాకాలంలో ఉండే చల్లగాలుల వల్ల శరీరంలోనే కాదు, శిరోజాల్లో కూడా తేమ శాతం తగ్గిపోతుంది. ఫలితంగా జుట్టంతా అట్టకట్టినట్లు పొడిగా తయారవుతుంది. అంతే కాదు, కుదుళ్ళు బలహీనపడి జుట్టు రాలిపోయే సమస్య అధికం అవుతుంది కాబట్టి చలి బారి నుంచి శిరోజాలను కూడా సంరక్షించుకోవాలంటే ఏం చేయాలో చూద్దాం.

✘ ఇవి వద్దు

✘ తరచూ తలస్నానం

శీతాకాలంలో తలస్నానం మరీ ఎక్కువగా లేదా తక్కువగా చేయకూడదు. వారానికి రెండుసార్లు చేస్తే సరిపోతుంది. అంతకన్నా ఎక్కువసార్లు చేయడం వల్ల జుట్టు రాలిపోయే ప్రమాదం ఉంది.

✘ వేడినీటి స్నానం

శీతాకాలంలో స్నానానికి బాగా వేడిగా ఉన్న నీళ్లను ఉపయోగించకూడదు. గోరు వెచ్చని నీటిని మాత్రమే ఉపయోగించాలి. వేడి నీటి స్నానం వల్ల చర్మం, శిరోజాల్లోని సహజనూనెల శాతం తగ్గిపోయి కురులు పొడిగా... నిర్జీవంగా మారిపోతాయి.

✘ హెయిర్ డ్రయ్యర్స్

శీతాకాలంలో జుట్టుకు ఉపయోగించే డ్రయర్స్, కర్లర్స్‌స్ట్రెయిటనర్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి. టవల్‌తో తుడుచుకుని ఆరబెట్టుకునే విధానానికే పరిమితం కావాలి.

✔ ఇవి చేయాలి

✔ కండీషనింగ్

తలస్నానానికి ముందు జుట్టుకు కండీషనర్ తప్పకుండా అప్లై చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కుదుళ్లు బలంగా ఉంటాయి.

✔ హెయిర్ ఆయిల్

చలికాలంలో శిరోజాలకు తరచు నూనె పెడితే మంచిది. ఇది జుట్టులోని తేమ శాతం ఎక్కువ సమయం నిలిచి ఉండటానికి ఉపకరిస్తుంది. అలాగే దువ్వుకోవడానికి సన్న పళ్ల దువ్వెన కాకుండా పళ్లు కాస్త దూరంగా... వెడల్పుగా ఉన్న దువ్వెన వాడటం మంచిది.

అట్ట కట్టినట్టు ఉంటే : చలిగాలులకు జుట్టు అట్టకట్టినట్లుగా కాకుండా ఉండాలంటే రోజూ రాత్రిళ్లు విటమిన్ ఇ ఉన్న నూనెను రాసుకోవాలి. అలాగే బయటకు వెళ్లేటప్పుడు కురులను కవర్ చేసేలా స్కార్ఫ్, టోపీ వంటివి ధరించాలి. కుదరని పక్షంలో బాడీలోషన్ కొద్దిగా తీసుకుని చేతులకు రుద్దుకోవాలి. తర్వాత ఆ చేతులతో జుట్టును మెల్లగా దువ్వుతున్నట్లు సవరించుకోవాలి. ఇలా చేయడం వల్ల పెళుసుదనం పోయి, శిరోజాలు ప్రకాశవంతంగా మారుతాయి.

ఈ జాగ్రత్తలతో ఈ కాలంలోనూ కురులు నిగనిగలాడతాయి.

సినిమా



● పృథ్వీరాజ్, ప్రభాస్

ముట్టుకోవద్దని చెప్పాను కద రా...

ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురు చూసిన 'సలార్ పార్ట్ 1– సీజ్‌ఫైర్' ట్రైలర్ వచ్చేసింది. ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన పాన్ ఇండియన్ చిత్రం 'సలార్'. హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' క్రిస్మస్ పండగ సందర్భంగా ఈ నెల 22న తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. శుక్రవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'దూరంగా ఉన్న ఒక ప్రాంతంలో..., ఎవడ్రా ఎవడు?', 'అరే దేవా.. వద్దురా వెళ్దాం పదా', 'చెప్పరా.. ఎవడు?' అనే డైలాగ్‌తో టీజర్ ప్రారంభమైంది. 'పెద్ద పెద్ద గోడలు కట్టేదే భయపడి.. బయటకు ఎవడు పోతాడో అని కాదు.. లోపలికి ఎవడొస్తాడా? అని', 'ముట్టుకోవద్దని చెప్పాను కదరా', 'నిన్ను ఎవడూ ముట్టుకోకూడదు.. ప్లీజ్.. ఐ కైండ్లీ రిక్వెస్ట్' అంటూ దేవ పాత్రధారి ప్రభాస్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ట్రైలర్ చూస్తే స్నేహితులైన ప్రభాస్ (దేవా), పృథ్వీరాజ్ సుకుమారన్(వరద రాజమన్నార్) శత్రువులుగా ఎలా మారారు? అనే నేపథ్యంలో కథ సాగుతుందని తెలుస్తోంది. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జగపతిబాబు, టీనూ ఆనంద్, శ్రియా రెడ్డి, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషించారు.

బచ్చల మల్లి షురూ

'అల్లరి' నరేశ్ హీరోగా 'బచ్చల మల్లి' సినిమా షురూ అయింది. ఈ చిత్రానికి 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో అమృతా అయ్యర్ కథానాయిక. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రతాప్‌రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, అనిల్ రావిపూడి క్లాప్ ఇవ్వగా, విజయ్ కనకమేడల గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకులు మారుతి, బుచ్చిబాబు స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. ''న్యూ ఏజ్ యాక్షన్ డ్రామాగా యునిక్ కథతో 'బచ్చల మల్లి' రూపొందుతోంది. 1990 నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో యాక్షన్ ఎక్కువగా ఉంటుంది. 'అల్లరి' నరేశ్ ఇంటెన్స్ రోల్ చేస్తున్నారు. ఆయన కెరీర్‌లో 63వ చిత్రమిది. పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారు నరేశ్. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. కోట జయరామ్, రావు రమేశ్, సాయికుమార్, ధనరాజ్, హరితేజ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎం.నాథన్.



● 'అల్లరి' నరేశ్, సుబ్బు, అనిల్ రావిపూడి, రాజేశ్ దండా


కడపకు కంగువా



● సూర్య

కడపకు పయనమవ్వనున్నారట కంగువా. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ 'కంగువా'. దిశా పటానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్‌రాజా నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణను కడపలో ప్లాన్ చేశారని, ఈ నెల రెండో వారంలో ఈ చిత్రీకరణ మొదలవుతుందని సమాచారం. సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ కడపలో జరగనుందట. రెండు భాగాలుగా విడుదల కానున్న 'కంగువా' ఫస్ట్ పార్ట్ ఏప్రిల్‌లో విడుదల కానుంది.

మార్చిలో మొదలు



● సల్మాన్ ఖాన్

సల్మాన్ ఖాన్ హీరోగా 'షేర్షా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో 'ది బుల్' అనే సినిమా తెరకెక్కనుంది. కరణ్ జోహార్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ మార్చిలో ప్రారంభం కానుందని బాలీవుడ్ సమాచారం. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందని, ఇందులో పారా మిలిటరీ ఆఫీసర్‌గా సల్మాన్ ఖాన్ నటిస్తారని టాక్. వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఇక తన సినిమాల వైఫల్యాల ('అంతిమ్, కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'లను ఉద్దేశిస్తూ..) గురించి కూడా సల్మాన్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. నా సినిమాలు విడుదలైనప్పుడు, ఆ సినిమాల టికెట్ ధరలు తక్కువగా ఉంటున్నాయని, ఎక్కువ ధరలతో విడుదల చేస్తే ఆ సినిమాల కలెక్షన్స్ కూడా భారీగానే ఉంటాయని, నా తర్వాతి సినిమాను అలాగే రిలీజ్ చేస్తానని సల్మాన్ ఖాన్ చెప్పుకొచ్చారు. అంతేకాదు.. తక్కువ సినిమా టికెట్ ధరలతో ప్రజల డబ్బును మేం సేవ్ చేస్తున్న విషయం అందరికీ సరిగ్గా అర్థం కావడం లేదని కూడా సల్మాన్ ఖాన్ పేర్కొన్నారు.

కొత్త ప్రయాణం ఆరంభం



● ట్రైన్ సినిమా ప్రారంభోత్సవంలో...

రైలు ప్రయాణం మొదలు పెట్టారు విజయ్ సేతుపతి. ఆయనతో జర్నీ షేర్ చేసుకుంటున్నారు డింపుల్ హయతి. విజయ్ సేతుపతి హీరోగా డింపుల్ హయతి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు 'ట్రైన్' టైటిల్‌ను ఖరారు చేశారు. దర్శకుడు మిస్కిన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ శుక్రవారం ప్రారంభమైంది. రైలు ప్రయాణం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ సేతుపతి క్యారెక్టరైజేషన్, లుక్‌ను కొత్తగా డిజైన్ చేశారు మిస్కిన్.



● విజయ్ సేతుపతి

ఇరవై సార్లు పెళ్లి చేసుకున్నా!



● అవికా గోర్

''చిన్నారి పెళ్లి కూతురు' సీరియల్ మొదలుకొని ఇప్పటివరకూ నేను ఆన్ స్క్రీన్‌పై కనీసం ఇరవై సార్లు పెళ్లి చేసుకుని ఉంటా. అయితే ఇది బోర్ కొట్టలేదు. పెళ్లి కూతురిలా ముస్తాబవడం నాకు చాలా ఇష్టం. మరోసారి 'వధువు'లో పెళ్లి కూతురిగా నటించాను. థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ సిరీస్ ఆసక్తిగా సాగుతుంది'' అని హీరోయిన్ అవికా గోర్ అన్నారు. నందు, అలీ రెజా, అవికా గోర్ కీలక పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'వధువు'. పోలూరు కృష్ణ దర్శకత్వంలో శ్రీకాంత్ మోహతా, మహేంద్ర సోని నిర్మించిన 'వధువు' ఈ నెల 8 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా అవికా గోర్ మాట్లాడుతూ–''బెంగాలీ సక్సెస్‌ఫుల్ వెబ్ సిరీస్ 'ఇందు'ను తెలుగులోకి 'వధువు'గా తీసుకొస్తున్నాం. ఇలాంటి స్క్రిప్ట్‌లో నేను ఇప్పటిదాకా నటించలేదు. నాకు టీవీ సీరియల్స్ చేసిన అనుభవం ఉంది. బుల్లితెర ప్రేక్షకులకు ఎలాంటి కంటెంట్ ఇష్టమో.. అది 'వధువు'లో ఉంటుంది. ఇక చిన్నప్పుడే నటిగా మారడం వల్ల నా పర్సనల్ లైఫ్‌కు టైమ్ కోల్పోయినా... నటిగా నేను ప్రతి రోజూ ఒక కొత్త పాత్రలో కనిపించగలుగుతున్నాను.. ప్రతి రోజూ ఒక కొత్త లైఫ్ చూస్తున్నాను. నిర్మాతగా 'పాప్ కార్న్' సినిమా తీయడం గర్వంగా ఉంది. ఎలాంటి హంగామా లేకుండా ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో నిరాడంబరంగా నా పెళ్లి చేసుకోవాలనుంది. ప్రస్తుతం తెలుగులో ఆది సాయికుమార్ హీరోగా రూపొందుతున్న ఒక సినిమా చేస్తున్నా. అలాగే హిందీలో కొన్ని ప్రాజెక్ట్స్‌లో నటిస్తున్నాను'' అన్నారు.

కన్నీరే నెత్తురు చిందగా...



● విశాల్

విశాల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రత్నం'. ఈ చిత్రానికి 'సింగం' సిరీస్ ఫేమ్ హరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్. కార్తికేయన్ సంతానం, జీ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు మేకర్స్. ఓ పెద్ద మైదానంలో బర్రెలు, గుర్రాలు పరిగెడుతూ ఉండగా వాటి మధ్య లారీ నుంచి దిగి వచ్చి మోకాలి మీద కూర్చున్న ఒక వ్యక్తి తలని విశాల్ నరికి, దాన్ని చేత్తో పట్టుకుని నడిచి వచ్చే సన్నివేశాన్ని టీజర్‌లో చూపించారు. 'కన్నీరే నెత్తురు చిందగా.. క్రోధమే రుధిరం చిమ్మగా.. ఆగ్రహమే అరుణధారగా.. రణరంగమే రక్తపు ఏరుగా...' వంటి డైలాగులు టీజర్‌లో వినిపిస్తాయి. 'రత్నం' చిత్రంలో విశాల్ మరోసారి మాస్ లుక్‌లో కనిపించనున్నారని టీజర్ చూస్తే తెలుస్తోంది. ఈ చిత్రాన్ని 2024 వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. సముద్ర ఖని, గౌతమ్ మీనన్, యోగిబాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	493	67,481
నిఫ్టీ ▲	135	20,268

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,298	▲ 72
డోజోన్స్	36,211	▲ 260
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,529	▲ 76
డాక్స్	16,398	▲ 182
షాంఘై	3,032	▲ 2
నికాయ్	33,432	▽ 55

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	62,728
బంగారం (22 క్యారట్)	62,477
వెండి (కిలో)	76,400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.73	107.11
€	యూరో	ఒకటి	89.40	93.09
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.48	57.18
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.93	56.53
S$	సింగపూర్ డాలర్	ఒకటి	54.31	56.29
SAR	సౌదీ రియాల్	ఇంకొకటి	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ఇంకొకటి	21.78	23.57
¥	చైనా యువాన్	ఇంకొకటి	10.54	12.62

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.68 లక్షల కోట్లు

నవంబర్‌లో 15 శాతం అప్



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు నవంబర్‌లో రూ.1.68 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలతో (రూ.1.45 లక్షల కోట్లు) పోల్చితే ఈ పరిమాణం 15% అధికం. ఆర్థిక శాఖ విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ. 1,67,929 కోట్లు
- ఇందులో సీజీఎస్‌టీ వసూళ్లు రూ.30,420 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.38,226 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ పరిమాణం రూ. 87,009 కోట్లు (వస్తు దిగుమతులపై వసూలయిన రూ.30,198 కోట్లు కలిపి)
- సెస్ రూ.12,274 కోట్లు (వస్తు దిగుమతులపై వసూలయిన రూ.1,036 కోట్లుసహా)

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్ నెలల్లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి. జూలై వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లు. ఆగస్టు వసూళ్లు రూ. 1.59 లక్షల కోట్లు కాగా, సెప్టెంబర్‌లో రూ. 1.63 లక్షల కోట్ల జీఎస్‌టీ రాబడి నమోదయ్యింది. ఇక అక్టోబర్ విషయానికి వస్తే. వసూళ్లు భారీగా రూ.1.72 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2017 జూలైలో ప్రారంభం తర్వాత ఇవి రెండవ భారీ స్థాయి వసూళ్లు (2023 ఏప్రిల్ తర్వాత) కావడం గమనార్హం.

నవంబర్‌లో 'తయారీ' పటిష్టం

56కు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ



న్యూఢిల్లీ: భారత్ మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ)లో దాదాపు దాదాపు 77 శాతం వాటా కలిగిన తయారీ రంగం నవంబర్‌లో చక్కటి ఫలితాన్ని నమోదు చేసుకుంది. ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56కు ఎగసింది. అక్టోబర్‌లో ఈ సూచీ 55.5 వద్ద ఉంది. ధరల ఒత్తిడి తగ్గడం.. సమీక్షా నెల చక్కటి ఫలితానికి కారణమని ఈ మేరకు జరిగిన ఒక సర్వే వెల్లడించింది. కాగా ఎస్‌అండ్‌పీ పీఎంఐ 50 పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడితేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సూచీ వరుసగా 29 నెలల నుంచి వృద్ధి బాటలోనే కొనసాగుతోంది. తయారీ రంగం 2024లో కూడా పటిష్ట పనితీరును ప్రదర్శిస్తుందన్న ఆశాభావాన్ని సర్వేలో పాల్గొన్న ప్రతినిధులు వ్యక్తం చేశారు.

ప్రజల వద్ద మిగిలిన రూ. 2,000 నోట్ల విలువ

రూ. 9,760 కోట్లు

- 97.26% నోట్లు వెనక్కు వచ్చేశాయ్
- ఆర్‌బీఐ ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: చెలామణీలో ఉన్న రూ.2,000 నోట్లలో దాదాపు 97.26 శాతం బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక ప్రకటనలో పేర్కొంది. ఇంకా ప్రజల వద్ద దాదాపు రూ.9,760 కోట్ల విలువైన నోట్లు ఉన్నట్లు పేర్కొంది. ''రూ. 2,000 బ్యాంకు నోట్ల ఉపసంహరణ ప్రకటించిన 2023 మే 19న వ్యాపారం ముగిసే సమయానికి చెలామణీలో ఉన్న రూ. 2,000 బ్యాంకు నోట్ల మొత్తం విలువ రూ. 3.56 లక్షల కోట్లు. 2023 నవంబర్ 30 వ్యాపారం ముగిసే సమయానికి ఈ విలువ రూ.9,760 కోట్లకు తగ్గింది'' అని ప్రకటన వివరించింది. కాగా, నోట్లు ఇప్పటికీ మార్చుకునే వీలుందని ఆర్‌బీఐ వివరించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రాష్ట్ర రాజధానుల్లో ఆర్‌బీఐ కార్యాలయాలు ఉన్నందున, ఎవరైనా ఈ కార్యాలయాలకు వెళ్లలేని పక్షంలో పోస్టల్ శాఖ సేవలను పొందవచ్చని ఆర్‌బీఐ సూచించింది. కాగా, రూ.2,000 నోట్ల మార్పిడి లేదా డిపాజిట్ కోసం ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద పని వేళల్లో పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలను 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి. ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద వ్యక్తులు, కంపెనీలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను



ఒకసారి రూ.20,000 వరకు మార్చుకోవచ్చు. డిపాజిట్‌కు మాత్రం ఎటువంటి పరిమితి లేదు. 2016 నవంబరులో రూ.500, రూ.1,000 నోట్ల రద్దు తర్వాత ఆర్‌బీఐ రూ.2,000 నోట్లతోపాటు కొత్త రూ.500 నోట్లను పరిచయం చేసింది.

సత్యం కేసులో సెబీ తాజా చర్యలు

- రూ. 624 కోట్లు కట్టమంటూ ఆదేశాలు
- రామలింగరాజు, రామరాజుపై నిషేధం



న్యూఢిల్లీ: సత్యం కంప్యూటర్ సర్వీసెస్ కేసులో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా రూ. 624 కోట్లు కట్టమంటూ ఆదేశాలు జారీ చేసింది. కంపెనీ అప్పటి వ్యవస్థాపకుడు రామలింగరాజు, మరో నలుగురితో పాటు ఒక సంస్థకు ఈ ఆదేశాలు జారీ చేసింది. 14 ఏళ్ల క్రితం నాటి సత్యం కుంభకోణంలో చట్టవిరుద్ధంగా ఆర్జించిన సొమ్మును తిరిగి చెల్లించవలసిందిగా సెబీ స్పష్టం చేసింది. అంతేకాకుండా రామలింగరాజు, రామరాజులను సెక్యూరిటీల మార్కెట్ల నుంచి దాదాపు ఐదేళ్లపాటు నిషేధించింది. అయితే పెండింగ్‌లో ఉన్న వీరిరువురి అప్పీల్‌పై సుప్రీంకోర్టు నిర్ణయం మేరకు ఆదేశాల అమలు ఉంటుందని పేర్కొంది. రామలింగరాజు, రామరాజు, బి.సూర్యనారాయణ రాజు, వి.శ్రీనివాస్, జి.రామకృష్ణతో పాటు.. ఎస్‌ఆర్‌ఎస్‌ఆర్ హోల్డింగ్స్ అక్రమంగా సంపాదించిన రూ. 624 కోట్లను చెల్లించమంటూ 96 పేజీల తాజా ఆర్డర్‌లో సెబీ ఆదేశించింది. 2009 జనవరి 7 నుంచి వార్షిక వడ్డీ సహా అక్రమార్జనను చెల్లించవలసిందిగా స్పష్టం చేసింది.

సరికొత్త శిఖరంపై నిఫ్టీ

- 67 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- కలిసొచ్చిన విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు ప్రోత్సాహకర ఆర్థిక గణాంకాల నమోదు ప్రభావం...



ముంబై: వరుసగా నాలుగో రోజూ లాభాల జోరు కొనసాగించిన నిఫ్టీ కొత్త రికార్డు నెలకొల్పింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు, మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాల నమోదు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఆటో మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విద్యుత్, ఎఫ్‌ఎంసీజీ, యుటిలిటీ, రియల్టీ, మెటల్, కమోడిటీ, పారిశ్రామికోత్పత్తి షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఉదయం ఉత్సాహంగా మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం స్థిరమైన లాభాలతో కదలాడాయి. నిఫ్టీ 158 పాయింట్లు బలపడి 20,292 వద్ద కొత్త జీవితకాల గరిష్ట స్థాయిని నమోదు చేసింది. మార్కెట్ ముగిసే సరికి 135 పెరిగి 20,268 వద్ద స్థిరపడింది. ఈ ముగింపు కూడా నిఫ్టీకి సరికొత్త గరిష్ట స్థాయి కావడం విశేషం. మరో సూచీ సెన్సెక్స్ 493 పాయింట్లు పెరిగి రెండున్నర నెలల గరిష్టం 67,481 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 576 పాయింట్లు పెరిగి 67,564 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ నెలకొనడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.96%, 0.48% చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,590 కోట్లు, దేశీ ఇన్వెస్టర్లు రూ.1,448 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 7 పైసలు పెరిగి 83.30 వద్ద స్థిరపడింది. ''దేశీయ క్యూ2 జీడీపీ డేటా అంచనాలకు మించి నమోదవడంతో దలాల్ స్ట్రీట్ అప్‌ట్రెండ్ మూమెంటం కొనసాగింది. వడ్డీ రేట్ల పెంపునకు ఈసీబీ విరామం ఇవ్వొచ్చన్న ఆశలు, ఫెడ్ రిజర్వ్ ప్రసంగం నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లూ ర్యాలీ చేస్తున్నాయి. క్రూడాయిల్ ధరలు దిగువ స్థాయిలో ట్రేడవుతున్నాయి. పండుగ జోష్ కలిసి రావడంతో నవంబర్ ఆటో అమ్మక గణాంకాల్లో వృద్ధి నమోదైంది తయారీ రంగ యాక్టివిటీ ఊపందుకోవడంతో పాటు ప్రభుత్వ మూలధన కేటాయింపుతో మౌలిక, క్యాపిటల్ గూడ్స్ షేర్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. అయితే అధిక వాల్యుయేషన్లు సూచీల అప్‌సైడ్ మూమెంటంకు నిరోధంగా నిలిచాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- సెన్సెక్స్ నాలుగు రోజుల్లో 1,511 పాయింట్లు పెరగడంతో బీఎస్‌ఈలో 6.76 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.337.67 లక్షల కోట్ల వద్ద ముగిసింది. ఈ ఏడాది(2023) సెప్టెంబర్ 15న సెన్సెక్స్ 67,927 వద్ద ఆల్‌టైం హై స్థాయికి నమోదు చేసిన సంగతి తెలిసిందే.
- ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ షేరు ఇష్యూ ధర (రూ.304)తో పోలిస్తే 65% ప్రీమియంతో రూ.503 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 69% పెరిగి రూ.514 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 49% లాభంతో రూ.453 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ రూ.4,771 కోట్లు నమోదైంది.
- ఈ వారంలో బంపర్ లిస్టింగ్ సాధించిన ఐఆర్‌ఈడీఏ, టాటా టెక్నాలజీ, గంధార్ ఆయిల్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో వరుసగా 4%, 7.50%, 7% చొప్పున నష్టపోయాయి.

తగ్గిన వాహన విక్రయాల జోరు

ముంబై: పండుగ సీజన్‌లో నెలకొన్న డిమాండ్‌కు సరిపడేలా ఆటో కంపెనీలు డీలర్లకు సరఫరా పెంచడంతో నవంబర్‌లో ప్యాసింజర్ వాహనాల విక్రయాలు పర్వాలేదనిపించాయి. నవంబర్ నెలలో 3.35 లక్షల యూనిట్ల విక్రయాలు జరిగాయి. గత ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3.22 లక్షల వాహనాలతో పోలిస్తే ఇవి 3.9% అధికం. ''నవంబర్ 15 వరకు పండుగ సీజన్ డిమాండ్ కొనసాగడంతో పాటు ఉత్పత్తిని పెంచేందుకు సరిపడా ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల లభ్యత కారణంగా హోల్‌సేల్ అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాదిలో మొత్తం 41 లక్షల యూనిట్ల ప్యాసింజర్ వాహన విక్రయాలు జరగొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి'' అని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. టయోటా కిర్లోస్కర్, హోండా కార్స్, ఎంఅండ్‌ఎం కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదు చేయగా, మారుతీ, హ్యుందాయ్ మోటార్స్, ఎంజీ మోటార్స్ ఒక అంకె వృద్ధికి పరిమితమయ్యాయి. ద్విచక్ర వాహన విక్రయాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది.



నవంబర్ విక్రయాలు ఇలా..

కంపెనీ	2023	2022	వృద్ధి (%)
మారుతీ సుజుకీ	1,64,439	1,59,044	(+)3
హ్యుందాయ్ మోటార్స్	65,801	64,003	(+)3
టాటా మోటార్స్	74,172	75,478	(-)2
ఎంఅండ్‌ఎం	70,576	58,303	(+)21
హోండా కార్స్	8,730	7,051	(+)24
ఎంజీ మోటార్స్	4,154	4,079	(+)2
టయోటా కిర్లోస్కర్	17,818	11,765	(+)51
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	4,03,003	3,06,719	(+)31
హోండా	4,47,849	3,73,234	(+)20
హీరో మోటోకార్ప్	4,91,050	3,90,932	(+)25
టీవీఎస్ మోటార్స్	3,64,231	2,77,123	(+)31
రాయల్ ఎన్‌ఫీల్డ్	80,251	70,766	(+)13
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	5,194	4,903	(+)6
అశోక్ లేలాండ్	16,864	14,864	(+)13
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	8,258	7,960	(+)4
మహీంద్రా ట్రాక్టర్స్	32,074	30,528	(+)5



పాక్ సెలక్టర్‌గా 'మ్యాచ్ ఫిక్సర్'

ఫిక్సింగ్ ఉదంతంలో నిషేధానికి గురి కావడంతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించిన మాజీ ఆటగాడు సల్మాన్ బట్‌ను పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) జాతీయ జట్టు సెలక్టర్‌గా ఎంపిక చేసింది. అతనితో పాటు మరో ఇద్దరు మాజీలు కమ్రాన్ అక్మల్, ఇఫ్తికార్ అంజుమ్ కూడా సెలక్టర్లుగా ఎంపికయ్యారు. చీఫ్ కోచ్ వహాబ్ రియాజ్‌తో కలిసి వీరిద్దరు పని చేస్తారు. సల్మాన్ బట్ పాక్ తరఫున 33 టెస్టులు, 78 వన్డేలు, 24 టి20 మ్యాచ్‌లు ఆడాడు. 2010లో ఇంగ్లండ్‌తో జరిగిన లార్డ్స్ టెస్టులో కెప్టెన్‌గా ఉన్న బట్ సహచరులు ఆసిఫ్, ఆమిర్‌లతో నోబాల్స్ వేయించి స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడు. ఐసీసీ నిషేధంతో పాటు బట్‌కు 30 నెలల జైలు శిక్ష కూడా పడింది. అయితే 7 నెలలకే విడుదలైన బట్ 2016లో తిరిగి క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. దేశవాళీలో మంచి ప్రదర్శన కనబర్చినా... పాక్ జట్టు కోసం అతని పేరును మళ్లీ పరిశీలించలేదు. అయితే ఇప్పుడు సెలక్టర్‌గా అతను అధికారిక పదవిలోకి వచ్చాడు.

ఓటమి దిశగా న్యూజిలాండ్


తైజుల్

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ పరాజయానికి చేరువైంది. 332 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. డార్లీ మిచెల్ (44 నాటౌట్) మినహా ఇతర బ్యాటర్లంతా విఫలమయ్యారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ (4/24) నాలుగు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. విజయానికి కివీస్ మరో 219 పరుగులు చేయాల్సి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 212/3తో శుక్రవారం ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 338 పరుగులకు ఆలౌటైంది. ముష్ఫికర్ రహీమ్ (67), మెహదీ హసన్ మిరాజ్ (50 నాటౌట్) అర్ధసెంచరీలు చేశారు.

హైదరాబాద్‌కు మరో పరాజయం

విజయ్‌హజారే ట్రోఫీ


తన్మయ్

జైపూర్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్‌హజారే ట్రోఫీలో హైదరాబాద్‌కు 'హ్యాట్రిక్' పరాజయం ఎదురైంది. గ్రూప్ 'బి'లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర 3 వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. టోర్నీలో తొలి 2 మ్యాచ్‌లు నెగ్గిన హైదరాబాద్ ఆపై వరుసగా మూడు మ్యాచ్‌లలో పరాజయంపాలైంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (117 బంతుల్లో 103; 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించగా... కెప్టెన్ రాహుల్ సింగ్ (69), రాహుల్ బుద్ధి (58 నాటౌట్), రవితేజ (51 నాటౌట్) హాఫ్ సెంచరీలతో అండగా నిలిచారు. అనంతరం మహారాష్ట్ర 49.4 ఓవర్లలో 7 వికెట్లకు 316 పరుగులు సాధించింది. అంకిత్ బావ్నే (108 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) శతకానికి తోడు అజీమ్ కాజీ (80), కౌశల్ తాంబే (38), కెప్టెన్ కేదార్ జాదవ్ (32 నాటౌట్) రాణించి జట్టును గెలిపించారు. మరోవైపు చండీగఢ్‌లో ఆంధ్ర, గుజరాత్ జట్ల మధ్య జరగాల్సిన గ్రూప్ 'డి' మ్యాచ్ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది.

సిరీస్ చేతికందింది...

- నాలుగో టి20లో 20 పరుగులతో భారత్ గెలుపు
- 3–1తో సిరీస్ వశం
- గెలిపించిన అక్షర్ పటేల్
- రేపు ఆఖరి టి20

సిరీస్‌లోని గత మ్యాచ్‌లతో పోలిస్తే ఈ పోరు భిన్నంగా సాగింది. భారత జట్టు నుంచి చెప్పుకోదగ్గ భారీ షాట్లు లేవు. ఒక్క బ్యాటరూ అర్ధ సెంచరీ చేయలేదు. 200 పరుగులు అవలీలగా చేసిన ఈ సిరీస్‌లో కనీసం ఇక్కడ 180 పరుగులైనా చేయలేకపోయింది. అయినా సరే భారతే మ్యాచ్ గెలిచింది. ఆఖరి పోరుకు ముందే సిరీస్‌ను 3–1తో సాధించింది. బ్యాటర్ల అరకొర మెరుపులతో పాటు అక్షర్ పటేల్ (4–0–16–3) అద్భుతమైన స్పెల్ ఆసీస్‌ను ఓడించింది.


అక్షర్‌కు సహచరుల అభినందన

రాయ్‌పూర్: సొంతగడ్డపై ఆస్ట్రేలియా చేతిలో వన్డే ప్రపంచకప్‌ను కోల్పోయిన భారత్‌కు కాస్త ఊరట! పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా కంగారూపై సిరీస్‌ను కై వసం చేసుకుంది. నాలుగో టి20లో సూర్యకుమార్ సేన 20 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై నెగ్గింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. రింకూ సింగ్ (29 బంతుల్లో 46; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (27 బంతుల్లో 37; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. డ్వార్‌షుయిస్ 3, బెహ్రెన్‌డార్ఫ్, సంఘా చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఆసీస్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 154 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ మాథ్యూ వేడ్ (23 బంతుల్లో 36 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఓపెనర్ ట్రవిస్ హెడ్ (16 బంతుల్లో 31; 5 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అక్షర్ (3/16) స్పిన్‌తో, దీపక్ (2/44) పేస్‌తో దెబ్బ తీశారు. నాలుగో టి20లో భారత్ 4 మార్పులతో బరిలోకి దిగింది.


జితేశ్

తిలక్ వర్మ, ఇషాన్ కిషన్, ప్రసిధ్‌కృష్ణ, అర్ష్‌దీప్ స్థానాల్లో శ్రేయస్ అయ్యర్, జితేశ్ శర్మ, ముకేశ్ కుమార్, దీపక్ చహర్ తుది జట్టులోకి వచ్చారు. ఆస్ట్రేలియా కూడా నాలుగు మార్పులు చేసింది. క్రిస్ గ్రీన్, మెక్‌డెర్మాట్, డ్వార్‌షుయిస్, ఫిలిప్ తుది జట్టులో ఆడారు.

రాణించిన రింకూ, జితేశ్

ఓపెనర్లు యశస్వి, రుతురాజ్ (28 బంతుల్లో 32; 3 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించిన తర్వాత తడబడింది. స్వల్ప వ్యవధిలో జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ (8), సూర్యకుమార్ (1) అవుటయ్యారు. 13వ ఓవర్లో జట్టు స్కోరు వంద దాటింది. కాసేపటికి రుతురాజ్ ఆటను సంఘా ముగించాడు. ఈ దశలో రింకూ సింగ్, జితేశ్ శర్మ (19 బంతుల్లో 35; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ధాటితో భారత్ ఆ మాత్రం స్కోరు చేసింది. అయితే ధనాధన్ బాదాల్సిన డెత్ ఓవర్లలో 8 బంతుల వ్యవధిలోనే భారత్ 5 వికెట్లను కోల్పోయింది. 19వ ఓవర్లో జితేశ్‌తో పాటు అక్షర్ పటేల్ (0), ఆఖరి ఓవర్లో రింకూ సింగ్, దీపక్ చహర్ (0), రవి బిష్ణోయ్ (4) అవుటయ్యారు.

అక్షర్ స్పిన్ వలలో...

ఆసీస్ లక్ష్య ఛేదనను ధాటిగా ఆరంభించింది. 3 ఓవర్లలోనే చకచకా 40 పరుగులు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా... నాలుగో ఓవర్ నుంచి ఆట రూటు ఒక్కసారిగా మారింది. ఫిలిప్ (8)ను స్పిన్నర్ రవి బిష్ణోయ్ పడేయగా... అక్షర్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో హెడ్‌తో పాటు మెక్‌డెర్మాట్ (19), హార్డి (8)లను పడగొట్టడంతో ఆసీస్ కష్టాల్లో పడింది. తర్వాత వచ్చిన వారిలో కెప్టెన్ వేడ్ తప్ప ఇంకెవరూ భారత బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోయారు. చెప్పుకోదగ్గ పరుగులు చేయలేకపోయారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) మెక్‌డెర్మాట్ (బి) హార్డి 37; రుతురాజ్ (సి) డ్వార్‌షుయిస్ (బి) సంఘా 32; అయ్యర్ (సి) క్రిస్ గ్రీన్ (బి) సంఘా 8; సూర్యకుమార్ (సి) వేడ్ (బి) డ్వార్‌షుయిస్ 1; రింకుసింగ్ (ఎల్బీ) (బి) బెహ్రెన్‌డార్ఫ్ 46; జితేశ్ (సి) హెడ్ (బి) డ్వార్‌షుయిస్ 35; అక్షర్ (సి) సంఘా (బి) డ్వార్‌షుయిస్ 0; చహర్ (సి) క్రిస్ గ్రీన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 0; బిష్ణోయ్ రనౌట్ 4; అవేశ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 174. వికెట్ల పతనం:** 1–50, 2–62, 3–63, 4–111, 5–167, 6–168, 7–168, 8–169, 9–174. **బౌలింగ్:** హార్డి 3–1–20–1, బెహ్రెన్‌డార్ఫ్ 4–0–32–2, బెన్ డ్వార్‌షుయిస్ 4–0–40–3, క్రిస్ గ్రీన్ 4–0–36–0, తన్వీర్ సంఘా 4–0–30–2, మాథ్యూ షార్ట్ 1–0–10–0. **ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** హెడ్ (సి) ముకేశ్ (బి) అక్షర్ 31; ఫిలిప్ (బి) బిష్ణోయ్ 8; మెక్‌డెర్మాట్ (బి) అక్షర్ 19; హార్డి (బి) అక్షర్ 8; డేవిడ్ (సి) యశస్వి (బి) చహర్ 19; షార్ట్ (సి) యశస్వి (బి) చహర్ 22; వేడ్ నాటౌట్ 36; డ్వార్‌షుయిస్ (బి) అవేశ్ 1; క్రిస్‌గ్రీన్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 154. వికెట్ల పతనం:** 1–40, 2–44, 3–52, 4–87, 5–107, 6–126, 7–133. **బౌలింగ్:** దీపక్ చహర్ 4–0–44–2, ముకేశ్ 4–0–42–0, రవి బిష్ణోయ్ 4–0–17–1, అక్షర్ పటేల్ 4–0–16–3, అవేశ్ ఖాన్ 4–0–33–1.

హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో...

ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో సిరీస్‌లకు భారత మహిళల జట్లు

ముంబై: సొంతగడ్డపై భారత మహిళల క్రికెట్ జట్టు ఆడే రెండు కీలక సిరీస్‌ల కోసం బీసీసీఐ శుక్రవారం జట్లను ప్రకటించింది. ఈ రెండు టీమ్‌లకు కూడా హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వం వహిస్తుంది. ఇంగ్లండ్‌తో 3 టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడే భారత జట్టు ఆ తర్వాత ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో ఒక్కో టెస్టు మ్యాచ్ ఆడుతుంది. ఆసీస్‌తో టి20 సిరీస్‌కు టీమ్‌ను తర్వాత ప్రకటిస్తారు. ఈ మ్యాచ్‌లన్నీ ముంబై వేదికగానే జరుగుతాయి. ఈ నెల 6న భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి టి20 జరుగుతుంది.

ఇంగ్లండ్‌తో టి20లకు జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, జెమీమా, షఫాలీ, దీప్తి శర్మ,



యస్తిక, రిచా ఘోష్, అమన్‌జోత్, శ్రేయాంక, మన్నత్ కశ్యప్, సైకా ఇషాక్, రేణుకా సింగ్, టిటాస్ సాధు, పూజ వస్త్రకర్, కనిక ఆహుజా, మిన్ను మని.

ఇంగ్లండ్, ఆసీస్‌లతో టెస్టులకు జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, జెమీమా, షఫాలీ, దీప్తి శర్మ, యస్తిక, రిచా ఘోష్, స్నేహ్ రాణా, శుభ సతీశ్, హర్లీన్ డియోల్, సైకా ఇషాక్, రేణుకా సింగ్, టిటాస్ సాధు, రాజేశ్వరి గైక్వాడ్, పూజ వస్త్రకర్

భారత మహిళల ఓటమి

సాంటియాగో (చిలీ): హాకీ మహిళల జూనియర్ ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన భారత్‌కు తర్వాతి మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. టోర్నీ రెండో పోరులో జర్మనీ 4–3 గోల్స్ తేడాతో భారత మహిళల జట్టును ఓడించింది. భారత్ తరఫున అన్ను (11వ నిమిషం), రోప్నీ కుమారి (14వ ని.), ముంతాజ్ ఖాన్ (24వ ని.) గోల్స్ కొట్టగా...జర్మనీ తరఫున లౌరా ప్లూత్ (21వ నిమిషం, 36వ ని.), సోఫియా స్వాబ్ (17వ ని.), కరోలిన్ సీడెల్ (38వ ని.) గోల్స్ సాధించారు. తొలి క్వార్టర్‌లోనే 2 గోల్స్ సాధించి ముందంజలో నిలిచిన భారత్ మ్యాచ్ అర్ధ భాగం ముగిసే సరికి



కూడా 3–2తో ఆధిక్యంలోనే ఉంది. అయితే అనూహ్యంగా పుంజుకున్న జర్మనీ రెండో అర్ధభాగంలో రెండు నిమిషాల వ్యవధిలో 2 గోల్స్ కొట్టింది. ఆఖరి క్వార్టర్‌లో ఇరు జట్లూ పోరాడినా ఒక్క గోల్ నమోదు కాకపోగా, జర్మనీ తమ ఆధిక్యాన్ని చివరి వరకు నిలబెట్టుకుంది. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో బెల్జియంతో తలపడుతుంది.

సెమీస్‌లో ప్రియాన్షు

లక్నో: సయ్యద్ మోడి ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు ప్రియాన్షు రజావత్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో ప్రియాన్షు 21–15, 21–16 స్కోరుతో అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా)పై విజయం సాధించాడు. 49 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో వరల్డ్ జూనియర్ చాంపియన్ ఫర్హాన్‌పై ప్రియాన్షుదే పైచేయి అయింది. మహిళల డబుల్స్‌లో భారత జోడి అశ్విని పొన్నప్ప – తనీషా క్రాస్టో సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో అశ్విని – తనీషా 21–19, 21–8తో భారత్‌కే చెందిన గాయత్రి గోపీచంద్ – ట్రెసా జాలీని ఓడించారు.

అక్కడ అన్వయ్... ఇక్కడ సమిత్...


అన్వయ్

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ తన భార్య విజితతో కలిసి ఉన్న ఈ చిత్రం మైసూర్‌లోనిది. ద్రవిడ్ పెద్ద కుమారుడు సమిత్ ఇక్కడ జరుగుతున్న బీసీసీఐ దేశవాళీ టోర్నీ (అండర్–19) కూచ్ బెహార్ ట్రోఫీలో కర్నాటక తరఫున ఆడుతున్నాడు. ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు ద్రవిడ్ వచ్చాడు. మరో వైపు విజయవాడలో జరుగుతున్న అండర్–16 విజయ్‌మర్చంట్ ట్రోఫీలో ద్రవిడ్



చిన్న కుమారుడు అన్వయ్ బరిలో ఉన్నాడు. ఉత్తరాఖండ్‌తోనే జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలి రోజు కెప్టెన్, వికెట్‌కీపర్ అయిన అన్వయ్ 59 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

క్లుప్తంగా...

13, 14 తేదీల్లో బంజారా కాంక్లేవ్



పంజగుట్ట (హైదరాబాద్): ఒకే సంస్కృతి, జీవన విధానం, పండుగలు చేసుకునే బంజారా గోర్ సమాజాన్ని చైతన్యపరిచేందుకు ఈ నెల 13, 14వ తేదీల్లో నాగార్జునసాగర్‌లో బంజారా కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ, మాజీ మంత్రి దక్షిణ్ భారత్, మహారాష్ట్ర, మధ్య భారత్ బంజారా సేవాలాల్ సమితి వ్యవస్థాపకుడు రవీంద్ర నాయక్ తెలిపారు. ఈ మేరకు కార్యక్రమ ఆహ్వాన పత్రికను శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి జాతీయ కన్వీనర్ జి.రవినాయక్‌తో కలిసి మాట్లాడుతూ.. ఇక్కడ ఉన్న బంజారా గోర్ సమాజానికి మొత్తం 100 పార్లమెంట్, 400 అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటములను ప్రభావితం చేసే సత్తా ఉందన్నారు. కానీ వీరిని కేవలం ఓటువేసే యంత్రాల్లానే చూస్తూ, పాలనకు దూరం చేస్తున్నందున తమ సమితి ఆధ్వర్యంలో 11 రాష్ట్రాల్లో పర్యటించి వారిని చైతన్య పరుస్తున్నట్టు తెలిపారు.

మౌంట్ కోస్కియుస్కోను అధిరోహించిన యశ్వంత్



మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన గిరిజన యువకుడు భూక్య యశ్వంత్ ఆస్ట్రేలియాలోని మౌంట్ కోస్కియుస్కోపై జాతీయ పతాకాన్ని ఎగరవేశాడు. గతంలో జమ్మూకశ్మీర్‌లోని ఖర్దుంగ్‌లా, దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతాలను అధిరోహించిన యశ్వంత్ శుక్రవారం 2,228 మీటర్ల ఎత్తయిన మౌంట్ కోస్కియుస్కోపై జాతీయ పతాకాన్ని ఎగురవేశాడు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించాలన్న లక్ష్యంతో ఇటీవల బేస్ క్యాంపు ట్రెక్‌ను పూర్తిచేశాడు. త్వరలో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి భారతదేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలలకు చాటనున్నట్లు యశ్వంత్ తెలిపాడు. కాగా, యశ్వంత్‌తో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్‌లో మాట్లాడి అభినందనలు తెలిపారు.

మంత్రి కొప్పులపై దాఖలైన పిటిషన్ కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: 2018 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ధర్మపురి నియోజకవర్గం పరిధిలో ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని, కొప్పుల ఈశ్వర్ ఎన్నికను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరపున కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ తరపున అడ్లూరి లక్ష్మణ్ పోటీ చేశారు. కొప్పులకు 70,579 ఓట్లు, అడ్లూరికి 70,138 ఓట్లు వచ్చాయి. స్వల్ప మెజారిటీతో కొప్పుల విజయం సాధించారు. అయితే ఎన్నికల ఫలితాల ప్రకటనలో అవకతవకలు జరిగాయని, కొప్పుల ఈశ్వర్ ఎన్నిక అక్రమమని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. వీవీపీఏటీ స్లిప్స్‌లో తేడాలున్నాయని, రీకౌంటింగ్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై సుదీర్ఘ వాదనల అనంతరం జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. పిటిషనర్ వాదనలకు డాక్యుమెంటరీ ఎవిడెన్స్ లేని కారణంగా పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు పేర్కొన్నారు.

భద్రాద్రి జిల్లాలో మందుపాతర నిర్వీర్యం



బీ కొత్తూరు వద్ద మందుపాతరను నిర్వీర్యం చేస్తున్న దృశ్యం

కలివేరు– పెద మిడిసిలేరు రహదారిపై గుర్తించిన పోలీసులు

ముందుగా గుర్తించడంతో బలగాలకు తప్పిన ముప్పు

చర్ల: పోలీసు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన భారీ మందుపాతరను గుర్తించిన పోలీసులు శుక్రవారం దాన్ని నిర్వీర్యం చేశారు. దీంతో పోలీసు బలగాలకు పెనుప్రమాదం తప్పినట్లయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని కలివేరు–పెదమిడిసిలేరు ప్రధాన రహదారిపై బీ కొత్తూరు వద్ద వంతెనకు సమీపాన మావోయిస్టులు 30 కిలోల మందుపాతర ఏర్పాటు చేశారు. ఈ రహదారి మీదుగా సరిహద్దు అటవీప్రాంతానికి నిత్యం బలగాలు కూంబింగ్‌కు వెళ్లివస్తుంటాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వెళ్లే పోలీసులను మట్టుబెట్టేందుకు మావోయిస్టులు ఈ మందుపాతరను అమర్చగా, తనిఖీల్లో భాగంగా గురువారం ఉదయం గుర్తించారు. ఓ పక్క పోలింగ్ జరుగుతున్నందున దాన్ని నిర్వీర్యం చేస్తే వచ్చే శబ్దంతో ఓటర్లు భయభ్రాంతులవుతారని భావించిన పోలీసులు మందుపాతరకు ఉన్న ఎలక్ట్రిక్ వైర్లు తొలగించారు. శుక్రవారం ఉదయం బాంబు డిస్పోజల్ స్క్వాడ్ ఆధ్వర్యాన నిర్వీర్యం చేశారు. కాగా, ఈ మందుపాతరను మావోలు పేల్చినట్లయితే బస్సు లేదా లారీ వంటి భారీ వాహనం కనీసం 20 నుంచి 30 అడుగుల మేర ఎత్తు ఎగిరిపడి తునాతునకలయ్యేదని చెబుతున్నారు. మరోపక్క ఈ మార్గంలో ఇంకా మందుపాతరలు ఉండొచ్చనే భావించిన పోలీసులు నిశితంగా తనిఖీలు చేపడుతున్నారు.

మేథ్స్‌లో మనోళ్లు తగ్గుతున్నారు

- గణితంలో తగినంత సామర్థ్యం చూపలేకపోతున్న 49 శాతం మంది రాష్ట్ర విద్యార్థులు
- చిన్నపాటి లెక్కలకూ కాలిక్యులేటర్ లేదా ఆన్‌లైనే దిక్కు
- మాతృభాషలో చదవలేని వారు 19 శాతం మంది
- ఎన్‌సీఈఆర్‌టీ తాజా అధ్యయనంలో విస్మయకర అంశాలు



సాక్షి, హైదరాబాద్: వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఇటీవల కాలంలో గణితంలో గాడితప్పుతున్నట్లు జాతీయ విద్యా, పరిశోధన మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) చేపట్టిన అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా తెలంగాణ విద్యార్థుల్లో 49 శాతం మంది కనీస సామర్థ్యాలు చూపలేకపోతున్నారని సర్వే పేర్కొంది. ప్రధాన రాష్ట్రాల్లో విద్యార్థుల మాతృ భాషల అభ్యసనతోపాటు గణితం సామర్థ్యాన్ని మెరుగుపరచాలని ఎన్‌సీఈఆర్‌టీ సూచించింది. దేశవ్యాప్తంగా దాదాపు 10 వేల ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో దాదాపు 90 వేల మంది విద్యార్థుల సామర్థ్యాలను మదించి ఎన్‌సీఈఆర్‌టీ ఈ నివేదిక రూపొందించింది. ఇందులో తెలంగాణలో 180 స్కూళ్లకు చెందిన 1,500 మందికిపైగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించింది.

బేసిక్స్ కూడా అంతంతే..

ఈ అధ్యయనం నివేదిక ప్రకారం... ప్రాథమిక విద్య చదువుతున్న వారిలో చాలా మంది బేసిక్స్‌లోనూ బాగా వెనుకబడ్డారు. టెస్ట్ విద్యార్థుల్లో రెండంకెల లెక్కలకూ తడుముకొనే పరిస్థితి ఉంది. కరోనా కాలంలో విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలకు అతుక్కుపోవడం, స్వయం సామర్థ్యం పెంపు దెబ్బతినడానికి కారణమైంది. ఏ చిన్న లెక్కకైనా కాలిక్యులేటర్, ఆన్‌లైన్‌లో వెతుక్కొనే పద్ధతికి అలవాటయ్యారు. 8–10 తరగతుల విద్యార్థులు కాగితంపై లెక్కజేయడానికి అవసరమైన దానికన్నా రెండింతల సమయం తీసుకుంటున్నారు. మాతృభాషలో చదవలేని వారు 19 శాతం ఉన్నట్లు తేలింది. పట్టుమని పది పదాలు తప్పులు లేకుండా చదవగలిగిన వారు 6 శాతం, 20 పదాలు చదివిన విద్యార్థులు 13 శాతం ఉన్నారు. ఇక 70 పదాలు తప్పులు లేకుండా చదవగలిగే వాళ్లు 12 శాతమే ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా మూడో తరగతి వరకూ కనీసం అంకెలు కూడా గుర్తించలేని పరిస్థితి కనిపిస్తోంది. రెండంకెల కూడికలు, తీసివేతలు కూడా చేయలేని స్థితిలో 43 శాతం మంది మూడో తరగతిలో ఉన్నారని సర్వేలో గుర్తించారు. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎన్‌సీఈఆర్‌టీ కేంద్రానికి సూచించింది. ఈ నేపథ్యంలో ఏయే రాష్ట్రాలు ఎలాంటి చర్యలు అనుసరిస్తాయనే విషయమై స్పష్టత ఇవ్వాలని కేంద్ర విద్యాశాఖ అన్ని రాష్ట్రాలనూ కోరింది.

మేథమెటిక్స్‌లో కొన్ని రాష్ట్రాల్లో విద్యార్థుల పరిస్థితి ఇదీ... (శాతాల్లో)

రాష్ట్రం	కనీస స్థాయి లేనివాళ్లు	పాక్షిక సామర్థ్యం ఉన్న వాళ్లు	కనీస సామర్థ్యాలు ఉన్నవాళ్లు	ప్రమాణాలు మించి
తెలంగాణ	11	38	40	11
కేరళ	7	38	46	9
తమిళనాడు	29	48	20	3
కర్ణాటక	8	36	42	14
మహారాష్ట్ర	11	37	42	10
బిహార్	8	25	48	18
పశ్చిమ బెంగాల్	5	26	52	16
హరియాణా	8	41	45	6
గుజరాత్	18	44	31	7

టీచర్ల కొరతా కారణమే


ప్రభుత్వ పాఠశాలల్లో 18 సబ్జెక్టులను ఇద్దరు ఉపాధ్యాయులతో బోధిస్తున్నారు. ఉపాధ్యాయులకు బోధనకన్నా బోధనేతర పనులు అప్పగిస్తున్నారు. పైగా ఈ పనులకే కచ్చితత్వం ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో మేథ్స్ వంటి సబ్జెక్టుల్లో విద్యార్థులు సరైన ప్రతిభ చూపే అవకాశం లేదు. దీనిపై విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.
– పి.రాజాభాను చంద్రప్రకాశ్, అధ్యక్షుడు, రాష్ట్ర గెజిటెడ్ హెచ్ఎంల సంఘం

పేలుడు పదార్థాల సరఫరా కేసులో.. 8 మందిపై ఎన్ఐఏ చార్జిషీట్

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా దళాలపై పేలుళ్లు జరిపేందుకు కుట్ర పన్నిన ఎనిమిది మంది మావోయిస్టులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం చార్జిషీట్ దాఖలు చేసింది. మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తులపై 2023 జూన్ 5న చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. ఈ కేసుతో సంబంధం ఉన్న ఎనిమిది మంది నిందితులపై ఐపీసీ సెక్షన్ 120(బీ), 143, 147, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం సెక్షన్ 10,13,18,20ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొంది. పట్టుబడిన నిందితులు మావోయిస్టులకు కొరియర్లుగా పనిచేస్తున్నట్లు చార్జిషీట్‌లో తెలిపింది. మావోయిస్టులకు పేలుడు పదార్థాలు, డ్రోన్లు, లేథ్ మెషీన్లు సరఫరా చేస్తుండగా పునెం నాగేశ్వరరావు, దేవనూరి మల్లికార్జున రావు, వాల్లిపోగుల ఉమాశంకర్‌ను అరెస్టు చేశారు. ఆ తర్వాత వారి నుంచి సేకరించిన సమాచారం మేరకు జన్ను కోటి, ఆరేపల్లి శ్రీకాంత్, తాళ్లపల్లి ఆరోగ్యం, బొంత మహేందర్, సోనబోయిన కుమారస్వామిని అరెస్టు చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది. పునెం నాగేశ్వరావు, దేవనూరి మల్లికార్జునరావు, వాల్లిపోగుల ఉమాశంకర్‌లు 2023 మార్చిలో డ్రిల్ మిషన్, మే 2023లో ఒక లేథ్ మిషన్ కొనుగోలు చేసినట్లు తమ దర్యాప్తులో వెల్లడైనట్లు ఎన్ఐఏ పేర్కొంది. ఈ ముగ్గురు నిందితులు మే లో డ్రోన్లు, పేలుడు పదార్థాలు గుర్తించినట్లు తెలిపింది.

ఎంపీడీవో, పీఎస్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్

11న హాజరుపరచాలని మేడ్చల్ జిల్లా ఎస్పీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: అక్రమ నిర్మాణాల తొలగింపుపై నిర్లక్ష్యం వహించిన ఓ మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారి, పంచాయతీ సెక్రటరీపై హైకోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్‌లు జారీ చేసింది. ఈ నెల 11న కోర్టు ముందు ప్రవేశపెట్టేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీని ఆదేశించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం మజీద్‌పూర్‌లోని అక్రమ కట్టడాలపై పంచాయతీ సెక్రటరీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై జనవరి 23న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని మజీద్‌పూర్‌కు చెందిన అశోక్‌రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. అక్రమ నిర్మాణాల తొలగింపుపై నివేదిక అందజేయాల ని ఆదేశించి ఐదునెలలు దాటినా ఇప్పటివరకు ఎందుకు సమర్పించలేదని ప్రశ్నించింది. మూడుసార్లు వాయిదాలు కోరి ఇప్పుడు ఎన్నికలని చెప్పడంపై మండిపడింది. దీనిపై కోర్టుకు నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని గతనెల విచారణకు రాకపోవడం బాధ్యతారాహిత్యమేనని, సస్పెండ్ చేసి ఉద్యోగాలు తీసేస్తే అప్పుడు తెలుస్తుందని పేర్కొంది. ప్రతివాదులైన ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేయక తప్పడం లేదని చెప్పింది. తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది.

సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు అరెస్ట్

ఎఫ్ఎంసీజీ కేసులో రిమాండ్



సాక్షి, హైదరాబాద్: 'నీది నాది ఒకే కథ', గర్ల్ ఫ్రెండు' సినిమాల నిర్మాత అట్లూరి నారాయణరావును ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) దందా కేసులో సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. కేసులో అసలు సూత్రధారి గుధే రాంబాబు హైదరాబాద్‌లో ఎఫ్ఎంసీజీ స్థాపించి మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం) పేరిట అధిక వడ్డీలు ఆశ చూపి వందలాది మంది నుంచి రూ.540 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశాడు. బాధితుల ఒత్తిళ్ల నేపథ్యంలో రాంబాబు ఓ చార్టెర్డ్ అకౌంటెంట్ ద్వారా నిర్మాత నారాయణరావును కలవగా, తన పలుకుబడితో కేసు లేకుండా చేస్తానని, ఇందుకు అన్ని ఖర్చులకు గానూ రూ.20 కోట్లు డిమాండ్ చేశాడు. బేరసారాల తర్వాత రూ.2 కోట్లకు అంగీకరించిన నారాయణరావు అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు, రూ.కోటి విలువైన బంగారు ఆభరణాలు తీసుకున్నాడు. ఆభరణాలను పాత బస్తీలో కరిగించి రూ.90 లక్షలకు అమ్మేసి సొమ్ము చేసుకున్నాడు. నారాయణరావును అరెస్టు చేసిన సీసీఎస్ పోలీసులు అదనపు విచారణ కోసం పోలీసు కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ శుక్రవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కస్టడీలోకి తీసుకున్న తర్వాత బంగారం రికవరీ చేయాలని భావిస్తున్నారు.

రాష్ట్రానికి వర్షసూచన



నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు!.. 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గనున్న ఉష్ణోగ్రతలు

బంగాళాఖాతంలో 3న తుపానుగా మారనున్న వాయుగుండం

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండురోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఆగ్నేయ, పరిసర నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం క్రమంగా బలపడుతూ ఈనెల 2న తీవ్ర వాయుగుండంగా మారుతుందని పేర్కొంది. ఆ తర్వాత వాయువ్య దిశగా కదిలి 3న నైరుతి బంగాళాఖాతంలో తుపానుగా మారనున్నట్లు వివరించింది. ఆ తర్వాత కూడా వాయవ్య దిశగానే ప్రయాణించి దక్షిణ ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీర ప్రాంతంలోని చెన్నై, మచిలీపట్నం మధ్య ఈనెల 4వ తేదీ సాయంత్రానికి తీరం దాటుతుందని తెలిపింది. ఈ నేపథ్యంలో శని, ఆదివారాల్లో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతుండగా, రానున్న మూడురోజుల్లో 2 డిగ్రీ సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర తగ్గే అవకాశం ఉన్నట్లు తెలిపింది. శుక్రవారం ఖమ్మంలో 34.4 డిగ్రీ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్టంగా మెదక్‌లో 17.4 డిగ్రీ సెల్సియస్ నమోదైంది.

గురువారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్)

కేంద్రం	కనిష్ఠ ఉష్ణోగ్రత
ఆదిలాబాద్	21.4
భద్రాచలం	21.0
హకీంపేట్	19.0
దుండిగల్	19.2
హనుమకొండ	20.0
హైదరాబాద్	20.6
ఖమ్మం	20.6
మహబూబ్‌నగర్	21.3
మెదక్	17.4
నల్లగొండ	21.4
నిజామాబాద్	19.7
రామగుండం	19.2

పనివేళల్లో ప్రైవేటు ప్రాక్టీస్ చేయొద్దు

వైద్య కళాశాలల అధ్యాపకులకు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేట్, ప్రభుత్వ వైద్య కళాశాలల అధ్యాపకులు పనివేళల్లో ప్రైవేట్ ప్రాక్టీస్‌కు దూరంగా ఉండాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు అన్ని వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులు ఇచ్చింది. టీచింగ్ ఫ్యాకల్టీలు వారి పనివేళల్లో అంటే ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రాక్టీస్ చేయొద్దని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఉత్తర్వులు ఇచ్చింది. పనివేళల్లో ఎవరైనా వైద్యులు ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించినట్లయితే, అది వైద్య నైతిక నియమావళిని ఉల్లంఘించినట్లుగా భావించి, వారి రిజిస్ట్రేషన్ నంబర్లను తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ మెడికల్ రిజిస్ట్రీ నుంచి తొలగిస్తామని హెచ్చరించింది.

నేటినుంచి విశాఖలో లెజెండ్స్ క్రికెట్

ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ స్టేడియంలో ముగిసే లీగ్‌దశ చివరి ఫేజ్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లు ఎల్ఎల్‌సీ నాకవుట్‌కు చేరుకుంటాయని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి తెలిపారు. లెజెండ్స్ లీగ్ క్రికెట్ (ఎల్ఎల్‌సీ)లో చివరి దశ పోటీల్లో భాగంగా శనివారం తలపడనున్న జట్ల ఆటగాళ్లు శుక్రవారం విశాఖ చేరుకున్నారని చెప్పారు. నాకవుట్ పోటీలు సూరత్‌లో జరుగనున్నాయన్నారు. ఇండియా కాపిటల్స్, మణిపాల్ టైగర్స్, గుజరాత్ జెయింట్స్‌తో పాటు సదరన్ సూపర్‌స్టార్స్ జట్ల సభ్యులు విశాఖ చేరుకోగా ఎయిర్‌పోర్టులో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ఘనంగా స్వాగతం పలికిందని తెలిపారు. అర్బన్‌రైజర్స్ జట్టు శనివారం విశాఖ చేరుకోనుందని చెప్పారు.

విశాఖలో మ్యాచ్‌లు..

శనివారం రాత్రి ఏడుగంటలకు ఇండియా కాపిటల్స్ జట్టుతో మణిపాల్ టైగర్స్ తలపడనుండగా, ఆదివారం మధ్యాహ్నం మూడుగంటలకు గుజరాత్ జెయింట్స్‌తో సదరన్ సూపర్‌స్టార్స్ జట్టు తలపడనుంది. 4వ తేదీ రాత్రి ఏడుగంటలకు లీగ్ దశలో చివరి మ్యాచ్ రాత్రి ఏడుగంటలకు మణిపాల్ టైగర్స్‌తో అర్బన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు తలపడనుంది.

నేటి నుంచి మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు

- ఏవోబీలో పోలీస్ బలగాల భద్రతా చర్యలు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర, ఒడిశా బోర్డర్(ఏవోబీ)లో పోలీస్ బలగాలు భద్రతా చర్యలు చేపట్టాయి. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్, క్యాప్ పార్టీల పోలీస్ బలగాలు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. జిల్లాలోని చింతూరుకు సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలు ఉన్న నేపథ్యంలో అక్కడ కూడా పోలీస్ బలగాలు సరిహద్దులో గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఎస్పీ తుహిన్‌సిన్హా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోని మావోయిస్టు ప్రభావిత జిల్లాల ఎస్పీలతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.మావోయిస్టుల వారోత్సవాలు ముగిసేంత వరకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు మారుమూల గ్రామాల పర్యటనలు రద్దు చేసుకుని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని నోటీసులు జారీ చేసినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

క్యాచ్ ద ట్రాప్..!

- వన్యప్రాణుల వేట నిరోధానికి అటవీ శాఖ స్పెషల్ డ్రైవ్
- అడవుల్లో జంతువుల వేటకు వలలు, ఉచ్చులు, లైవ్ వైర్లు, పేలుడు పదార్థాలు ఉపయోగించకుండా చర్యలు
- అటవీ ప్రాంతాల పరిశీలన ద్వారా వేటగాళ్ల గుర్తింపు
- వేటగాళ్ల సమాచారం తెలిస్తే అధికారులకు చెప్పేందుకు టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులోకి..

సాక్షి, హైదరాబాద్: వన్యప్రాణుల వేట నిరోధానికి స్పెషల్ డ్రైవ్ 'క్యాచ్ ద ట్రాప్'కార్యక్రమాన్ని రాష్ట అటవీ శాఖ ప్రారంభించింది. అడవుల్లో జంతువుల వేటకు వలలు, ఉచ్చులు, లైవ్ వైర్లు, విషపదార్థాలు, పేలుడు పదార్థాలు వంటివి ఉపయోగించకుండా కార్యాచరణను శుక్రవారం మొదలు పెట్టింది. ఇందులో భాగంగా అటవీ ప్రాంతాల పరిశీలన ద్వారా వేటగాళ్ల గుర్తింపు, పరికరాల స్వాధీనం, గత రికార్డులు, కేసుల ప్రకారం సోదాల నిర్వహణ వంటివి అమలు చేస్తోంది. వివిధ రకాల వలలు, ఉచ్చులు, లైవ్ వైర్లు ఉపయోగించి అటవీ జంతువులను చంపడం/వేటాడటాన్ని గతంలోనే నిషేధించడం తెలిసిందే.

వేటకు అడ్డుకట్ట..: అడవి జంతువుల నుంచి వ్యవసాయ పంటల నష్ట నివారణకు కొందరు, అటవీ జంతువుల మాంసం వినియోగం, వ్యాపారానికి మరికొందరు సాగిస్తున్న జంతువుల వేటకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతోంది. ఈ ప్రత్యేక డ్రైవ్ లో అధికారులు వీలైనన్ని అటవీ ప్రాంతాలను పరిశీలించి వేటగాళ్లను గుర్తించడంతో పాటు వారు వాడే పరికరాలను స్వాధీనం చేసుకోవటం వంటి చర్యలను చేపడుతున్నారు. గత రికార్డులు, కేసులను పరిశీలించి అనుమానితులను సోదా చేసి వేటకు ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ముందుగా అడవిని ఆనుకుని ఉండే వ్యవసాయ క్షేత్రాలు, గ్రామాలు, ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న అన్ని వేటలకు ఉపయోగించే మెటీరియల్/పరికరాలు సరిగ్గా రికార్డ్ చేయటంతో పాటు, సురక్షితమైన కస్టడీ కోసం వాటిని హైదరాబాద్‌కు రవాణా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రోత్సాహం అందించనున్నారు.

వేట సమాచారం ఇస్తే రివార్డులు..: వేటకు సంబంధించి సమాచారాన్ని ఇచ్చే ఇన్‌ఫార్మర్‌లకు తగిన రివార్డులు అందజేయనున్నారు. అయితే వారి గుర్తింపును రహస్యంగా ఉంచనున్నారు. చట్టవిరుద్ధమైన వేట, అందుకోసం ఉపయోగించే వస్తువుల సమాచారం తెలిస్తే సంబంధిత జిల్లా అటవీ అధికారికి లేదా 9803338666 నంబర్‌కు, లేదా టోల్ ఫ్రీ నంబర్ 18004255364కు తెలియజేయవచ్చునని అటవీ శాఖ సూచించింది..

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.